C. Suryanarayana Garu.
Advocate
Rajahmundry
13/[illegible]

ఉదయిని

సాహిత్య పత్రిక: రెండు నెలల కొక సంచిక

సంపాదకుడు

కొంపెల్ల జనార్దనరావు

సహసంపాదకుడు

ఆచంట జానకిరామ్

ఆగస్టు ౧౯౩౬

సంపుటము 1 చందా రు ౪

సంచిక ౬ ప్రతి అ ౧౨

15 ఆదెప్పముదలివీథి, వేపేరి, మద్రాసు

విన్నపము

‘ఉదయిని’కి ఈ సంచికతో ఒక సంపుటము పూర్తి. ఇప్పటికీ చాలామంది చందాదార్లు చందాలు పంపవలసే ఉన్నారు. వెంటనే వారందరూ దయచేసి చందాలు పంపితే కాని మా భారము దుర్భరము. సంచిక రూపమునూ, ప్రతిఒక్కంటికి రెండణాలవంతున అయే తపాలఖర్చునూబట్టి మా శ్రమ ఊహించ వీలవుతుంది. అన్ని సంచికలూ తీసుకొని వీపీలు తిరగగొట్టగల పెద్దలకు చెప్పే దేమీ ఉండదు.

వచ్చే సంపుటమునుండి, వచ్చే అక్టోబరునుండి, ‘ఉదయిని’ మాసపత్రికగా వెలువడనై ఉన్నది. చందా మామూలుగా ఇచ్చే నాలుగురూపాయలే. పాత చందాదారులు ప్రస్తుతము ‘ఉదయిని’ అక్కరలేదని తోచినవారు మాకు తెలుప వేడెదము. తక్కిన వారు చందా ముందుగా పంప వేడెదము, లేదా, తొలిసంచిక రు 4-4-0 (నాలుగు రూపాయల నాలుగణాలకు) వి.పి. పంపగలము: దయచేసి అది స్వీకరించ వేడెదము. క్రొత్త చందాదారులున్ను ముందుగా చందా పంపితేనే కాని సంచిక పొందజాలరు. సాధ్యమైనంతవరకూ వి.పి. పద్ధతి తగ్గించడమే ఉభయత్ర మంచిదని విన్నవిస్తున్నాము.

ఏజెన్సీలు పొందగోరేవారు తెప్పించుకొనే ప్రతుల సంఖ్యనుబట్టి ధరావతు కట్టవలసి ఉంటుంది. ఇతర వివరాలకు మా కార్యాలయానికి వ్రాయగోరెదము.

‘ఉదయిని’ కార్యకర్త

విరాళము

	రు
శ్రీ నాళం బ్రహ్మానందరావుగారు కాకినాడ	౧౦

విషయసూచిక

కిరణాలు .. ..

సంపాదకుడు ౪౧౯

కవిత : .. ..

ఒకనాటి రేయి .. ..

కృష్ణశాస్త్రి ౪౨౧

అస్థిప్రసాదనము .. ..

విశ్వనాథ సత్యనారాయణ ౪౨౨

ఉపహారము .. ..

పింగళి లక్ష్మీకాంతం

కాటూరి వెంకటేశ్వరరావు ౪౨౪

స్త్రీ .. ..

మల్లవరపు విశ్వేశ్వరరావు ౪౨౭

ఇద్దరు నవకవి మిత్రులకు .. ..

నోరి నరసింహశాస్త్రి ౪30

అభిమన్యుడు .. ..

కొడాలి ఆంజనేయులు ౪3౧

ప్రేతభూమి .. ..

పురిపండా అప్పలస్వామి ౪3౨

కొత్త చెప్పులు .. ..

'కరుణకుమార' ౪33

ఆద్యంతాలు .. ..

వెంపటి సాగరభూషణం ౪౫0

నాటకములు, నాటకకళ .. ..
పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు ౪౬౨

‘ఏకవీర’ .. ..
ఆచంట జానకిరామ్ ౪౭౧

విద్యార్థి .. ..
కొంపెల్ల జనార్దనరావు ౪౭౯

శేషమ్మ—A STUDY .. ..
‘చలం’ ౪౮౫

లేఖలు .. ..
ఎమ్. వి. వి. క. రంగాచార్యులు
పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు ౫౦౦

వాఙ్మయపీథి ౫౦౯

శృంగాటకం ౫౧౪

ఉ ద యి ని

సా హి త్య ప త్రి క

సంపుటము 1 — ధాత, శ్రావణము

సంచిక ౬ — శా. శ. ౧౮౭౮

కి ర ణా లు

'ఉ ద యి ని'

'ఉదయిని' ఈ సంచికతో ఒక సంపుటము పూర్తిచేసిన దవుతుంది. ఎన్ని ఇబ్బందులు గడవవలసివచ్చినా, 'ఉదయిని'కి అభ్యుదయమే నిరంతరము అభయమిచ్చి నడిపిస్తున్నది. ఇందుకు కారణభూతమైనవి దానకర్తలయూ, చందాదారులయూ తోడ్పాటూ, సహానమూ మిక్కిలి కృతజ్ఞతాపాత్రములు. అంతే కాక, లోధ్ర ముద్రణాలయాధికారుల సహానమున్ను, సౌహార్దమున్ను ప్రత్యేకప్రశంసకు పాత్రములు.

కొత్త అధ్యాయము

రెండవ సంవత్సరము—లేదా, రెండవ సంపుటము—ప్రవేశించడమే పత్రికకు కొత్త అధ్యాయము ప్రారంభమైనట్టు. తాను పడిన శ్రమలకూ, తనకు చేకూరిన ఆదరములకూ నడుమ ఆదరములవిజయమే మిగిలి పత్రిక ప్రజాసేవకు ఇంకా నోచుకొన్నదవుతున్నది. ఆ ఆదరమును ఆధారముచేసుకొన్న ధైర్యముతోనున్ను, సేవాపరాయణత ఇనుమడిగా చూపే పూనికతోనున్ను, కార్యమందలి అమితాసక్తివల్లనున్ను 'ఉదయిని'ని కొత్తసంపుటమునుండి మాసపత్రిక చేయ సంకల్పిస్తున్నాము. ఇకపైని వేళపట్టుకు సరిగా పత్రిక అందజేయగలమనే ధైర్యము కలుగుతున్నది. రావలసిన చందాలు సరిగా వసూలయిఉంటే, ఇదివరకైనా పత్రిక కష్టము లేకుండా సరిగా వచ్చి ఉండేది. అయితే, ప్రతికూలస్థితు లన్నిటికి పైని, అభిమానము లేని చందాదారు ఒక్కరూ లేరనే అనుభవాన్ని గుర్తించి తీరినాము. ఇకపైని మరింత అభిమానముతో తెలుగువారు మా ఉద్యమానికి తోడ్పాటు చూపి పత్రికను వినియోగపరుచుకోగలరనే నమ్మికతో 'ఉదయిని'ని మాసపత్రికగా మార్చ సమకట్టుతున్నాము.

మాసపత్రిక 'ఉదయిని'

మాసపత్రిక కావడంవల్ల 'ఉదయిని'కి రాగల అదనమైన ఒత్తిడికి జడుపుకలిగి చందా నాలుగు రూపాయలనుండి ఐదు రూపాయలకు పెంచవలె ననే పెద్దలసూచన కొంత ఆకర్షకముగా లేకపోలేదు. కేవలము ఇప్పటిపుటలలో సగమువంతు పుటలతో సంచిక మిక్కిలి చిన్నదై సుష్ఠుగా కనబడదు కాబట్టి దాదాపు అరవైపుటల గ్రంథము శ్రమ పడి కూర్చి, ప్రతిసంచికయందూ ప్రకటించడం ఇంపుగా కనవస్తున్నది. అట్టియెడల ఆ నాలుగురూపాయలకే పన్నెండు సంచికలు అందజేయడం కొంచెము కష్ట సాధ్యమే అయినప్పటికీ, చందాదారులకు అదనముగా శ్రమ యీయకయే పత్రికను జాగ్రత్తగా నిర్వహించి నెగ్గించవలెనని యెంచినాము. ఇది నిర్వాహకులకు శ్రమ దాయకమనుటలో సంశయము లేదు. కాని, ఈ మార్పువల్ల ప్రజాదరము మెండుగా లభిస్తుందనే ఆశ బలీయముగా ఉన్నది. ముఖ్యముగా పత్రికవిజయానికి అమూల్య సామగ్రి యైన రచయితలకు మా కృతజ్ఞత ఉచిత రీతిని వెల్లడించలేము. ఈపైని మరింత వారిపై బరువు మోపి మా ఋణిత్వాన్ని పెంచుకొని వారి వాత్సల్యాన్ని సమర్థించడం మాకు తీరని కర్తవ్యమై నిలుస్తున్నది. 'ఉదయిని' తొలీమాససంచిక యీ విజయదశమికి (అక్టోబరు 25) వెలువడుతుంది.

*   *   *   *   *

నవ్యసాహిత్యపరిషత్పత్రిక

ఆంధ్రదేశంలో చిరకాలంగా సాహిత్యపరిషత్తు ఒకటి ఉండగా నవ్యసాహిత్య పరిషత్తు అని యింకొకటి యేర్పడడం ఒక పెద్ద సంఘటనమని చెప్పవలెను. కాని ఆంధ్రసాహిత్యపరిషత్తు పుట్టుకయే నవ్యగతులయెడ వైరుధ్య మొకటి పురస్కరించుకొని జరిగిఉన్నపుడు, ఈ నవ్యసాహిత్యపరిషత్తు ఏర్పడడంలో వింత లేదు. ఆ యేర్పడడంవల్ల నవ్యసాహిత్యానికిగల శక్తిమత్త్వముమాత్రం వెల్లడి అవుతున్నది. మరిన్నీ, కేవలము ధనాఢ్యుల ప్రత్యేకాదరాన్ని ఆధారము చేసుకొని కాక, తదీయుల దీక్షోత్సాహముల యందే ఆశపెట్టుకొని యేర్పడ్డ నవ్యసాహిత్యపరిషత్తు దేశాన్ని ఆకర్షిస్తున్నదంటే దాని ఉనికికి కావలసినంత శుభకామన చేకూరిన దన్నమాట. దాని ముఖ్యమైన పరికరం నవ్య సాహిత్యపరిషత్పత్రిక అయిన 'ప్రతిభ'[1] వెలువడింది. వ్యక్తులుగా నవ్యసాహిత్యపారి షదులున్నూ 'ఉదయిని'కి ప్రాపులైనవారై, సంస్థతరఫున 'ప్రతిభ'ను వెలువరచడానికి

---

1 'ప్రతిభ'ను గురించిన సమీక్ష ఈ సంచిక 'వాఙ్మయవీథి' కలములలో చూచేది.

నడుముకట్టినారంటే, 'ప్రతిభ'కూ 'ఉదయిని'కీగల నెయ్యముమాట చెప్పనక్కరలేదు. 'ప్రతిభ' 'ఉదయిని'కి తోడై యాత్రాగతికి జీవమూ, సొగసూ పెంపొందించగలదనే ఆశ తప్పక సార్థకము కాగలదు.

రెండు పరిషత్తులు

అనేకవిధాల ఆంధ్రసాహిత్యపరిషత్తు అనల్పమైనసేవ సారస్వతానికి చేస్తున్నద యిన్ని, కొన్ని ముఖ్యధర్మాలు ఉపేక్షించి యింకొక పరిషత్తుకు అవసరం ఏర్పరచడంలో దృష్టివైశాల్యము చాలమికి విమర్శపాల్పడ్డది. కొత్తగా ఏర్పడ్డ నవ్యసాహిత్యపరిష త్తున్ను తిరిగి ఆలాటి విమర్శకే పాల్పడకుండా ఉండడానికి అవకాశ మున్నది. నిజానికి ఇరుపక్షాల వైరుధ్యము ఎక్కువ గణనకు నిల్వరానిదని యిటీవలి స్థితిగతులు నిరూపిస్తు న్నవి. నవ్యకవులు ఆ పక్షమువారి మెప్పులు సహా పొందినపుడు నవ్యకవితలోని నికృష్టరచనలపై విరోధము ఆధారపరుచుకోడం ఉత్కృష్టమైనపద్ధతి కాదని చెప్ప నక్కరలేదు. వాడుకనుడికారము రచనయందు ప్రవేశ పెట్టగలిగినవారూ, గ్రాంథి కములో సహా అందెవేసిన పాండిత్యనిధులై వాడుకభాషలో చక్కని రచనకు పూను కొన్నవారూ ఇంకొక వైరుధ్యము తగ్గించగలుగుతున్నారు.

వాఙ్మయములో సంప్రదాయసిద్ధమైన ఉనికి గలదై, నేటి విశిష్టభావ గతినిబట్టి వాఙ్మయనిర్మాణక్రమంలో కొన్ని మెట్లుగా ఆభిజాత్యానికి నోచుకొన్నదై, నుడికారానికి ఎక్కువ ఆనుకూల్యము ప్రసాదించిన పూజ్యత గడించి యెంతో ఉత్కృష్ట రచనలు దేశములో మేలుకొల్పి, పెక్కుకలాల మోజుకు నోచుకొన్నదై బిగిసి వాడుక భాష శక్తి పెంచుకొన్న యీరోజులలో, కొన్నిగుణాలు విస్మరించీ, కొన్ని లోపాలు విస్తరించీ దానిని అపాకరింప చూడడంకంటె,—వ్యవస్థలేమికి గర్హించడంకంటె,— కళాశాలుల, వ్యుత్పన్నుల కలాల చైతన్యవికాసంలో దాని భవిష్యత్తు భద్రపరచడం శ్రేయస్కరమని యెంచదగును. ఇందులకై వేచిఉండడమే కాక, వ్యవసాయములు సాగించడానికి తమ త్రోవల తాము 'ప్రతిభ'వంటి మంచిరకం పత్రికలు చాలా నిర్వా హకములు కాగలవన్నది అనుభవము చెపుతున్న సంగతి.

అయితే వీటిబ్రతుకు అంత సులభమైనది కాకపోవచ్చు. నికృష్టవాఙ్మయముతో, వేలకువేలు రూపాయల యెత్తునకు జనకోటి కౌతుకపడుతుండగా, ఉత్కృష్టవాఙ్మయ మూ, పగిడీచుట్టిన పత్రికలూ పొందుతున్న కడగండ్లు బిగువౌతున్నమాట నిజమే కాని, కొంతపరిశ్రమమీదట రుచిగల హృదయాలు వందలుగా లేచిరావడానికి చాలా అవకాశం ఉన్నది.

నికృష్ట వాఙ్మయం

కనుకనే, ఎంతటి నికృష్టవాఙ్మయవిజృంభణాన్ని అణచడానికైనా, ప్రభుత్వాధికారాలు దండము ధరించి రావలెనని తత్తరపడ నక్కరలేదు. కాని జనబాహుళ్యము రుచులు విరిగిపోకపూర్వము అలాటి వాఙ్మయగతులు అరికట్టడానికి మంచి పత్రికలూ, సంస్కృతిగల వ్యక్తులూ, సంస్థలూ పూనుకోక వగచి లాభము లేదు. ఈ సూక్ష్మవిషయాలలో, ఎక్కడ ఆగవలెనో తెలియని ప్రభుత్వదండముమారు రుచిదండమే యెక్కువ అనుకూలమైనదనే నమ్మిక వాఙ్మయవికాసానికి ఆస్పదమిస్తుంది.

వా స్త వి క త

వాస్తవికత, లోకవృత్తానుకరణం, (**Realism.**) నేటి సారస్వతములో మిక్కిలి విశృంఖలముగా కలము నడుపుతున్న శక్తులలో ఒకటి. చిరాగత సంప్రదాయసిద్ధములైన రుచి మార్గాలకు భిన్నములయిన్ని కావ్యౌచిత్యాన్ని మిన్నగా పాటించే మంచి రచనలు నేటివి కొన్ని అరుచికరములైన రచనలతోపాటు గణింపబడి అక్రమముపాలు కావడం లేకపోలేదు కాని, ఆ మంచిరచనల సామ్యాభాసములో నికృష్టరచనలు విజృంభించడంమాత్రం చాలా శోచ్యమైనస్థితి యేర్పరుస్తున్నది. ఈవిషయమై 'త్రివేణి' యీ జూలై సంచికయందు తత్సంపాదకులు తమ సహజభావుకమైన అమర్షముతో ఆంధ్రులకూ ఆంధ్రేతరులకూకూడా చూపిన రుచిస్థానము గమనించదగ్గది. అయితే యీ రోచకిత్వాన్ని ప్రయోగించుకొనడంలో, ఆధునికమైన భావగతులవల్ల—ఒక నిరీశ్వరత, చార్వాకత, ప్రకృతి శాస్త్రోల్లప్రోద్భలము, వట్టినైరాశ్యము, ఇన్నిన్నిటివల్ల, —ఉద్గతమై గంభీరమూ సుందరమూ కాగల సాహితీవాణిని సంప్రదాయపరాయణతలో, గ్రుడ్డి ఆభిజాత్యములో నొక్కివేయక కాపాడడానికి శ్రద్ధ వహించడం చాలా అవసరం.

కొంపెల్ల జనార్దనరావు

ఒక నాఁటి రేయి

ఒక నిముసంపు నిద్దురయు నొత్తని నా కనురేకు లెన్నఁడే
నిఁక ముకుళింప వేమొ చదలేటిసుమాలయి; నిర్నిమేష తా
రకల విధాన వేసటలు రాని నిరీక్షణ శ్యామికా ప్రతో
ళికల పదేపదే కలవరించెడి కోరిక చీల్చుచుండునా?

ఈ శరదిందుమూర్తి హసియింపఁడు చల్లఁదనాలజల్లు లా
శాశల, నా దరిద్రగగనాంతర సైకతపాళి కూఁక జ్యో
త్స్నా శిశిరమ్ము కాదు, కఱిచాయల పాయలు పాయలై నిశా
కైశిక మూరకే ఇముడకే ముడిలో విడఁబాఱు నెల్లెడన్.

ఆ సుకుమారకౌముదుల నాఁడు విహాయసగీతికావిలా
సాసవ మాఁకగొన్న మరణాంధ్యములోఁ బడి నీరవించు నే
మో సెలవిమ్ము ప్రేయసి! మధూత్సవపాత్రికఁ దెమ్ము; కాక పే
రాసలఁ ద్రావి యూర్చు బ్రతు కావల నేమయి వేఁగిపోవునో!

వీడని వేఁడి కౌఁగిళుల వేసరిపోవని వేళ పోయె ఏ
జాడల నీని స్వప్నములచాటుల నీడల రెక్కలార్చి; ఈ
నాఁడు వియోగపుంబ్రతుకు నాశముపోకయె చీఁకటింటి త
లుప్పడిచి తొంగి తొంగి యిపుడో అపుడో యని వేచు పిల్పుకై

ప్రోయవు చైత్రమాసపదముల్ హరిదంతపదమ్ములందు; శూ
న్యాయతనాంగణాన మిహికాంగముతో చలికారు తొందరల్
సేయును; వెంటవెంటఁ బడి చీరఁగ శైశిర జీర్ణపర్ణవా
తాయతరోదనమ్ములో జరామయ నిశ్వసనస్వనమ్ములో.

రగులు విషాదహాలహాల రౌరవకీల హృదంతరాలఁ గా
ల్పఁగ నను లోనఁ దాల్పఁగ భరమ్మొ; వియోగకుటీర మిద్ది నేఁ
టి గతికి రేఁబవళ్ల నొకటే పనిగా తపియించు సోరణం
పుఁగనుల పల్కరించు నలుమూలల ఏడుచు బారుబారునన్.

కృష్ణశాస్త్రి

అస్థిప్రసాదనము

'వరలక్ష్మీత్రిశతి.' కర్మశతకము. తొమ్మిదవపది

క్ష్మావ్యోమాఖిల పంచభూతము చితా మధ్యస్థ సింహాసనా
గ్రవ్యుత్పన్న భవన్మహాజ్ఞబడియే కాఁబోలు స్తంభీభవ
ద్ధావ్యాత్మీయమహాణుసంచయముతోఁ దానై శ్మశానంబునం
దవ్యుష్టాసువుగాఁ బొనర్చికొని దివ్యాస్థీ! నమస్తే నమః.

అవ్యాలోలమనఃప్రభావము శివాప్రాణేశ్వరత్వమ్ము స
ర్వవ్యాపిత్వము మంత్రవర్ణతతి రుద్రాక్షాది వాసంబు వ్య
క్తావ్యక్తుండగు స్వామి తద్భుజగ జిహ్వాగ్నిచ్ఛటల్ తోడి గ్రీ
వావ్యాలంబివిభూష వేమనెద ని న్నస్థీ! నమస్తే నమః.

దీవ్యద్దివ్యసహస్రభానుకిరణోద్దీప్తాత్మమూర్తిప్రథా
భావ్యాశాత్రుటనక్రియా పరిణతప్రౌఢప్రభావాంచితా
నావ్యానంత మహాపదంబుధి పురోన్యస్తోగ్ర కోణాచలా
పవ్యాఘాతనిశాతబాణహతివత్ప్రౌఢా! నమస్తే నమః.

దివ్యాస్థీ! భవదీయమా పలితమా దేదీప్యమానంబు నా
భవ్యాకారము హేయమయ్యుఁ దలఁపన్ బ్రహ్మాండరాహస్య వి
ద్యావ్యాపారము గోచరించుఁగద నీయందున్ విచిత్రంపు మా
నవ్యాఖ్యానము చేయుచుం దుపనిషన్నానామహార్థాళికిన్.

సవ్యామోహమ యైన యీజగము దీక్షానంత్య సంకౢప్తిఁ గా
మవ్యాపారమునం దగుల్కొని యసంపద్భాజనంబై చెడెన్
క్రవ్యాదాభ దురామయప్రతతి జగ్ధంబై మహామృత్యు జి
హ్వావ్యోమావృతి లుప్తమయ్యెనని నీవ్యాఖ్యానముల్ నెచ్చెలీ!

నవ్యప్రౌఢమహార్థముల్ భవదుపన్యాసంబు లానందరే
ఖావ్యక్తీకరణ ప్రశస్తములు సంకౢప్తాఖిలక్షోణిగో
శవ్యాపార నిరాసహేతువులు డోలాసంచలద్దుష్ట మా
యావ్యాపాదన లీల లూర్మివిషయోగ్రాంభోదఝుంఝుల్ చెలీ!

అస్థి ప్రసాదనము

హావ్యంబై చెడిపోయె నీజగము మోహాగ్నిచ్ఛటావల్లి రం
తవ్యం బం చతిదుఃఖభాగ్విషయసంతానంబు లో నెంచి, మం
తవ్యం బంచును దారపుత్రనివహోత్తక్లిష్టసౌఖ్యంబు హం
తవ్యం బీయఖిలంబు నంచు విమలార్థం బూఁదె దీవో చెలీ !

అవ్యాజోపకృతీ! సమస్తజగ మే లాహో ! సమస్తమ్ముగా
నీ వ్యస్తంబును నూహ సేయునని నీకే నైజమైనట్టి మా
నవ్యాహారముచే శరీరగత భిన్నద్రవ్య మీరీతి భి
న్నవ్యుత్పన్నము నంచుఁ దెల్పెదవు భిన్నభ్రష్ట మంచుం బొరిఁ.

తా వ్యాపించె నదే మహాస్థిక ! భవద్ధర్మోపదేశంబు, నా
యీవ్యగ్రంబగు నాత్మలో నెగసి సర్వోహావిధూతిఁ సదా
భవ్యంబైన మదీయసర్వస్సృజనాభాగణ్వాణుమ్లాన మ
ధ్యవ్యాక్రోశవివర్తనభ్రమదనంతధ్వాన పూర్ణంబుగఁ.

శవ్యాదుల్ భవదీయ సౌరఝురిణీకల్లోల గర్భస్థితిఁ
దావ్యాపన్నతఁ బొంద కామరపురీస్థప్రౌఢసౌఖ్యాలిచే
నవ్యుల్ నీకృపకై సతీవిరహితుండై యేను ప్రార్థించెదఁ
దివ్యాంభశ్చలనంబు పొందకువె యస్థీ మత్ప్రియార్థంబుగఁ.

విశ్వనాథ సత్యనారాయణ

ఉపహారము

పొటమరించు మున్న పుణికితి నొకకొన్ని,
కసటు వాయకున్న పసరుమొగ్గ,
లఱసగమ్ము విచ్చి, యఱ విచ్చి, నెఱి విచ్చ
నట్టిపూలు పుణికి యందు నిందు;

ఈపువుదండ గ్రుత్తునని యెప్డు దొడంగితినో! అతిప్రయ
త్నాపచితమ్ము లాసుమము లన్నియు విస్మృత యత్ప్రపంచ **ధూ**
ళీపరమాణుకోటుల విలీనములై పొడమాసిపోయెనో!
చేపడె నేఁటి కీసుమము; చేకొని చేతుఁ బునఃప్రయత్నమున్.

ఒక్కొకసుమమ్మె యేర్చి నీ కుపదసేయ
గుణముకొన నిట్టు లల్లన గ్రుచ్చుచుండఁ
బూర్వ పూర్వ గ్రథితమైన పూలు రాలె;
మొదలు కన్పించ దీ సూత్రమునకు నాథ!

పూలు రాలుఁ గాక, పొలిపోక తుది మొదల్
నిలుచు సూత్రమైన నే గ్రహించి
రాలినట్టి పూలమాలిక దెత్తునా?
సాక్షి గాఁగ నా ప్రయత్నములకు.

ఇంత తోఁట నాటి యిచ్చిపోయిన మన్మ
థాతి మన్మథునకు నకట! పుష్ప
శూన్య సూత్ర మెట్లు సూడిద గావింతు
రసవిహీనులగు విరక్తు లట్లు.

ప్రతితరువున్ బ్రతివ్రతతి పల్లవతోరణ గట్టి తోఁటలోఁ
గుతుకము మీఱఁ బూసరులు గ్రుచ్చి సతమ్మును నిన్ను వేచు; నా
యతనములెల్ల మాని, బ్రతుకంతయు మాలికసేయుపొంటె నే
క్షితిరుహమైనఁ గానయితిఁ, జెల్లరె! తీవయుఁ గాకపోయితిన్.

కన్నులవెన్నెలైన నినుఁ గన్గొనఁగల్గి, సుధాప్రపూరమా
తిన్నని నీయెలుంగు విని, తేపకు నే నినుఁ బల్కరించు భా
గ్యోన్నతి గల్గునాఁడయిన నో ప్రియ నీయెద వ్రాలి నీగళం
బు న్నవపుష్పమాల నయి పూనక మానుదునా, మనోభవా?

పింగళి లక్ష్మీకాంతం
కాటూరి వేంకటేశ్వరరావు

స్త్రీ

ఓ నవయువతీ !
ఎవతెవు
నీ వీరాత్రి నన్ను మేలుకొల్పావు ?

ఏ తారాకోమలాంగివో నీవు,
ఏ తేజస్స్ఫీతదేహవో కాని,
నా స్వప్నప్రాంతరాంతరాళంలో
నీ స్వర్ణాంకితకింకిణీక్వణాహ్వానం
రేకెత్తించి, నదించి, ప్రజ్వలించావే
నాకామం,— కోమలాంగి ! నీ ది
వ్యాకారం నాయెడంద అద్దంలో
ఈకల్యాణముహూర్తమా నిశీథంలో
ఆకు ల్దొడిగిన పూలమొక్కలా నిల్పావో కన్యా !

ఈలోకకఠోరయాత్రలో నాలో
డోలాందోళితభీతభావనాజాలం
జాలై, వాగై, ఓమహాప్రవాహమ్మై,
నాజాగ్రదవస్థనెల్ల ముంచెత్తి,
నాజ్ఞానప్రవృత్తులెల్ల కుంచింది,
నాజీవాన్ని ప్రసుప్తంచేసిన చీకట్లో
ఓ జవ్వనీ !
పూజాపుష్పాంజలితో విరిశావో
తేజఃస్వరూపిణీ ! రాణీ !
తారాజ్వలితలలితకాంతిమయీ !
శాంతిమయీ !

*　　*

ఉదయిని

భువనోద్రేకాలు నామనఃప్రాకారం
గమియింపకనే నిల్పుకుంటి నిందాకా;
భవదీయప్రణయవిహ్వాలాహ్వానో
త్సవ మెపుడో యని తెరచుకుంటి నాహృదయో
ద్భవనద్వారం!
అయినా నీ
వవతరించు టెపుడో యీకాలపు
యవనికాంతరం విరజిమ్మకు నాజీవంలో
పవనం నాచెవిలో ఊదిందా?
భువి చెప్పిందా? దివి చెప్పిందా? నాహృ
ద్భువనాంతర మొకనిరంతరస్వప్నమై
నవసిందికదా, ప్రసుప్తమై, యిందాకా!
ఓయువతీ!

నీ వెవతెవో? నీ పేరేమో?
ప్రవచింతువాకో యీప్రేమోద్ధృత
ప్రశాంత సముజ్జ్వల
వివశత్వంలోనే!
ఓ నాభవతారణీ!
నిరంతరనవతరుణీ!

* *

నీ తారుణ్యం, నీప్రశాంతప్రేమోద్రేకం
నాతాపోపశమ మ్మొనర్చి, నాజీవం
ప్రాతరరుణరాగరంజిత మ్మతి
పూతమ్ము బొనర్చె నీనిశీథంలో!
ఈతమస్సులే ఉషస్సుగా విరిసెన్
నీతనుప్రభూత సుందరత్వంలో!
నాతపనాప్రతిఫలస్వరూపిణి! వి
స్ఫీతభావనాంబరోచ్చతారానారీమణి!

స్త్రీ

భువనాలందలి సుందరోజ్జ్వలశ్రీలూ,
కవనంలో కలగీతమంజుభావాలూ,
నవమందాకిని శీతవాతపోతాలూ,
రవళించెన్, స్ఫురియించె, తళుక్కుమన్నా
రో దివిజాంగన! నీ యుపస్థితత్వంలోనే!

*　　　*

బరువై బరువై దిగలాగె మంటిపెనుభూతం,
కరవై కరవై మటుమాయమాయె నానందం,
నరలోకవాసులెల్ల రాల్చు బాష్పజలం నా
నయనాలలోనె పొంగిపొంగి కరడయ్యెన్;
మజ్జీవనాంతికంలోనే లోకపుదారిద్ర్యం
కుమిలింది, కుమిలి క్రుంచివైచె నాప్రాణం,
రమణీ!

అది యౌవనోచ్ఛభావబంధుర మ్మౌకాలం!
అది నవ్యవిస్తృతవాసంతాభ్యుదయావసరం!
అది మామకవిశాలనవజీవప్రారంభం! నీ
అవతారం నాకన్నుల కట్టిం దా నాడు?—
అవనీతీరాలెల్ల వెదకి వేసరితిన్ నీ
నవకోమలపాదపద్మరజంకోసం!
పలవించా, పలవించా, విలపించా నే నో
కలరాణీ! నీ లలితానురాగబలం కావాలని,—
కానీ,
తెలవారెను, అరుణరక్తిమలు క్రుంకెన్,
తెలికాంతులశశి రోజు రోజు కృశియించెన్,
బల మేది విశీర్ణమయ్యె నాకోమల
తరుణజీవితప్రళయోద్వేగానలం నాలోనే!

*　　　*

౮-౨౩

జనసంతానంలో కలిగే దుష్కరకల్లోలాలూ,
మనుజులదుర్భరజరామయదారిద్ర్యాలూ,
దినదినపరిదుఃఖితవహా నీయిలమాత్రమె నా
మనసును సంకెళ్ల గట్టి బంధించెన్! నే
కనదలచినశోభ సృష్టిజాలంలో, ఈ
మనుజుల దీనార్తరోదనధ్వానంలో
పడి నలిగి, నా
మనస్సులో నీరసమై నీరవమై, భావనలను
కరగించెనో? కరుడుకట్టెనో?— అప్పుడు నీ
ప్రణయబలం యీరీతి వరించిననాడే,
జీవం ప్రోడైనా,
ననదొడుగు నటించు ఎడందలో ఏమైనా
వినబడ్డా కానీ, అది ఒకానొకరోదయే!
ఓ సుమకోమలసుందరోజ్జ్వల
స్త్రీవ్యక్తి! శక్తి!
ఆరోదలోపలిరోదయే నాచేయూతై, నాలే
మెదలోపలిమెద గలలో కలువరింతమై
మెదిలి మెదిలి నన్నెల్లెడ వెదకించెన్ నీ
మెదియో తెలియని సహవాససహాయంకోసం!—
అదునే కాలేదో ఆతొలికాలంలో— నా
హృదయంలో ఒంటరినై నే నిలబడి, ఏదో
పదముల సవ్వడికై మెదురుచూచి చూచి
అలసితిన్ నా హృదయేశ్వరి!

* *

౪౨

స్త్రీ

ఈనాఁడీ యలసిన ఆశాజీవం నిదురించిన యీ
అర్ధరాత్రి నీదరస్మితాహ్వానాలోక మ్మా
యంతరిక్షసీమనుండి దిగి నాపై
కురిసెనో జాలై, తారై మెరిసెనో, పూలై
విరిసెనో!—

ఈలోనే నీ కాంతితనువు నా దేహం
దరిసి, అలపుగొన్న నా స్వప్నజీవితావరణం
మేలుకొలిపి, నా హృదయోద్భవనంలో దీపం
నిలిపితివే! విలసిత లావణ్యశ్రీవై !
స్త్రీవై !
నీవై !
నీ వెవరైనా, నీ పే రేమైనా కానీ!
నవనిత్యయౌవనానందప్రాణీ!

మల్లవరపు విశ్వేశ్వరరావు

ఇద్దరు నవకవి మిత్రులకు

నన్ను గాంచినంత మీరు
నమస్కార మిదే యంచు
నవ్వుకున్నారోయ్,
విరినవ్వుతో నన్ను
విసిరికొట్టితిరోయ్ !

మిమ్ము జూడగానె నేను
మిసుము లీను మీఁటెనువుల
మెచ్చుకున్నానోయ్,
మురిపెమ్ముతో మిమ్ము
ముంచివేసితినోయ్ !

సుధ లీనెడి చూడ్కులు, వువు
దేనె లూరు తీయనుడులు
తీర్చుకున్నారోయ్ ;
బయలుగా మీర లవి
బయటపెట్టుదురోయ్ !

పసివేళటి పాలనునుపు,
ఎలబ్రాయపు పటిపొంగు
ఇంకిపోలే దీ
ఎదలో సుస్థిరముగ
పదిలమైనాయోయ్ !

ముఖములోన ముడత లున్న
శిఖ పలిత స్నిగ్ధమైన
ముదిమి రాలేదోయ్ ;
నమ్మకుంటే ఎడద
కుమ్మి చూడండోయ్ !

అమరామృత నిర్ఝర మెద
అడచుకొంటి జహ్నువట్లు
అది కదప నురకే ;
పని వచ్చినప్పుడే
బయటపెడతానోయ్ !

నోరి నరసింహశాస్త్రి

అభిమన్యుడు

౧

"పోరు పో"రంచు రణభేరి మ్రోగ బయట
"వలదు వల"దంచు నింటిలోపలను నీవు
కంటి కాటుక చెక్కిళ్ల కఱడు గట్ట
జలజలని రాల్తు దుఃఖబాష్పముల వేల!

౨

దూరముననుండి సంగ్రామ దుందుభులను
ఉఱుములంబోలె విని యని కుఱుకు నాకు
ఱాలు గరగించు నీ యార్తరవము వినిన
పొంగి పోయెడు నెమ్మేను కుంగిపోవు.

౩

పగఱ తెలివిచ్చు కత్తుల వాడి పోట్ల
రాయిడికి చెక్కుచెదరని ఱాతిగుండె
తొలివియోగపు జాలిచూపుల స్రవించు
వేడి కన్నీట కరగి ద్రవింప దొడగు.

౪

భద్ర దంతుల కఠిన కుంభస్థలాలు
చీల్చి ముత్యాల భూమి నర్చించు నాకు
నీ విషాద ముక్తాశ్రులు నేల రాలి
చింది చిటిలిపోవుట చూడ చింత పొడము.

౫

పర నిశితబాణ వర్షప్రపాతములకు
నదురు బెదురును లేక నే నెదురు నడతు
పడతి, కన్నీటి తొలకరి వాన జడికి
గడగడ వడంకు నేడు నాయెడ లదేమొ!

౬

ఒక్కతఱి నే రణావని కుఱికినంత
పగఱ వ్యూహము లన్నియు భగ్నమగును
కలికి కడగంటి చూపు మొగ్గరమునుండి
పోరి తప్పించుకొన నాకు దారి లేదు.

కొడాలి ఆంజనేయులు

ప్రేతభూమి

మండుతోంది
మండుతోంది
మిన్ను కాల్చి మండుతోంది
పడమటిదెస ప్రేతభూమి.

ఊరిబయట కోనేట్లో
రక్తం చూచెనో
పిట్టలు,
కళవళించి రోదసతో
గూళ్ల చేరి దాగున్నవి.
కళ్లంలో తొంగిచూచి
ఊలవేసె నక్కలదొర.

మండుతోంది
మండుతోంది
ఆకలితో మండుతోంది
నాయెదవలె నీయెదవలె
కుమారిల్లి రుద్రభూమి.

రక్తం క్రక్కినపులివలె
చచ్చిన సూర్యునిదేహం
సంధ్యావాహకు లెవరో
కాష్ఠంలో వేల్చినారు.

పొగలే ఇరులై జగతిని
భూతంలా కౌగిలిస్తే
వేయితరంగాల జలధి
గడగడమని వణకింది.

పడగెత్తిన నల్లత్రాచుగా
శివమెత్తిన మహాంకాళిగా
కాళనిశీధిని
ఉన్మాదంతో
ప్రళయతాండవం చేసింది.

పురిపండా అప్పలస్వామి

కొత్త చెప్పులు

'కరుణకుమార'

[ఆదిగాడు ఆ గ్రామమాదిగవాళ్లకందరికీ కులపెద్ద. అనాదిగా వాడిపెద్దలలగాయతు ఈగౌరవం వంశపారంపర్యంగా వస్తూఉండడంచేత ఆదిగాడుకూడా తనహయాంలో గౌరవంగానే కాలక్షేపంచేసి నిరుడు సంవత్సరము శ్రావణమాసంలో వచ్చినదూముల్లో కలరాతగిలి పాపం వెళ్లిపోయాడు. ఇంట్లో వాడిభార్య నరిసీ, పన్నెండేళ్లకొడుకూ, ఓ యెనిమిదేళ్ల కూతురూమాత్రం ఉన్నారు. నరిసి కూలికిపోయి రోజుకో ముంతెడుగింజలు చెమటఊడ్చి సంపాదించుకొని పొట్టపోసుకొంటూ పసిపిల్ల లెప్పుడు చేతి కందివస్తారా అని నిత్యమూ అంకాళమ్మకు దణ్ణాలుపెట్టుకొంటూ కాలక్షేపం చేస్తోంది. చిన్నపిల్ల లయినప్పటికీ యిద్దరుపిల్లలూ రోజూ పొద్దున్నే పొలంచాయ పోయి పొయ్యిలోకి ఇన్నిచితుకులూ, కంపా, కట్టా, పేడా పోగుచేసుకొని తల్లికి కాస్త వేన్నీళ్లక చన్నీళ్లలాగ సహాయంచేస్తూఉన్నారు.

ఆదిగాడు బ్రదికిఉండంగా పెద్దమాదిగ కాబట్టి ఆ గ్రామంలో పదిమంది పెద్దఆసాములయిళ్లకూ ఉద్యోగంచేస్తూ ఏటా కుప్పనూర్పుళ్లల్లో ఎట్లాలేదన్నా ఓపందుంగింజలు కళ్లచూస్తూఉండేవాడు. పైగా ఆసాములయిళ్లల్లో పసరం చచ్చినపుడల్లా వాడికి తోలు మిగులుతూఉండేది. తోలు కొంతభాగం ఆసాముల చెప్పులకిందా, తోలుబొక్కెనలకిందా, ఎద్దులకు మెడవారులకిందా, మువ్వలపట్టెళ్లకిందా ఖర్చవుతూఉన్నప్పటికీ, మరికొంత మిగులుతూనేఉండినందువల్ల తద్ద్వారా వాడికి కొంతఆదాయం ఉండకుండాపోయేది కాదు: కాని ఆదిగాడు చనిపోయినతర్వాత ఇంట్లో సంతనలేక, నరిసి పూర్వంఉన్న అన్నియిళ్లకూ ఉద్యోగం చేయలేకపోయింది. అందువల్ల పూర్వం చేస్తూఉన్న పదియిళ్లల్లోనూ, ముఖ్యమైన ఏనాలుగైదిళ్లో తప్ప మిగిలినయిళ్లను, తనకొడుకు చేతికెక్కివచ్చేవరకు తనకు వల్లకాదని చెప్పి వదులుకొంది. తను మిగుల్చుకొన్న ఆనాలుగిళ్లకైనా నరిసి సమయానికి మాదిగవాడలో ఎవరినో అన్నా, నాన్నా అని బ్రతిమలాడుకొని, ఆసాములకు ఏం లోపమూలేకుండా ఉద్యోగంజరుపుకొంటూ జీవనం గడుపుకొంటోంది.]

౧

చిన్నపరెడ్డి గ్రామంలోఉన్న మోతుబరీ ఆసాములలో ఒకడు. అంతేకాదు, మోతుబరులలోకల్లా కాస్త ముఖ్యుడనికూడా చెప్పొచ్చు. ఆ గ్రామంలో అందరూ రేత కాపులపుట్ట. అంతా ఒకరికొకరు కావలసినవాళ్లు; బీరకాయపీచు. అందువల్ల ఉన్నవాళ్లల్లోకి మొదటినుంచీ చిన్నపరెడ్డిది కాస్త తలబిరుసుతత్వం అయినప్పటికీ అతను చేసేదుండగాలూ, బీదలను పెట్టేహింసా బయటికిరాకుండా సమయానికి గ్రామంలో నలుగురూ కమ్ముకొనిరావడంమూలాన్న పరిశపారిపోతూవస్తున్నవి. పైగా గ్రామమునసబు వాళ్లవాడే

అయినందువల్ల అతడు మరీపేట్రేగుతూవచ్చాడు. దీనికితోడు ఏజన్మలో చేసుకొన్న పూజవల్లనో అతనికి ఈజన్మలో లక్ష్మిందేవికూడా కటాక్షించడంవల్ల అంతా ఒకయేభై, అరవై యెకరాల మాగాణిసేద్యమూ, ఒక డెబ్భైయెకరాల మెట్టసేద్యమూ, ఇంట్లో కావలసినంత పాడీ పంటా లభ్యమయి, జీతగాళ్లూ నాతగాళ్లూ కలిగి మొదటినుంచీ అతగాడి కమతం కొంత అట్టహాసంతోనే జరుగుతోంది. అదీకాక గ్రామంలో జరిగే చిల్లరతగవుల్లోనూ, ఇచ్చిపుచ్చుకోవడాల్లోనూ మాటకారికాబట్టి తరుచు చిన్నపరెడ్డికాడికే పార్టీలు వస్తూవుండడం, అతడు పంచాయతీచేసి వ్యవహారాలు పరిష్కారంచేయడం జరుగుతూఉన్నందువల్ల, ఈవిధంగాకూడా అతనికి గ్రామంలో నలుగురిలోనూ కాస్త పెద్ద అనిపించుకోవడానికి హేతువైంది.

ఇక చిల్లరబాపతు అలగాజనానికి ఇతడంటే డొక్కలో మెదులుతూఉంటాడంటే విడ్డూరమేమిన్నీ లేదు. గ్రామమునసబూ, కర్ణమూ — ఇద్దరూకూడా ఒకరకంమనుష్యులైనందువల్లనో, లేక అతని జననకాలనక్షత్రబలిమివల్లనో కాలక్రమేణా గ్రామంలోని సివిల్, క్రిమినల్ అధికారాలన్నీ చిన్నపరెడ్డి స్వాధీనపెట్టుకొని అమలుజరుపుతూవచ్చాడు. అతనిమాటంటే సుగ్రీవాజ్ఞా, అతడంటే సింహస్వప్నమూ అయింది అలగాజనానికి. ఆఖరుకు అతనిపలుకుబడి—అతడు నందంటే నందీ, పందంటే పందీని. ఎప్పుడు ఏంతెచ్చి నెత్తిమీద పెట్టుతాడో అని బీదలంతా హడిలి జీవిస్తున్నారు.

నరిసి తనఉద్యోగంలో మిగుల్చుకొన్న యిళ్లల్లో చిన్నపరెడ్డియిల్లు ఒకటి. రెడ్డి చెప్పుల్లో ఒకచెప్పు ఈమధ్య కుక్క ఎత్తుకుపోయి కొరికిపాడుచేయడంవల్ల అతడు నరిసిని పిలిపించి ఒక కొత్తచెప్పులజోడు తయారుచేసి తీసుకురమ్మని చెప్పాడు. ఒకవారంరోజులు వెసిలికయిస్తే తయారుచేయించి తీసుకొనివస్తానని చెప్పి నరిసి వెళ్లిపోయింది.

నరిసి కోరిన వారంరోజులగడువూ అంతకుపూర్వంరోజునే గడిచిపోయింది. కాని యింకా చెప్పులజోడు రాలేదు. కాలికి జోడులేకుండా తిరగడానికి రెడ్డికి ఇబ్బందిగాఉన్నది. ఈవారంరోజులూ ఎట్లాగో కష్టంమీద గడుపుకుపోయినాడు. పోనీ ఆరోజయినా తెస్తుందేమో అని పొద్దుటినుంచీ చూచాడు. కాని నరిసి రాలేదు. ఉదయాన్నే ఒకసారి తన సేద్యగాణ్ని నరిసియింటికి పంపాడు. అది యింటికి రాలేదని పోయినమనిషి చక్కావచ్చాడు. ఆరోజు తూర్పుచేలోకి—ఓరెండుమైళ్లదూరం—రెడ్డి కుప్పనూర్పుకి పోవలసి వచ్చింది. వైశాఖమాసం మధ్యాహ్నం పన్నెండుగంట లయింది. అప్పుడే భోంచేసి రెడ్డి బయిటికి వాకిట్లోకి వచ్చాడు. ఎండ తీక్షణంగా కాస్తోంది. జరూరుగా పోవలసినపని. కాలికి చెప్పులు లేవు. పోనీ ఎవరివైనా ఎరువు తీసుకుపోదామనుకొంటే సమయాని కెవరూ

తటస్థపడలేదు. ఇంట్లోకివెళ్లి పొగాకుకాడఒకటి తీసుకు చుట్టచుట్టి నోట్లోపెట్టాడు. అగ్గిపెట్టె తీసి ముట్టించాడు. శరీరంలో ఒకవిధమైన చురుకుదనం కలిగింది: నరిసి చెప్పులు తీసుకువస్తానని చెప్పినగడువు దాటిపోయి సెకండ్లు, నిముషాలూ, గంటలూ గడిచినకొద్దీ— గడిచిపోతూవున్నదని తలచుకున్నకొద్దీ — చిన్నపరెడ్డికి లోపల కుతకుతపుట్టి ఉడుకు ప్రజ్వలిస్తోంది. చిరుచెమటలుపోసినవి. ఆడదాని కింతనిర్లక్ష్యమా అనుకొన్నాడు. ఇట్లా ఆటలు సాగనిస్తే తనసంగ తేమికావా లనుకొన్నాడు. నిట్టూర్పు లధికమైనవి. నోటిలో పెట్టినచుట్ట బ్రహ్మాండంగా కాలిపోతూఉన్నది. నిట్టూర్పుతో పీల్చినగాలికి రెడ్డికి నోట లోకీ ముక్కులోకీ ధూమసముదాయం ఎక్కిపోతున్నది. రెడ్డికి కళ్లెర్రబారినవి. పీల్చిన పొగ ముక్కుపుటాలగుండా, పళ్లసందులగుండా బయటికి మబ్బుతెరలల్లా వస్తూవుంది. నట్టనడి ఆకాశాన్నుంచి భగవానుడు తనసహస్రకిరణాలతోనూ లోకాన్ని పొదిగి వేడెక్కిస్తున్నాడు. రెడ్డికి శరీరం వేడెక్కిపోతోంది. నరిసి యింకా రాలేదు. కాళ్ళకు చెప్పులు లేకుండా పొలం పోవడమా? మానడమా? వెళ్ళక విధిలేదు. పైన ఉత్తరీయం వేసుకొన్నాడు. చేతిలో కర్ర పుచ్చుకొన్నాడు. సమయానికి గొడుగు అగుపడలేదు. దాన్ని వెతకడానికికూడా అతనికి స్థిమితం లేకపోయింది. ఇంట్లో ఆడవాళ్లు భోజనంచేస్తున్నారు. పొలంపోదా మనుకొని రెడ్డి నడవదాటి నాలుగడుగులువేసి వీధిగుమ్మంలోకి వచ్చేవరకు నరిసి ఒక చిన్నవెదురుపేళ్ళబుట్టలో ఒకజతచెప్పులు కొత్తవి తీసుకువచ్చి గుమ్మంలో అతని కెదురుగా పెట్టింది.

“నిన్న తీసుకువస్తానని చెప్పి ఇంతవరకూ తీసుకురాకుండా ఎందు కాలస్యంచేశావే రండా” అని రెడ్డి గ్రుడ్లు వురిమి అదలించాడు.

“సామీ! నా కింటికాడ సంతనలేదుగదా. ఏఅయ్యనో కాళ్లూకడుపూ పట్టుకొని ఉద్యోగంచేయించుకోవాలి. నేను బ్రతిమలాడిన మాదిగాడు నిన్న మాపటికి తయారుచేసి తీసుకువచ్చాడు. కొత్తచెప్పుల కాముదంరాసి తీసుకువద్దా మనుకొని పొద్దుటేలనుంచి ఆముదంకొనడానికి చేతిలో డబ్బులేక, తిరిగితిరిగి, ఆవీధి కోమటాయన్ని బతిమలాడి ఇంత ఆముదవుచుక్క పెట్టించుకొని చెప్పులకు పట్టించి తెచ్చా. ఆముదం పెట్టకుంటే తమరు కోపంచేస్తారని అది పెట్టించేవరకు ఈవేలయింది సామీ” అని నరిసి గడగడ వణుకుతూ తడబడుతూ జవాబు చెప్పీచెప్పకమునుపే చిన్నపరెడ్డికి ప్రపంచం తెలియలేదు. శరీరం అతనిస్వాధీనం తప్పిపోయింది. ముఖం ఎర్రబారింది. కోపంతో వళ్ళంతాకంపించిపోతోంది. పిడుగులుపడేటట్టుగా ఉరిమి, “ఊఁ లంజా! నీ కాముదం చిక్కలేదుగా! తెస్తా నన్న వేళకు తేక ఇంత అలక్ష్యమా? మాదిగలంజె కింత కావరమా?” అంటూ పిచ్చుకమీద

బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్టు, తనచేతికర్రతో ఈడ్చి నరిసిని మెడమీద కొట్టేవరకు 'చచ్చాను దేవుడా' అని అరుస్తూ, వాతంకమ్మిన కుక్కలాగ గిరగిర గిరగిర తనచుట్టూ తాను నాలుగుసార్లు తిరిగి నడివీధిలో కిందపడి కర్మసాక్షి సూర్యుడికేసి ముఖంపెట్టి కళ్లు తేలేసింది.

౨

చిన్నపరెడ్డి కుప్పనూర్పుకాడికి తూర్పుపొలం పోవాలనుకొని బయలుదేరి వాకిట్లో కొస్తే ఇంతగ్రంథం జరిగి నరిసిప్రాణం హరీఅంది. వాకిట్లో నడివీధిన శవం పడివుంది. వీధిలో ఇటూఅటూ పారజూచాడు రెడ్డి. మిట్టమధ్యాహ్నం, భోజనాలసమయం, వీధిలో అంతా నిశ్శబ్దంగా ఉంది. జనసంచారం లేదు. కాని ఏమిచేయడానికీ రెడ్డికి ఆలోచన తోచలేదు. కళ్ళకు కమ్మిన కావరంకొద్దీ బుద్ధి మట్టగించి ఆవుద్రేకంలో అంతపని చేశాడు రెడ్డి. ఇప్పుడు అతనికి తలవేడి తగ్గింది. క్రోధం చల్లారింది. ఇది మానవప్రపంచమని తెలిసింది. శవాన్ని ఎంతసేపని ఆప్రకారం వాకిట్లో ఉంచడం? ఎవరికంటా పడకుండా ప్రస్తుతం దాన్ని దొడ్డిగుమ్మాన్న వాములదొడ్లోకి చేర్పిస్తే, తర్వాతవిషయం నిదానంగా ఆలోచించుకో వచ్చునని అనుకొన్నాడు. కాని శవం దొడ్లోకి చేరేవుపాయం ఏదీ? తన సేద్యగాండ్లందరూ కుప్పనూర్పులో ఉన్నారయ్యె. ఇంట్లోకి పరుగెత్తాడతడు. భార్యా, అతనితల్లీ అన్నం తింటున్నారు. దాసీపనిచేసే యానాది లక్ష్మి పడమటింటి వసారాలో కూర్చొని బియ్యం బాగుచేస్తోంది. ఖంగారులో ఏమీ తోచక భార్యను పిలిచి ఇట్లా జరిగిందని తడబడుతూ చెప్పాడు. తల్లి చెవినిబడింది విషయం. అమ్మయ్యో అని తల్లీ భార్యా గుండెలు బాదు కొన్నారు.

"ముందు శవాన్ని వాములదొడ్లోకి చేరుద్దాం రండి. ఆవిధాన వీధిలో ఉంచడానికి వీలులే"దన్నాడు రెడ్డి.

"సరే! యానాది లక్ష్మినిగూడా పిలుస్తాను. ఉండు" అని భార్య లక్ష్మిని పిలిచింది; దానితో రహస్యంగా చెప్పింది విషయం. సంగతంతా వినేవరకు లక్ష్మికి హడలెత్తి "నావల్లకాదమ్మా ఈపని" అని ఊరిబయట తనగుడిసెకాడికి పేరెంటీసిం దది. "ఆలస్యం అవుతోందర్రా" అనేవరకు, తల్లీ భార్యా రెడ్డీ ముగ్గురూ కలిసి వీధిలోకి వచ్చారు. రెడ్డి తిరిగి ఇటూఅటూ వీధిలో నాలుగువైపులూ పరకాయించి చూచాడు. జనసంచారం లేదు. ఇదే సమయం అనుకొని ముగ్గురూ చెయ్యిచేసుకొని శవాన్ని వాకిటగుండా వాములదొడ్లోకి చేర్చి ఎండుగడ్డివాములో, లోతుగా దూర్చి బయటికి కనిపించకుండా గడ్డి కప్పి వచ్చేశారు.

కాని రెడ్డికి మనస్సులో దిగులుగానే ఉంది. తాను చేసినపని ఎవరికంటా పడలేదని నమ్మకమేనా? లేక ఎవరికంటనైనా పడిందా? అని అదే ఆలాపన అతనికి. గుండెలు కొట్టుకొంటూనేయున్నవి. తిన్నఅన్నం అంతా నీరైపోయింది. ముచ్చెమటలు పోసి శరీరం నిస్సత్తు వయిపోయింది. మాదిగశవాన్ని తాకినందుకు ముగ్గురు వాహకులూ వీధితలుపూ, దొడ్డివాకిలీ గట్టిగా లోతట్టు బిగించి సందులోని బావిదగ్గర వెంటనే స్నానంచేసి గుడ్డలు మార్చి చలవమడతలు కట్టుకొన్నారు. "శుభంవలె ఇదేం ఖర్మం వచ్చిందర్రా నిండుయింట్లోనూ" అని తల్లి ముసలిది కంటనీ రెట్టుకొంది. "నోరువిప్పితే గొంతుక పిసుకతా"నని రెడ్డి గదమాయించాడు.

మధ్యాహ్నం ఒంటిగంటా రెండుగంటలు కావచ్చింది. సూర్యుడు కొద్దిగా పడమటికి జారుతున్నాడు. రెడ్డి మళ్లా చుట్ట ముట్టించి తూర్పువసారాలో ఇటూఅటూ పచార్లు చేస్తూ తడిసినతల విప్పుకొని జుట్టు ఆరబెట్టుకొంటున్నాడు. కర్తవ్యం ఏమీ స్ఫురించడం లేదు. అంతా చికాకుగానే వుంది. రిచ్చపాటుదశలోనే ఉన్నాడు.

ఇంతలో రెడ్డికి చెప్పు లిచ్చివస్తానని చెప్పి రేపటేళనంగా పోయినఅమ్మ యింటికాడకూడయినా వండకుండా పొద్దు పడమటికి వాలినా రాలేదే అని పొద్దుటేలనుంచీ కూడూ నీళ్ళూలేక చూసిచూసి కళ్లు కాయలుకాసి ఆకలికి శోషవచ్చి, అయినా రెడ్డిగారియింటికి పోయి విచారిస్తే మందల తెలుస్తుందని నరిసిగాడుకూ, కూతురూ — ఇద్దరూ కలిసి రెడ్డి కెదురుగా వీధిగుమ్మంలో ప్రత్యక్షమైనారు.

"అయ్యా! మాఅమ్మ మీకాడికి చెప్పులు తెచ్చిందే. ఏడబోయిందీ?" అని పిల్లలిద్దరూ రెడ్డి నడిగారు.

రెడ్డికి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినవి. నిలుచున్నమనిషి తటాలున కిందిచీడీ మీదికి చతికిలబడ్డాడు. నోటిలోచుట్ట జారి కింద పడిపోయింది. కాళ్ళూ, చేతులూ పటుత్వం తప్పిపోయినవి. పసిపిల్లకాయ లిద్దరూ అతనికళ్లకు పెనుభూతాల్లాగా కనిపించారు. పిల్లలు వాకిట్లోనుంచి కదలలేదు. జవా బివ్వకుండా ఎంతసేపని ఊరుకోగలడు రెడ్డి? ఇంత మాత్రానికే యింత అధైర్యపడితే ఇక ముందు జరుగవలసినకథంతా ఎట్లాగ నడవడం? ధైర్యం చిక్కబట్టుకోవా లనుకున్నాడు. సకిలించాడు. గొంతు సవరించుకొన్నాడు. చాచుకొన్నకాళ్లు ముడుచుకొన్నాడు. మూతిమీద చేయివేసుకొని మీసం సవరించుకొన్నాడు. జుట్టు దులిపి ముడిగట్టాడు. భార్యను పిలిచి మంచినీళ్లు తెప్పించుకొని ఓలోటానీళ్ళు తాగాడు. పిల్లకుంకల్ని క్షణంలో నమ్మించగలం అనుకొని,

"ఒరే మీఅమ్మ చెప్పు లిచ్చి అప్పుడే యింటికి పోయిందిరా, ఇక్కడ లేదు. అది ఇంటి కింకా రాలేదూ?" అన్నాడు.

"లేదయ్యా! పొద్దుటేలనుండి మాకు బువ్వ లేదు. ఇంకా యింటికి రాలేదు. ఎక్కడకు పోయిందో" అని వా ళ్ళన్నారు.

"పొండి, పొండి, ఇంటికి పొండి. మీఅమ్మ ఇక్కడ లేదు. ఎందు కెండలో తిరుగుతారు? పొండి" అని తొందరచేసి కూడులేక ఆకలికి మాడుతున్న పసిపిల్లకాయల కింత అన్నమైనా పెట్టిపంపితే బాగుండునన్న ఆలోచనైనా లేకుండా వా ళ్లిద్దరూ తనదృష్టి పథంనుండి తొలగి బయటికిపోతే చాలు ననుకొని, ఆత్రంతో వాళ్ళను తొందరపెట్టి పంపి వేశాడు. దిక్కూదెసాలేక, దారీతెన్నూ తోచక వచ్చిన కుర్రకుంకలు వచ్చినట్టుగానే యింటికి పోయారు.

3

మధ్యాహ్నం మూడుగంట లయింది. కాలచక్రం గిర్రున తిరిగిపోతోంది. చీకటి పడితేనేగాని తను తలపెట్టినకార్యం సాగదని, ఎప్పుడు పొద్దుగుంకుతుందాఅని రెడ్డి కొంత సేపు ఆత్రపడ్డాడు. కాని అంతలోనే అతనికి పొద్దు గుంకుతుందంటే భయంకూడావేసింది. మొత్తానికి మనిషి కొంచెం జంకాడు. మొదటున్న ధైర్యం ఇప్పుడు లేదు. గుండె బిగువు జారింది. కాని బయటి కట్లా కనిపించకూడదని మేకపోతుగాంభీర్యం తెచ్చిపెట్టుకొన్నాడు. ఆఖరుకు పొద్దు గుంకింది. చీకటిపడింది. రాత్రి ఎనిమిదిగంట లయింది. తొమ్మి దయింది. నెల యింకా పొడవలేదు. అతని సేద్యగాళ్లల్లో కొంతమంది యింటికి వచ్చారు. వాళ్ళలో ఇద్దరిని-జెబ్బపుష్టీ, పిక్కబలిమీ గలవాళ్లని-చాటుకు పిలిచాడు రెడ్డి. భయపడవ ద్దన్నాడు. ఇదిగో పదిరూపాయలనోటు, ఈనాం తీసుకోం డన్నాడు. జరిగినవిషయం అంతా చెప్పాడు.

"మీరు రెండోఆలోచన లేకుండా ఈశవాన్ని ఊరిబయట పొగడదొరువులో పారేసిరావాలి. ఇదిగో పదిరూపాయలనోటు. ఊఁ! రెండో ఆలోచనచెయ్యడానికి వీలు లేదు. తొందరగా రావాలి. చూడండీ, ఈరెండు ఈతచాపలలోనూ శవాన్ని చుట్టి తీసు కొనిపొండి. అయిదునిముషాల్లో పని పూర్తిచేసుకురావాలి" అన్నాడు రెడ్డి.

పదిరూపాయలనోటు చూచేవరకు ఇద్దరుముతరాచువాళ్లకూ మేరువు దొరికిన ట్లయింది. నడుంకట్టారు వాళ్లు. వామికాడికి పోయారు. దీపం తెచ్చేదాఅని రెడ్డి అనేవరకు వద్దన్నారు. శవాన్ని చాపలో చుట్టారు. కాళ్లతట్టు ఒకరూ, తలతట్టు ఒకరూ ఎత్తు కొన్నారు. దొడ్డిగుమ్మంకాడికి వచ్చారు.

కొత్త చెప్పులు

"ఉండండి! ఉండండి" అని రెడ్డి వాళ్లను అదలించాడు. తాను తలుపు వోర వాకిలిగా తీసి ముందు వీధిలోకి పోయాడు. రాత్రి పదిగంటలు దాటివుంటుం దనుకొన్నాడు. వీధిలో నిశ్శబ్దం గమనించాడు. ఇక వెళ్ళండన్నాడు. ముతరాచు లిద్దరూ కళేబరాన్ని వీధి దాటించారు.

ఇక రెడ్డికి కాస్త స్థిమితం ఏర్పడుతూ ఏర్పడుతూ వుంది. కాని పోయినమనుష్యులు తిరిగి తన కళ్ళపడేవరకూ అతనికి పూర్తిశాంతి చిక్కేటట్టు కనపడలేదు. ఇంతలో వెళ్లిన వాళ్లు పావుగంటలో వచ్చి జయభేరీ మోగించారు. రెడ్డి 'అమ్మయ్యా!' అనుకొని భోజనానికి లేచాడు.

నరిసిపిల్లలిద్దరూ ఆపగలూ, ఆరాత్రీ పక్కయింటి మాదిగయింట్లో కూడుతిని దిగులుతోనే ఆరాత్రంతా గడిపారు. తెల్లవారింది. సూర్యుడు తిరిగీ తనధర్మం నిర్వర్తించడానికి ప్రాక్పీఠాన్ని అధిష్ఠించి ఈవిశ్వప్రపంచంలో జరిగే సమస్తకర్మలూ వీక్షిస్తూ, వాటికి సాక్షీభూతుడైన ప్రత్యక్షదేవతవలె ప్రకాశించిపోతున్నాడు. బారెడు పొద్దెక్కేసరికి ఎవరిదో ఆడదానిశవం ఊరిగమిడి పొగడదొర్వులో పైకి తేలిందని గ్రామంలో పుకారు పుట్టింది. గ్రామమునసబు వెట్టినౌకర్లను పిలిపించి శవాన్ని బయటికి తీయించిచూచి మాదిగనరిసి శవంగా గుర్తించి మాదిగవాడకు కబురుచేశాడు. మాదిగవాళ్లంతా చుట్ట బెట్టుకొని నరిసిపిల్లకాయలతోసహా దొరువుకాడికి వచ్చారు. శవాన్ని చూచారు. నరిసి పసిపిల్లలిద్దరూ ముందుకు వచ్చి శవంమీదపడి గొల్లుమన్నారు. "అయ్యో! పసిపిల్లకాయలిద్దరినీ అన్యాయంచేసి పోయిందే" అని పిన్నాపెద్దా అందరూ దుఃఖించారు. కూడా వచ్చినవాళ్లు పిల్లవాళ్లని ఇవతలికి తీసి ఓదార్చారు.

పిమ్మట గ్రామమునసబు పోలీసువారికి రిపోర్టుచేయడంతోటే పదకొండుగంటలికి వచ్చివాలారు వారు. ఈలోపల ఎట్లా పొక్కిందో ఆనోటా ఆనోటాబడి అసలువిషయం—చిన్నపరెడ్డి నరిసిని కర్రతో కొట్టి చంపి రాత్రివేళ శవాన్ని దొరువ్రులో తోయించాడని—ఊరూవాడా పొక్కిపోయింది. లోకం నోరుమూయడానికి మూకు డేదీ? సూర్యుడు నడినెత్తిమీదికి వచ్చేకొద్దీ గ్రామంలో పుకార్లు బలమైపోతున్నవి. కాని ప్రత్యక్షసాక్ష్యం మాత్రం రాలేదు.

ఒక సబినస్పెక్టరూ, ఒక సార్జెంటూ, ఇద్దరు కనిష్టీబులూ వచ్చారు. గ్రామంలో అడుగుపెట్టీపెట్టంగనే పసికట్టారు సంగతి. వారిముక్కుకి కమ్మంగా తగిలింది వాసన. అసలే పాముచెవులయ్యే వాళ్లవి. అందులోనూ ఇసుకలోనుంచికూడా నూనె పిండగల చాతురీ ధురీణులు వాళ్లు, ఘటనాఘటనసమర్థులు. ఇకనేం, రొట్టెవిరిగి నేతిలో పడినట్టయింది. ఇక

సవాలక్షగ్రంథం జరిగించవచ్చు. సబినస్పెక్టరు బాగా సార్వీసుగలచెయ్యి. బహుబింకంగానూ, బెట్టుగానూ నడిపాడు గ్రంథం.

చిన్నపరెడ్డి పట్టూవిడుపూగలమనిషి; ప్రవాహం పొంగి అలలు మీదికివచ్చినపుడు క్రిందికి వంగి తాకుడు తప్పించుకొనే నేర్పరి. అలవాటులేనిపని చేసినందుకు మొదట్లో కొంత అధైర్యపడి కలగదొక్కుకొన్నా రెడ్డి క్రమేణా గంటలు గడిచినకొద్దీ ఆంతరంగికులైన ఒకరిద్దరు కావలసినవాళ్ళతోనూ, మునసబుతోనూ సంప్రదించుకొని ఎటువచ్చి **ఎట్లా తిరుగుతుందో** వ్యవహారం అని తనజాగ్రత్తలో తాను ఉన్నాడు. త్రినేత్రుడికి తెలియకుండా పోలీసువారికీ వీరికీ సంధానం జరిగిపోయింది. చిన్నపరెడ్డి ఇనుపపెట్టెకాడికి పోయి లక్ష్మీదేవిని స్తవంచేశాడు. ప్రత్యక్షమై, ముల్లోకాలూ సవరించుకొనివస్తానని బయలుదేరింది దేవి. పోలీసు లెవ్వరూ చిన్నపరెడ్డి యింటివైపుకూడా మెదలలేదు పాపం. దక్షిణపుగమిడిలోవున్న గ్రామమునసబుయింట్లోనే భోజనం వగైరాలకు పోలీసులకు బస. కర్మకాండ యావత్తూ సహస్రనామార్చనతో అక్కడనే ఓపావుగంటలో పూర్తయిపోయింది.

అయిదుగురు పంచాయితీదార్లు మధ్యాహ్నం ఒంటిగంటకు వెలిశారు. "కడుపులో నొప్పివల్ల బాధపడుతూ, ఆబాధ భరించుకోలేక నరిసి నిన్నటిరాత్రి ఊరిగమిడి దొర్వులో పడి ఆత్మహత్య చేసుకొన్నదిగాని ఇతర అనుమానాస్పదమైన కారణము లేమిన్నీ లేవని పంచాయితీదార్లమైన మాఅభిప్రాయం"అని తీర్పిచ్చి సంతకాలుపెట్టారు పంచాయితీదార్లు. అనుమానా లేమిన్నీ లేనందున శవాన్ని డాక్టరుపరీక్షకు పంపవలసిన అవసరం లేదని పోలీసువారు శవాన్ని మాదిగెలవశం చేయగా దాన్ని తగురీతిని దహనం చేశారు.

ఎవరిదారిన వారు వెళ్ళారు. మాదిగెలకు సమాచారం యావత్తూ తెలిసి వాళ్లు మనస్సుకితెచ్చుకొని బలవంతుడై నప్పటికీ చిన్నపరెడ్డిచేసిన దురంతానికి కోపం పట్టజాలక అక్కసం వెళ్ళగక్కుతూ, వాళ్ళలో వాళ్లు మీటింగులుపెట్టుకొని అప్పటిలో ఏమీ బహిరంగంగా చేయ దలపెట్టకుండా, సమయంవచ్చినపుడు ఈరెడ్డిని ముప్పతిప్పలాపెట్టి మూడు చెరువులనీళ్లూ తాగించాలని తీర్మానాలుచేసుకొని నివురుగప్పిననిప్పులా గమ్మమని పలక్కుండా ఊరుకొన్నారు.

౪

ఆరోజు కారోజు వ్యవహారంఅంతా పరిశపారిపోయి చిన్నపరెడ్డి మనస్సు స్థిమితపడింది. యథాప్రకారం అతను తనకార్యాలన్నీ చక్కపెట్టుకొంటూ మామూలుగా వీధిలో నలుగురిలోకీ రావడం చేయడం జరుగుతోంది. అంత హడావుడిలోనూకూడా నరిసి

తెచ్చినచెప్పులు మరచిపోకుండా అప్పుడే లోపల వోబుట్టలో భద్రపరిచివుంచాడు. కాని కథంతా తలక్రిందయేవరకు ఈగొడవలోపడి చెప్పులసంగతే మరిచాడు. పోలీసువారు వెళ్లిన మూడోరోజున తనకి బయటికిపోవడానికీ చేయడానికీ ఎండల్లో కష్టంగాఉన్నందువల్ల అతను కొత్తచెప్పుల్ని బయటకుతీశాడు. తీసి కాలు పెట్టబోయేవరకు అతనికి నరిసి తటాలున జ్ఞప్తికివచ్చింది. కాలు చెప్పులో దూరడానికి జంకింది. ఒక్కనిముషం నిదానించి ధైర్యం తెచ్చుకొని రెండుచెప్పులూ కాళ్లకు తొడిగాడు. రెండు మూడురోజులు ఆచెప్పులతోనే పొలంఅంతా తిరిగాడు. చెప్పులు కుట్టడంతీరూ అంతా షోకుగానేవున్నది. కిర్రుకూడా ఉంది. కుట్టడం మొగవాడు కుట్టినాడు కాబట్టి లోపంలేకుండానే తయారుచేశాడు. కాని కొత్తచెప్పులకి ఆముదంవేయడంమాత్రం ఆడది నరిసి అనడంవల్ల చమురు అంతబాగా పట్టలేదు చెప్పులకు. అందులో మండు వేసవికాలం అవడంచేత ఎండలకి చర్మం బహు బిరుసెక్కి కొయ్యబారిపోయివుంది. అవసరంకొద్దీ చెప్పులకు చమురు బాగా పట్టిందా లేదా అనేఆలోచన లేకుండా తెచ్చినచెప్పులు తెచ్చినట్లుగానే తగిలించి చిన్నపరెడ్డి పరధ్యానంతో ఇతరపనులమీద తిరుగుతూవచ్చాడు. కాని మూడోరోజుకి, కుడికాలుచెప్పు ఒరుసుకొని పాదంమీద రెండుచోట్ల కరిచింది. దానితో రెండు చిన్నపుళ్ళయినవి. దీనితల్లి కడుపుకాల చెప్పు కరిస్తే తగనిబాధ! అయినా ఇదేంచేస్తుందని పాపం లెక్కపెట్టకుండా మొండికెత్తి తిరిగాడు రెడ్డి. పాదంమీద లేచినపుళ్లు నీళ్లల్లో తడిసినవి. చెప్పులు కరిచిన పుండు నీళ్లల్లో తడవకూడదంటారు మరి. తడవడంతో అవి నీరుపోసి బొబ్బలెక్కినవి. అదే పోతుందని లెక్కపెట్టకుండా చిన్నపరెడ్డి ఆపుళ్లమీదనే మళ్ళా చెప్పులుతొడిగి మొండికెత్తి, బండతనంతో మరిరెండురోజులు తిరుగుతూవచ్చాడు. మళ్ళా యధాప్రకారం కాలు తడుస్తూనేవుంది. దీనికితోడు భోజనంలో పెసరా శనగా మొదలయిన పప్పుదినుసులు తగులుతూ వచ్చినందున పుళ్లురెండూ చీముపోసినవి. దానితో కాలుకొంచెం బలువుచేసింది. పోటు జాస్తీ అయింది ఆరోజుకారోజు. కొంచెం పులకరంకూడా తగిలింది. పూర్వపు మొండితనంతో తిరగడానికి వీలులేకపోయింది. కాని చెప్పులు తిరిగి తొడగకపోయినా పుళ్లకి వెంటనే తగిన చికిత్సచేయడానికిమాత్రం అత డుపేక్షచేసి, పైగా భోజనంలో మామూలు ప్రకారం మజ్జిగా పెరుగూవగైరాలు యావత్తూ వేసుకొని తింటూవచ్చాడు. అందువల్ల కాలిమీద రెండుపుళ్లూ క్రమేణా వృద్ధిఅయి బాధ ఎక్కువైంది. మంచం ఎక్కేస్థితికి వచ్చింది. అప్పటి కప్పుడే పదిరోజులైంది. కాలిపోటువల్ల రాత్రిళ్ళు నిద్రలేదు. కూచోనివ్వదు, నిలవనివ్వదు, పడుకోనివ్వదు కాలు. అప్పటికి గ్రామంలో చట్కారివైద్యాలు కొన్ని చేయించాడు. ప్రయోజనం లేకపోయింది. పదిహేనురోజులైంది. అన్నహితవు తగ్గింది శరీరం నీరసించింది. బాధ జాస్తిఅయింది. మనిషి సగమయిపోయాడు. ఏమిచేయ

డానికీ తోచలేదు. అందులో చైత్రవైశాఖమాసాలు—మండువేసవి. తగనిదాహం—రోజుకు ముప్ఫై, నలభై సార్లు అల్పాచమానం—నిస్సత్తువ—లేవలేనిస్థితి వచ్చింది. మంచం మీదనే సమస్తమూ జరుగుతున్నవి. ఏమేమి వైద్యాలో చేశారు. ఎందరెందరికో మొక్కుకొన్నారు. కాని రెడ్డికి నయంలేదు. ఇరవైరోజు లైంది. నెల్లాళ్లుకూడా అయింది. సేద్యం సాద్యం విచారణంతా జీతగాళ్లకే వదిలేశాడు రెడ్డి. ఇంటో ఇతరసంతన లేకపోయె. తల్లీ భార్యా అస్థులరిగిపోయేటట్టు చాకిరీ చేస్తున్నారు.

ఇంట్లోస్థితి ఈవిధంగా ఉండగా మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు చిన్నపరెడ్డి ఎద్దులలో ఏనుగుపిల్లలాంటి మూడువందలరూపాయల ఖరీదుచేసేఎద్దుకు ఇపిరివాపువల్ల జబ్బుచేసి మూడోనాటికల్లా కాఁఅని నల్లరాయి బద్దలైనట్లు బద్దలయి పశువులదొడ్లో చచ్చిపోయింది. ఆసంగతి వినేవరకు చిన్నపరెడ్డికి నవనాళ్ళూ కుంగిపోయినవి. దొడ్లో ఉన్న ఎద్దును చూడాలని కోరికపుట్టి అత డొకటిరెండుసార్లు లేచాడుగాని కాలు కింద పెట్టలేకపోయాడు. ఆఖరుకు అతని బలవంతంమీద అతను పడుకొన్న నులకమంచాన్ని నలుగురు సేద్యగాండ్లు సాయంపట్టి మంచంపళ్లంగా అతన్ని దొడ్లోకి తీసుకుపోయి చచ్చినయెద్దును చూపించారు. ఎద్దును చూచేవరకు చిన్నపరెడ్డి బొరుమని ఏడ్చాడు. బెంబేలుపడవద్దని ధైర్యంచెప్పి యింట్లోవాండ్లు తిరిగి మంచాన్ని లోపలికి సాయంపట్టించారు.

ఉదయం పదిగంటలకు చచ్చింది ఎద్దు. సామాన్యమైనఎద్దు గాదు. పిల్లయేనుగువలె మంచిబలంమీద ఉన్నది. దాన్ని బయటికి తీయాలంటే ఏనలభైమందో కావాలి. చిన్నపరెడ్డి మాదిగవాళ్ళకి కబురంపాడు. దొరికింది సమయం అనుకొన్నారు మాదిగలు. నరిసి వాళ్లకడుపులో పెట్టిపోయినచిచ్చు చల్లారలే దింకా. ఆనాటికానాడు నిజం పూసగుచ్చినట్టు ఒక్కొక్కసంగతే చెవినిపడేవరకు వాళ్ళకు రగిలిపోతోంది కడుపులో. అందులో పట్టుపట్టారంటే అతి మూర్ఖప్పట్టు వాళ్లది. హఠంపట్టితే త్రిమూర్తులు దిగివచ్చినా ససేమిరా అనేరకం. అదిగాక ఇప్పటికి ఎన్నితరాలనుంచో గ్రామంలోకల్లా పెద్దమాదిగ అని గౌరవంతో బహుచాకచక్యముతోనూ తెలివితేటలతోనూ మాదిగవాడలో అనాది కట్టుబాటులు చెడకుండా జరుపుకొన్నారు నరిసిమొగుడు ఆదిగాడూ, వాడితాతముత్తాతలూను. అట్లాంటి గౌరవంగల కులపెద్దకుటుంబానికి నేటికి చిన్నపరెడ్డిహయాంలో ఇన్ని కడగండ్లు వచ్చినందుకు మాదిగలందరూ శివమెత్తి పరవళ్ళుతొక్కుతున్నారు. ఏమైనాసరే ఆరుమూడైనా మూడారైనా సరే చిన్నపరెడ్డియింటికి ఉద్యోగానికిమాత్రం మాదిగవాడయినవా డెవ్వడూ పోగూడదని ప్రమాణాలుచేసుకొన్నారు. చుట్టుపక్కల పదిమైళ్ళ

దూరంలోగల అన్నిపల్లెల్లోనూ మాదిగవాళ్ళందరికీ వీళ్లే పురెక్కించి సమ్మెకట్టించారు. చిన్నపరెడ్డికి ఈసంగతి తెలియనే తెలియదు.

మాదిగ లెవ్వరూ రానన్నారన్న సంగతి పోయినమనిషి వాపసువచ్చి చిన్నపరెడ్డితో చెప్పాడు. రెడ్డి మంచంమీద ఉన్నాడు. పుళ్లురెండూ క్రమేణా పెరిగి కాలంతా వ్యాపించి పాదమంతా అలుముకొని ఒక పెద్దవ్రణమైంది. పొద్దు గూకవచ్చింది. ఉదయం పదిగంటలకు చచ్చినయెద్దు సాయంత్రంవరకూ అట్లాగే వున్నది దొడ్లో. దేనికని తాపత్రయపడగలడు పాపం చిన్నపరెడ్డి? ఇంట్లో ఆడసంతనాతప్ప మగసంతనా లేకపోయె. జీతగాళ్లూ సేద్యగాళ్లూ వోయేడెసమండుగు రున్నప్పటికీ వాళ్ళవల్ల అయ్యేపని కాదయ్యె ఇది. వ్యవహారమంతా అడ్డంతిరిగినట్టు కనిపించింది. రెడ్డి తాను స్వయంగా పోయి చూచుకొంటేనే గాని చక్కబడేటట్టు లేదు వ్యవహారం. స్వయంగా వెళ్లినప్పటికీ లాభంవుండేటట్టుగా లేదు. ఏమిచేయడానికీ తోచక గ్రామమునసబును పిలిపించి సంగతి యావత్తూ చెప్పాడు రెడ్డి. ఆరోజు చీకటిపడినందున మరునా డుదయాన్నే తాను మాదిగలను పిలిపించి విచారిస్తానని చెప్పి మునసబు వెళ్లిపోయినాడు.

మరునాడు ఉదయాన్నే మాదిగవాళ్లను పిలిపించి సంగతేమిటని విచారించి పరిష్కారంచేద్దా మనుకొన్నాడు మునసబు. కాని అప్పటికప్పుడే చాలాగాథ పెరిగి అనేక విషయాలు అతని చెవికివచ్చినవి. మాదిగలందరూ సభచేసి సమ్మెకట్టినారనీ, ఒకటి కాదు లక్షయిచ్చినాసరే ఈదెబ్బతోమట్టుకు చిన్నపరెడ్డిగుమ్మం తొక్కడానికి వీల్లేదనీ, ఆసాము లెంతహింసించినా వాళ్లు అన్నింటికీ తెగించివున్నారనీ యిట్లాంటివార్త లనేకం బయలుదేరాయి. తెల్లవారేవరకు గ్రామం అట్టుడికినట్లు ఉడికిపోతోంది. "అంత మదించి కిందూమీదూ తెలుసుకోకుండా ఆడదాన్ని హత్యచేస్తే ఊరికేపోతుందా" అని కొందరూ, "పాపం నెల తిరగకుండానే చిన్నపరెడ్డి కన్నికష్టాలు వచ్చిపడ్డ"వని కొందరూ, "డబ్బుచూపితే వాళ్లే వస్తారు. రా కేంచేస్తారు మాదిగ"లని కొందరూ అంటున్నారు. చిన్నపరెడ్డికి కావలసిన బంధువులందరూ మాదిగవాళ్లుచేసే ఆలోచనలకి ఆగ్రహపూరితులై "ఈదెబ్బతో చూడు మాదిగవాళ్లను రూపుమాపుతా"మని హుమ్మస్సుతో గంతులేస్తున్నారు. వ్యవహారం శ్రుతిమించి రాగాన్న పడేటట్టుగా వున్నదని గ్రహించి మునసబు "రవంత నిదానించండోయ్. ఇట్లా తొందరపడే చిన్నపరెడ్డి యింతవరకూ తెచ్చాడు వ్యవహార మంతాను. పూర్వపురోజులు కా వివి. నిదానం మంచి"దని వాళ్లను శాంతపరుస్తూ వచ్చాడు. పేరుప్రతిష్ఠలమాట ఎట్లాగున్నా సమయాన్ననుసరించి మాదిగలను నయాన్నా భయాన్నా సాధించి చచ్చినయెద్దును బయటికి లాగించి కార్యం కొనసాగించుకోవడంకంటె మరోగత్యంతరం లే దనుకొన్నాడు మునసబు.

పదిగంటలు కావచ్చింది. తాను పిలిపించినా గ్రామంలోకి వచ్చేటట్టు లేరు మాదిగలు. పూర్తిగా వేడిమీద ఉన్నారు. తొందరపడి ప్రయోజనంలే దనుకొన్నాడు మునసబు. అదిగాక మొట్టమొదట చిన్నపరెడ్డి చేసినదంతా దుర్మార్గంఅని అతనికీ తెలుసు. అందువల్ల మాదిగవాండ్లతో ఎట్లాఅంటే అట్లా అడ్డంతిరిగి మాట్లాడితే వీలులేదని గ్రహించాడు. ఒకసారి చిన్నపరెడ్డియింటికి పోయి మాట్లాడివచ్చాడు. అతడు మహాసముద్రంలో ఉన్నాడు. "నీయిష్టప్రకారం చేసి యెద్దును బయటకు సాగనంపే వుపాయం చూచి మాసం కాపాడు మామా"అని చిన్నపరెడ్డి మునసబు రెండుచేతులూ పట్టుకొని దీనంగా ప్రార్థించాడు. మునసబు గ్రామచావడికి వచ్చాడు. గ్రామంలో ముఖ్యులు నలుగురు రెడ్లనూ పిలిపించాడు. విషయం సవిస్తరంగా చెప్పాడు.

"ఊళ్ళో చచ్చినగొడ్డును మాదిగాడు తీసుకుపోకపోతే మరొకరు వీళ్లతాత ఎవరు వచ్చి తీసుకొనిపోతారనుకొన్నారో ఈమాదిగలు? పిలిపించి నలుగురిలో అడగండి. ఈనాడు వీళ్లు కొత్తమామూలు తీసుకొస్తే అంతేనా? ఆయాటలు సాగవలసిందేనా? పిలిపించండి. ముందు పెద్దమాదిగవాణ్ణి పిలిపించి అడగండి" అని ఆనలుగురులో ఒకరెడ్డి అన్నాడు. సరేనని పెద్దమాదిగవాణ్ణి గ్రామరచ్చకు పిలిపించారు. మాదిగ లందరూ కూడబలుక్కొని "సరే పోయి నిజం చెప్పేసిరా. భయ మేముంది? మననేం కొడతారా చంపుతారా? చంపితే చస్తాం లే" అని పెద్దమాదిగను పంపారు. వాడు రచ్చకాడికి వచ్చాడు. రెడ్లు నలుగురూ "చచ్చిన యెద్దును తీసుకొనిపోయే ఆలోచనచేసి, ఏదో ఆయనవల్ల నాలుగు పావులు అదనంగానే ఈనాం తీసుకోండి" అని పెద్దమాదిగతో అన్నారు.

"మావాళ్లు వినేటట్టులేదు సామీ! నన్ను ముక్కలుగా కోసినాసరే. ఈదఫాకు ఈపనిమాత్రం చేయలేము." అని చెప్పి దణ్ణంపెట్టి పెద్దమాదిగవాడు వెళ్లిపోయినాడు.

వ్యవహారం ఆఖరుకు గడ్డుబారింది. డబ్బాశపెట్టినా తాడు పారేటట్టు కనిపించడం లేదు. ఎద్దు చచ్చి అప్పుడే రెండోరోజు. ఏనుగంతశవాన్ని దొడ్లో ఆవిధంగా పెట్టుకొని యింట్లో సంసారంచేయాలంటే భయంగా వుంది యింటిల్లిపాదికీని. ఏమి తీర్మానం చేశాడో తెలుసుకురమ్మని మునసబుకాడికి చిన్నపరెడ్డి మనిషిని పంపాడు. తాడు బిగుసుకొన్నదని అతడు జవాబిచ్చాడు. చిన్నపరెడ్డికి కాలిమీద రణబాధ జాస్తీగా వుంది. దొడ్లో పసరం బయటికి పోయేదారి కనిపించడంలేదు. ఇతరయెద్దులూ ఆవులూ బర్రెలూ — అన్నీ దిగులుపడి మేతమేయడం చాలించి రాత్రితెల్లవార్లూ నిలబడి అంబా అంబా అని అరుస్తూ గుంజచుట్టూ తిరుగుతూ గలభాచేస్తున్నవి. తెల్లవారి వాటిని బయటికితీసినపుడు ప్రతి పశువూ చచ్చిన ఎద్దుకాడికి పోవడమూ, అదొకవిధమైన బెదురుచూపులతో దాన్ని మూ

చూడడమూ; మూచూడటంతోనే మొన్నటివరకు వాటితోకూడా తిరిగినగొడ్డు అయినప్పటికీ, చలనం లేకుండా పడివుండడం చూచి యితరపశువులన్నీ బెదురుకొని తోకలెత్తి చెవులు నిక్కబెట్టి నాలుగుకాళ్లమీదా ఒక్కసారి యెగిరి గంతువేస్తూ దూరంగా పారిపోవడమూ ఆరంభించినవి. పశువులదొడ్డి అంతా ఖంగాళీఅయి కళావిహీనమై భూతప్రేత పిశాచాదులు తాండవిస్తూవున్నట్టుంది.

మరునాడుకూడా సాయంత్రంఅయింది. మాదిగవాళ్లు ఎక్కినగుర్రాన్ని దిగలేదు. గ్రామం దద్దరిల్లిపోతోంది. ఎవరికీ కర్తవ్యం పాలుపోవడంలేదు. గ్రామమునసబు ఫోలీసు వారికి రిపోర్టుచేద్దామనుకొన్నాడు. చేస్తే మునసబుఅధికారం చేతిలో పెట్టుకొన్న తననే ఏదోవిధంగా కూలీలచేత ఎత్తించి పారెయ్యమని ఉత్తర్వుచేస్తారేమో అని భయపడ్డాడు.

చీకటిపడింది. ఎద్దుకళేబరం నీచుకంపుకొట్టడం ఆరంభించింది. చిన్నపరెడ్డి ముక్కుకి వాసనకొట్టింది. తనకాలిమీది కురుపువాసనఅయిందీ దొడ్లో ఎద్దువాసన అయిందీ మొదటిలో అతని కవగాహన కాలేదు. రాత్రి పొద్దుపోయినకొద్దీ ఎద్దువాసన ఎక్కువైంది. చిన్నపరెడ్డికి దిక్కు తోచడంలేదు. చూడ్డానికి వారూ వీరూ వస్తూపోతూ వున్నారుగాని మాదిగవాండ్లసంగతి ఎవరికీ అలవికాలేదు. మునసబుకుకూడా ఆందోళన ఎక్కువైంది. గ్రామాధికారిగా వుండీ ఇంతమాత్రం పనిచేయించలేకపోయావని పై అధికార్లు చివరి కొచ్చేవరకు తననెత్తిమీదికి తెచ్చిపెట్టుతారేమోనని అతనికి ఖంగారుపుట్టింది. కాని యేంచేయగలడు పాపం? మాలవాడకు చెప్పిపంపి పదిమందిని పిలిపించాడు. కల్లు పోయిస్తానని చెప్పి అనేకవిధాల పోరి వాళ్లను బ్రతిమలాడినాడు. "మాదిగవాళ్లు చేయవలసినపనిని మమ్మల్ని చెయ్యమంటారేందయ్యా"అని వాళ్లు నోట్లోజవాబు నోట్లో వుండగనే వెళ్లిపోయారు.

తెల్లవారింది మూడోరోజు. ఎద్దును కుక్కలు తినకుండా ఈతాకుచాపలు కప్పి యిటికరాళ్లు ఎత్తిపెట్టారు. చిన్నపరెడ్డి సేద్యగాండ్లను పిలిచి ఈదఫాకు ఎల్లాగో మాట దక్కించమన్నాడు.

"ఎవరు చేసుకోవలసినపనులు వాళ్లు చేసుకోవలసిందేకాని యిట్లాంటిదానిలో లక్ష యిచ్చినా మావల్లగా"దని వాళ్లు తిరగబడ్డారు. తెల్లవారేసరికి ఎద్దుకళేబరం కుళ్లి గబ్బు జాస్తీఅయింది. గవులుకంపు బయలుదేరింది. చుట్టుపక్కల యిరుగుపొరుగువాళ్లకు దుర్భరమైంది వాసన. మాదిగలు చంకలు తట్టుకొంటున్నారు. చిన్నపరెడ్డి దబ్బాళ చాలా చూపించాడు. కాని అలగాజనంగూడా ఆతట్టు మెదలడమే చాలించుకొన్నారు. గ్రామంలో పెద్దలకు గత్యంతరం తోచడంలేదు మునసబు గ్రామచావడిలో సభచేయిం

చాడు. పెద్దల నందరినీ పిలిపించాడు. సభాపతి వేదాంతం సుబ్బావధానిగారినీ, రంగయ్య సెట్టినీ, రెడ్లనూ, చాకలీ, మంగలీ, కుమ్మరీ వగైరా పనిపాటలవాండ్లనూ పిలిపించాడు. అందరూ చేరారు. పెద్దమాదిగనుకూడా పిలిపించమన్నారు. వాడు మళ్లా వచ్చాడు.

సభలో ధర్మసందేహాలు చాలా బయలుదేరినవి. "ఇట్లాంటి ఘట్టాలలో చిక్కు వచ్చినపుడు ధర్మశాస్త్రాలు ఏం చేయవలసిందని చెప్పుతున్నవో చెప్పవలసిం"దని అవధాని గారిని సభవారు ప్రశ్నించారు.

"చెప్పడాని కేముంది? వర్ణాశ్రమధర్మాలకు తలవెంట్రుకవాసికూడా లోపంరావ డానికి వీలులేదు. ఎవరెవరి కులవృత్తులు వారువారు సశాస్త్రీయంగా చేసుకోవడమే కర్తవ్యమని ధర్మశాస్త్రం చెప్పుతున్న"దని అవధానిగారు సెలవిచ్చారు.

మునసబు: అవును స్వామీ! ఇప్పుడు మాదిగలు వాళ్లపని వాళ్లు చేయడానికి నిరాకరించారుగదా. గ్రామంలో ఆపశువు అట్లా కుళ్లిపోవలసిందేనా?

అవధాని: వాళ్లపనివాళ్లు చేయడంలే దనడానికి మాదిగల యిష్టమేనా ఏమిటి? అట్లాంటి అధికారాలు ఏమీ వాళ్లకు లేవు.

మాదిగకులపెద్ద: దణ్ణంపెట్టి చెప్పుతా సామీ! భామ్మర్లందరూ వారిపనులు వారు చక్కంగా చేస్తుండారా అంటా?

అవధాని: అధికప్రసంగం చేయబోకు. బ్రాహ్మణుడు ఏమిచేసినా తప్పులేదని ధర్మ శాస్త్రాలు ఘోషిస్తున్నవి.

మునసబు: ఈవాదన కేమిగాని అవధానిగారూ! ఇప్పట్లో మనం చేయతగ్గ దేముందో తమరు శెలవియ్యాలి.

అవధాని: చెప్పానుగా. ఆపశువును మాదిగవాళ్లే యెత్తి పారవేసితీరవలె.

మాదిగ: "ఎందుకుసామీ! తమరిట్లా సెలవిస్తారు? పెద్దపెద్ద ఆసాములందరూ చేరి మమ్మల్ని ప్రాణాలతో బతకనివ్వకుండా చేశారు. ఒక్కపూట చెప్పులుతేవడం ఆలస్య మైందని చిన్నపరెడ్డిగారు ఆడదానిప్రాణం తీసేశారు. ఏమో మాదిగోళ్లంటే అంత అలుసుగా వున్నారుకాబోలు మీఅందరికంటికీని. పైగా సరకారువారుకూడా మీబోటి మారాజులతోనే ఏకీభవించి ఈమధ్య మామాదిగలయీనాంభూములన్నీ పెరుక్కొని కోరులో కలిపేశారు. మాతాతముత్తాతలనా డేనాడు సంపాదించుకొన్నవో ఆ భూములు. ఆసందు మేము కలకటేరుగారికి అర్జీలు యిచ్చుకోగా మాదిగోళ్లకి యినాం భూము లుంచవలసిన అవసరం లేదని దొరతనం ఉత్తరువులుచేశారని మాకు తాకీదు

లంపారు. మామాదిగోళ్ల యినాంభూములన్నీ సర్కారులో కలిసిపోతూవుంటే మీరం దరూ ఏంచేశారు సామీ? గ్రామానికి మాదిగవాడు పనికిరానివాడా? చాకలోడికీ మంగ లోడికీ, కుమ్మరోడికీ, కమ్మరోడికీ-అందరికీ మాన్యాలుఉంచి మాదిగోళ్లకిమాత్రం ఎందుకు లేకుండాచెయ్యాలి సామీ? మేం చేయలేము సామీ! ఈచాకిరీలు. తమ రిష్టంవచ్చినోళ్ల చేత చేయించుకోండి" అని చెప్పుతూ సభవిడిచి వెళ్లిపోయాడు.

అవధానిగారికి వ్యవహారం పరిష్కారంచేయడ మెట్లో ఆలోచన తోచలేదు. "మీఇష్టంవచ్చినట్టుచేసి ఎట్లాగో ఆ యెద్దుకళేబరాన్ని బయటికి సాగనంపేవుపాయం చూడండి"అంటూ ఆయన లేచి పిర్రల కంటుకొన్నమట్టి దులుపుకొన్నాడు.

మునసబు "లేవబోకండి స్వామీ! ఈపరిస్థితుల్లో మనం ధర్మశాస్త్రాలు తిరగవేస్తూ శుష్కప్రియాలు చెప్పుకొంటూవుంటే కార్యంలేదు. ఎట్లాగో అనుకొన్నపని జరిగించాలె. పూర్వపుకట్టుబాట్లు ఇప్పుడు లేవు. కాలంఅంతా మారిపోయింది. గ్రామంలో శవం పడి వుంటే అది నాపనిగాదని ఎవరిమట్టుకు వాళ్లు చేతులు ముడుచుకొని కూచుంటే ఎట్లా? అది ఖుల్లి ఊరకంతకీ మోసంతెస్తుంది. కాబట్టి నామాట విని మనలో పిన్నా పెద్దా, బ్రాహ్మణా అబ్రాహ్మణా అనేభేదంలేకుండా అందరమూ చేతులుకలిపి ముందు ఆ యెద్దును బయటికిలాగి పూడ్చిపెడదాం రండి"అని అనేవరకు ఇక గత్యంతరంతోచక అక్కడ చేరిన నలుగురు పెద్దలూ సరేనని ఒప్పుకోవలసివచ్చింది.

అవధానిగారుకూడా పరిస్థితులబలాన్ని తప్పించుకోలేక సరే నన్నాడు. పెద్దలం దరూ వర్ణవివక్షత లేకుండా సంఘానికందరికీ సంబంధించినకార్యంపట్ల నడుములు బిగించే వరకు, అదివరదాకా తప్పించుకొనితిరిగే చిల్లరజనానికి సిగ్గువచ్చి వాళ్లుకూడా తయారై నారు. అంతా అయిదునిముషాల్లో ఏభైమంది పోగైనారు. ఎద్దు నికగ్రామంలో వుంచ డానికి వీలులే దన్నారు. పట్టండంటే పట్టండని మునసబూ కర్ణమూ అవధానీ పెద్దరెడ్డీ చిన్నరెడ్లూ చాకలీ మంగలీ యానాదీ వైశ్యా—ఒకరేమిటి, సమయానికి చేతికందినవా ళ్లందరూ చేరి సాయంపట్టి యెద్దును ఊరిబయటకు తీసుకొనిపోయి ఎట్లాగైతేనేం భూస్థాపితం చేశారు.

మాదిగలందరూ పొట్టలుబ్బా నవ్వుకొంటున్నారు. తమపట్టు నెగ్గిందని సంతో షించారు. "కానీ చూతాం, ఎంతకాలమని యిట్లా మాదిగపనిఅంతా గ్రామస్థులు చేయ గలరో, చూతాం లెండిరా"అని వాళ్లింకా బిర్రుమీదనే ఉన్నారు.

౫

ముందుపరిస్థితులు ఎట్లాగున్నా చిన్నపరెడ్డికి ప్రస్తుతంలో ఒకగండం తప్పింది. కాని గండం తప్పిందని సంతోషిస్తాడా, లేక తనమూలాన్న గ్రామాని కింతకష్టం వచ్చిందని దుఃఖిస్తాడా? పశ్చాత్తాపపడ్డాడు. సమయానికి మాదిగలు కట్టినసమ్మె తలుచుకొని ఆక్రోశపడ్డాడతడు. కాని తనది నిస్సహాయస్థితి. ఏమి చేయగలడు?

కాలికురుపుబాధ మరీ జాస్తీఅయింది. పాదంఅంతా కుళ్లిపోయింది. బాధ భరించడం కష్టమవుతోంది. ఎన్నిసదుపాయాలుచేసినా తగ్గుదశలోకి రాలేదు. ఇక పల్లెటూరివైద్యం చేయించి ప్రయోజనంలేదనుకొన్నాడు. ఆస్పత్రికిపోయి డాక్టరుకు చూపితేనేగాని వీలులేదని యింట్లో ఆడవాండ్లుకూడా తొందరచేశారు. సరేనని తెల్లవారు జామున బండికట్టుకొని పదిమైళ్లదూరంలోవున్న ఆస్పత్రికి తెల్లవారేవరకు చేరాడు.

డాక్టరు పరీక్షించాడు. అల్పాచమానం చూచాడు. చక్కెర (షుగరు) కనపడింది. వ్యాధి బాగా ముదరబెట్టా రన్నాడు డాక్టరు. కాలు తెగగొట్టవలసివుంటుందేమో అన్నాడు. చిన్నపరెడ్డికి ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినవి. ఎందుకనో అప్రయత్నంగా నరిసి జ్ఞాపకంవచ్చింది; బెదురుకొన్నాడు. గుండె దడదడమన్నది. డాక్టరును చూచి బెంబేలుపడ్డాడు. కాలు పరీక్షచేసి ఆపరేషనుచేయాలన్నాడు డాక్టరు; కాని నమ్మకం చెప్పలే నన్నాడు. 'అదృష్ట మెట్లా గుందో, ఆపరేషనుచేయించండి' అన్నది భార్య. చిన్నపరెడ్డి పలకలేదు. నిస్పృహచెంది ఊరుకొన్నాడు. కొత్తచెప్పు లింతపనిచేస్తవని కలలోనూ అనుకోలేదు రెడ్డి. మధుమేహరోగికి క్లోరోఫారంఇవ్వడానికి వీల్లే దన్నాడు డాక్టరు. క్లోరోఫారం యివ్వకుండా ఆపరేషనుచేయించుకోవడానికి రెడ్డికి భయంవేసింది. కాని చేయించుకోకవిధిలేనట్లుగా వుంది. బాధ భరించుకోలేకుండా వున్నాడు. ప్రాణం పోయినా మేలే అనిపించిం దతనికి. "డాక్టరుగారూ! తమయిష్టంవచ్చినట్లు చేయించండి" అన్నాడు రెడ్డి.

తెల్లవారింది. ఉదయం ఏడుగంటలకు చిన్నపరెడ్డిని వెల్లకిలా పండుకోబెట్టారు. మనిషికి శవాకారంపడ్డది. డాక్టరుకు నమ్మకం చాలలేదు. ఆపరేషనుకు ముందు జరుగవలసిన వ్రాతకోతలన్నీ జరిగిపోయినవి. తనతో వచ్చిన బంధువులందరినీ ఆఖరుసారి ఒకపర్యాయం రెడ్డి చూడా లన్నాడు. చూపించి వాళ్లనందరినీ డాక్టరు బయటికి పంపివేశాడు. తలుపులు వేశారు.

చిన్నపరెడ్డి అయోమయంలో వున్నాడు. ఇద్దరుమనుష్యులు తలతట్టున నిలబడి చెరియొక రెక్కా పట్టుకొని క్రిందికి గట్టిగా అదిమిపట్టుకొన్నారు. తల ఒకరు అదిమిపట్టు

కొన్నారు. రెండుకాళ్లూ ఇద్దరుమనుష్యులు కదలకుండా పట్టుకొన్నారు. చిన్నపరెడ్డి కళ్లు మూసుకొన్నాడు. నరిసి ప్రత్యక్షమయింది. బోరుమని ఒకవెర్రికేక వేసి రెడ్డి పైకి గభాలున లేచి కూర్చోబోయినాడు కాని వీలుకాలేదు. అతని భౌతికశరీరంఅంతా అన్యాక్రాంతమైపోయివున్నది. కళ్లు మూసుకొంటే వెర్రిస్వరూపాలు గోచరిస్తూవున్నవి. చచ్చిపోయినఎద్దు జ్ఞాపకానికివచ్చింది. నరిసి వచ్చి నవ్వింది వికారంగా. కళ్లుతెరిచాడురెడ్డి. డాక్టరు చేతిలో కత్తి కనిపించింది: బాబో యన్నాడు. డాక్టరు కళ్లకు గంతలు కట్టమన్నాడు. కట్టారు. విశ్వమంతా అంధకారమైంది రెడ్డికి. కుళ్లిపోయినకాలిమీదిచర్మం కాగితం ముక్కలా వేలాడుతున్నది. డాక్టరు కత్తెరతీసుకొన్నాడు. కత్తిరించవలసినచర్మం గుర్తుపెట్టుకొన్నాడు. రెడ్డిని పట్టుకొన్నమనుష్యులకు డాక్టరు సంజ్ఞచేశాడు. రెడ్డికి ప్రపంచమంతా నరిసిస్వరూపం అయిపోయింది. కళ్లు మూసుకొనిఉన్నవో తెరచిఉన్నవో అతనికే తెలియలేదు. దాహం దాహంఅని అరిచాడు. ఇన్నినీళ్లు గొంతుకలో పోశారు. రెడ్డికి మళ్లా కొత్తచెప్పులూ, బుట్టాతో నరిసి కళ్లకు ప్రత్యక్షమయింది; విషపునవ్వు, వికారపునవ్వు, జాలినవ్వు నవ్వింది. ఇంతలో పాదంమీద చర్మం పరపరమని తెగిపోతోంది. గుడ్డలా కత్తిరించేస్తున్నాడు డాక్టరు. 'బాబోయి నరసమ్మోయి, నరిసోయ్, చచ్చానురోయ్, చచ్చానురోయ్' అని అరవడం మొదలుపెట్టాడురెడ్డి. కత్తిరింపు సగం అయింది. ఇక సగం కొరవుంది. చిన్నపరెడ్డికి చలనం తగ్గింది. డాక్టరు కత్తెర మార్చాడు. కాళ్లూ చేతులూ పట్టుకొన్నమనుష్యులచేతులకు రెడ్డిశరీరం చల్లంగా తగిలింది. డాక్టరుతో చెప్పారు. గుండెమీద చేయివేసి చూచాడు డాక్టరు. అప్పటికే హంస లేచిపోయింది. పాడుకట్టెను బంధువుల స్వాధీనం చేశారు.

ఆద్యంతాలు

వెంపటి నాగభూషణం, ఎమ్. ఏ.

[చిన్నయిల్లు. ముందు వరాండాలో నాలుగైదు కుర్చీలు, రెండు చిన్నటీపాయ్‌లు వున్నాయి. ముందుతోటలోంచి వస్తూన్న చల్లగాలిని ఆనందిస్తూ, ఓ కుర్చీలో కూర్చొని, వెనుకటి "పరంజ్యోతి" పత్రికల్ని తిరగవేస్తూంటాడు నీలాచలం. పాతికేళ్లవాడు. మెడమీదికి పడ్తూన్న పొడుగాటి వెంట్రుకలు, గుండ్రని మొహం, కళ్లకు అద్దాలు. ఓపత్రికను పరికించడమైన తర్వాత మరొకొక్కదాన్ని తీసి చూస్తుంటాడు.

శ్రీమాలి ప్రవేశిస్తాడు గేటులోనుంచి. సరాసరి, పూలమొక్కల మధ్యవున్న కాలిబాట వెంటవచ్చి వరాండా ఎక్కుతాడు. ఇతనికీ సుమారు పాతికేళ్లే. పచ్చని శరీరం. సిల్కులాల్చి, సిల్కుపైజామా తొడుక్కున్నాడు. కళ్లకు పాన్స్‌నే. చేతులో కాగితం ప్యాకెట్టుంది.

నీలాచలం శ్రీమాలివంక ఓమారు కన్నెత్తిచూచి, తిరిగి పత్రికావలోకనంలో మగ్నుడౌతాడు.]

శ్రీమాలి (అతని మూకీభావానికి కొద్దిగా వింతబోతూ, ప్యాకెట్టు బల్లమీద పెట్టి, కుర్చీలో కూర్చుంటూ). ఏం నీలం, యిట్లావున్నావు యీదినం? హుషారంతా ఏమైంది? మరిచిపోయినా, ఎల్లుండి రాత్రేకదూ మీరంతాకలిసి ఇంగ్లీషునాటకం ప్రదర్శించేది. ఆవిషయాన్ని గురించి ఎంతో ఆతురతగ వుండవలసినవాడవు, షేక్స్పియరులాగ మొహం పెట్టి — యిలాదిగాలుపడి కూర్చున్నావేం?...సాయంకాలం గదా, షికారన్నా బయలేరలేదేం?......మాట్లాడవేం, నీలం?...నాటకంవిషయంలో నీకూ వాళ్లకూ ఏమన్నా తవ్వాా జరిగిందేం? లేకపోతే...గలించిపోయిన టి. బి. ట్రాజిడిని తల్చుకుంటూ విచారపడ్తున్నావా? అరే, తమాషాగా వుందే......మాట్లాడవేం, నీలం?......

[నీలాచలం ఓమారు శ్రీమాలివంక చూచి వూర్కుంటాడు.]

...ఆచూపుకు అర్థం?...నేనొచ్చి ఏం చెడగొట్టలేదుగద రంగాన్ని? చిన్నీ ఏవో చీరెలు కావాలంటే అంగడికివెళ్లి, నాలుగైదు నమూనాకు తీసికొని—యిలావెడ్తూ—ఏంచేస్తున్నావో చూచిపోతాంగదా అని వచ్చాను ..మరిచిపోయినా, చూడు. (ప్యాకెట్టు విప్పుతూ)...ఈ చీరెలు నువ్వుగూడా చూడు. నీ అభిప్రాయ మెల్లావుంటుందో... ఇవిగో (చూపిస్తూ) నాలుగూ నాలుగు రకాలు. చూచావ్, యీ అంచులు. ఇప్పుడిప్పుడు క్రొత్తగా వస్తున్నాయి. మంచిపట్టు. కనీసం రెండు మూడేళ్లయినా ఆటివస్తాయ్—కావాలని పట్టి చింపకపోతే. ఏమైతేనేం. పాతికరూపాయలకు తక్కువలేదు

దేని ఖరీదూను. కొంపతీసి, చిన్నీ నాలుగూ కావాలన్నదా, నాపని అయింది. ఏక్ దమ్ గుండె జారిపోతుంది. ఈ నాయికలతో వచ్చిన పేచీ యిదేనోయ్! నీలం, చెప్తే నమ్ముతావో లేదో,—నీదగ్గర నా రహస్యా లేమీలేవు కాబట్టి చెప్తున్నాను—చిన్ని కోసం—యీవరేజిమీద యాభై రూపాయలు వ్యయంచెయ్యని నెలలేదు—యీ ఏడాదిలో మరి, నా సంపాదనా, రాబడీ—నీకు తెల్సుగా......ఈస్థటిక్కు తత్వాం యిచ్చి—యిలా కవులనుగాను, ఆర్టిస్టులనుగాను, యాక్టర్లగాను—ఎందుకు పుట్టించాడో దేవుడు. ఈలాంటి టెంపరమెంటు వుండడంగూడా జీవితంలో—ఓ ప్రతిబంధకమే ననుకుంటాను. కళాభిరుచిగూడా తరుచు పిచ్చిలోకి దిగి—మనశ్శాంతిని చెడగొడ్తుంది. తక్కినవాళ్లమో స్తరు పుట్టివుంటే, మనము ఏ బి.య్యే ప్యాసయ్యో, ఏ ఆఫీసులో గుమాస్తాగానో, ఏస్కూల్లో మాష్టరుగానో చేరి—ఏ యాభై అరవై విత్తులో తెచ్చుకొంటూ—పెళ్లామంటూ—పిల్లలంటూ—సంసారగొడవలో మునిగి వుండేవాళ్లం. మనం ప్రయోజకులమైనామని—మనవాళ్లూ—సంఘం—లోకం—అనుకుని మనల్ని కాస్త గౌరవంగా చూచేవాళ్లు. నా కవిత్వం—నీ యాక్టింగు—నా నాటకాలు—సత్యం పెయింటింగు—శాస్త్రికథలు—ఎవరికి కావాలి? దమ్మిడీకి గూడా టికాణాలేనివాళ్లంతా—జీవితంలో యింకెందుకూ పనికిరాకుండా—"ఇచ్ఛాజీవు"లంటూ ఓముఠాగా జేరి—ఆర్టు అంటూ, పొయిట్రీ అంటూ, స్టేజి అంటూ—కాలం వృథాపుచ్చుతున్నారు—అని అందరి అభిప్రాయమూను. మన ఆశలు—ఆశయాలు—సత్తా వాళ్ల కేమన్నా తెలుస్తేగా?...అందుకే చెప్తాను. మన కిల్లాంటి వున్నత ఊహల్ని కల్గించి—వాటి సాఫల్యానికి అనుగుణమైన అవకాశాలు యివ్వక—అందరి ఎత్తిపొడుపులకు గురిచేస్తూ—మనకు మనోవేదనా, అశాంతీ కల్గించడం—యిది, దేవుడు మనకు యీజన్మలో విధిస్తూన్న శిక్షకాదూ? పూర్వజన్మలో ఏదో పాపం చేసివుండబట్టి, యిప్పు డిల్లా యీస్థటిక్కువాళ్లంగా పుట్టి, పెనాల్టి చెల్లిస్తున్నాం...ఏమంటావు?... మాటాడవేం నీలం?...

[నీలాచలం నిదానించిచూచి ఊర్కొంటాడు.]

...ఎందుకు నీలం—యిల్లా మౌనముద్ర వహించావు. నీ నైజానికి భిన్నంగా ఎందు కిప్పుడు నిశ్శబ్దత ప్రదర్శిస్తున్నావు. నీకుగూడా నాకు కల్గినటువంటి అలోచనలే కలిగి మనస్సును కలవర పెడ్తూన్నాయా? మనమందరం అప్పుడప్పు డిల్లా ఫీల్ కావడం మామూలేగా?—ఇప్పుడు క్రొత్త ఏముంది? ఇంతకూ, ఎవరేమనుకున్నా, ఏంజరిగినా—మనకు పుట్టుకతో వచ్చిన యీ కళాఉత్సాహం, సాహితీరుచి—యివి ఎల్లాగా విడిచిపోవు. నిజమే, వాటికోసం కష్టాలుపడ్తూన్నాం...ఇంకా కొంతకాలం పడాలిసివుంటుం

దేమోకూడా. కాని, చూతాం...ఎన్నిటికేనా మనం నెగ్గలేకపోతామేమో. ఏదేశం యొక్క, ఏ యుగచరిత్రనైనా చూడు. మతంలోగాని, సంఘంలోగాని, సాహిత్యంలోగాని, కళలోగాని—నూతనమార్గాలు అవలంబించి—ఐహికజీవితపుదుమ్ములో మలీమసమైపోతూన్న—ఆ వివిధవిషయాలను మరమ్మతుచేసి—నవ్యభావోదయం కల్గించి—ధన్యులైంది—ఎప్పుడూ గుప్పెడుమందే! వాళ్లు అనేకకష్టాలు అనుభవించారు. తక్కిన వారి యద్దేవకు, హేళనకు గురియైనారు; సంఘంలో స్థానంలేకుండా పోయినారు; ధరించడానికి మంచి దుస్తులూ, ఆరగించడానికి విందులేకుండా యిబ్బందిపడ్డారు; జైళ్లకు వెళ్లారు; కొందరు కొన్నిసమయాల్లో ప్రాణాలనుగూడ త్యాగంచేశారు;—కాని తుదకందరు—చరిత్ర చూపుతున్నట్టుగా—మార్టియర్సుగా, వీరులుగా పరిగణింపబడ్డారు. అల్లాగే మనమూను. అసలు మనదేశమే అధోగతిలోవుంది. అందులోనూ మన తెనుగుగడ్డ—మరీ అధ్వాన్నంగావుంది. ఏ ఒక్కవిషయంలో మనం సజీవులంగా వున్నామో ఆలోచించు. ఇమిటేషన్‌తప్ప మన మింతవరకు చేసినెగ్గిన ఘనకార్యం లేదు. ఏయిద్దరు సత్తాగల ఆంధ్రులూ కలిసి హృదయపూర్వకంగా పనిజేసిన పాపాన పోలేదు. ఒక్కసారిగా ఆంధ్రదేశం ఆకాశమంత ఎత్తు లేవాలంటే ఎల్లాసాధ్యం? అంచేత నిస్పృహ చెంది ప్రయోజనంలేదు. ఎవళ్లకు తోచినట్లుగానే అనుకో, వాళ్లు సిన్సియర్‌గా పని చేస్తూంటే చాలు. అనేక నీటిబొట్లు కలిసి నదీప్రవాహమైనట్టు—పలువుర ప్రయత్నాలూచేరి నూతనశక్తివాహినిగా పరిణమిస్తాయి. ఆ దృఢనమ్మకమే, ఆ దృఢనిశ్చయమే మనకు హుషార్‌యివ్వనీ! మనమంతా కళాభాయీలం. రాజకీయాలతో, మతైకవిషయాలతో, సాంఘికసమస్యలతో—అంతగా మనకి జోక్యంలేదు. చిత్రకళ—స్టేజి—సాహిత్యం—యీ త్రిశూలమే మనకు సుదర్శనచక్రం. వీటి దోహదంతోనే మన ఆశాలతలు వికసించి, విలసిల్లుతై. వీటిద్వారానే మనం దేశానికి ఎంత సేవైనా చేయవచ్చును. "కెల్టిక్ ట్వైలైట్" వెలుగుతో, యీట్సు, ఎ.యి., లేడీ గ్రెగరీ, లార్డు డన్సనీ మొదలైన ఐరిషు కళాకోవిదులు వాళ్ల దేశానికి ఏంచేయగల్గిందీ మనకు తెలుసుగా!......కాబట్టి మనం దిగులుచెందాలిసిన పనిలేదు. ఏమంటావ్, నీలం?

[నీలాచలం, చేతులోవున్న "పరంజ్యోతి"ని ప్రక్కగాబెట్టి—వూరొ్కంటాడు.]

ఏమిటి, నీలం—యిట్లా వున్నావు—యీాదినం. విషయమేమిటో చెప్పు. చేతనైతే సాయపడ్తాను. ఇందాకటినుంచీ వాగేస్తున్నాను—విరామం లేకుండా. ఎరుగున్నావుగా నాధోరణి...నీమనస్సునేం కలవరపెట్టలేదుగద, నేను?

[ఇంతలో లోపల్నుంచి నౌకరు వచ్చి, తెచ్చిన రెండు టీ కప్పులు యిద్దరి ముందూ పెట్టి నిష్క్రమిస్తాడు.]

సమయానికి అందుకుందిలే—టీ! చిచ్చు బుడ్డిలాగు విజృంభిస్తోంది నా ఉత్సాహం. టీ సేవించేందుకు సిసలైన సమయం యిదీ! నీ దగ్గరకొస్తే టీకి లోపం వుండదుగా ఎప్పుడూ. అయ్ భాయ్! టీలోవుండే మజా, యిన్స్పిరేషన్—చెప్పడ మెల్లా, నీలం? విన్నావూ, వెనకటికి కన్‌ఫ్యూషియస్ అన్నాట్ట, "నీతో కజ్జా ఆడ్డానికి ఎవరైనా వస్తే, ఓ కప్పు టీ యివ్వు, చాలు" అని. అంటే దాంతో ఆ వచ్చినవాడు శీతలించి పోతాడని గాదు; ఆ టీ జనితేన్స్పిరేషనులో, నూతనోత్సాహంలో ఆగ్రహం మరచిపోతాడని. మరచిపోయినా, అసలు చైనా నుంచేగా ప్రథమంలో టీ బయల్దేరింది. మనవాళ్ల కింకా టీ తథాకా పూర్తిగా బోధపడలేదు. మనబోంట్లు ఏ కొద్దిమందో తప్ప—టీకి ఆట్టే మంది రాజపోషకులు లేరు. (టీ త్రాగుతూ)...అప్పుడే వేడి తగ్గుతోంది. నువ్వుగూడా తీసుకో, నీలం.

[నీలాచలం తన టీ కప్పును తీసుకొని త్రాగడం మొదలుపెడతాడు. తాను త్రాగడం-దాదాపు పూర్తి చేసి, కప్పు బల్లమీద పెడ్తూ శ్రీమాలి]

మైగాడ్! ఖుషీ అయినాడోయ్ ఆత్మారాముడు! (పక్క-బల్లమీద విప్పి పడివున్న చీరెల్ని చూస్తూ) మరిచిపోయినా, నీలం, మన మామూలు ధోరణిలోపడి అసలు వచ్చిన పని మరిచిపోయినా. చూడు—యీ చీరెల్లో ఏది బావుందంటావు. తుద కెట్లాగో చిన్నీ యిష్టమొచ్చినట్లే అనుకో... కాని, చిన్నీ టేస్ట్ నీక్కూడా బాగా తెలుసు కాబట్టి అడుగుతున్నాను. ఊఁ. ఏది నచ్చిం దంటావు? ఊఁ!

[నీలాచలం టీ పూర్తిచేసి, చీరెలవంక ఓమారుచూచి, మాట్లాడడు.]

నీలం— ఏం, యివ్వాళ మూగనోమా ఏమిటి, కొంపదీసి. వ్రతభంగానికి నేనే కారణమని తిడ్తావు తర్వాత. ముందేచెప్పు, ఎందుకొచ్చింది. ఇంతకూ, యిది చిన్నీకి సంబంధించిన విషయం కాబట్టి,—చిన్నీ అంటే నాకున్నంత అభిమానం, ఆపేక్షా— నీకూ వున్నది కాబట్టి— సలహా అడుగుతున్నాను.

[ఏదో మాట్లాడడానికి సిద్ధపడ్డట్టుగా, పెదిమెలు కదిపి, ఏమీ ఉచ్చరించకుండా ఊర్కుంటాడు —నీలాచలం.]

ఏం, నీలం? మాట్లాడ దల్చుకోలేదా యేం? ఏదో ప్రయత్నించి కూడా విరమించావేం? (కోపంతో) అవున్లే, ఈ విషయంలో—చిన్నీవిషయంలో—నువ్వు మాట్లాడకుండావుండడమే మంచిది. చిన్నీసంగతుల్లో కల్పించుకోడానికి అసలు నీకేం

అర్హత, అధికారం వున్నాయి. ఆ విషయం యిప్పుడు నీఅంతటట నువ్వే గ్రహించిన ట్టున్నావు. బ్రతికిపోయినావు...(కొంచెం ఆగి) ఆఁ...యిప్పుడంతా బోధపడ్డదిలే... మాటాడ్డానికి వెరపుచూపుతూన్న నీపెదవుల్లోనుంచి, నావంక నిదానించి చూడ్డానికి జంకుతూన్న నీ కళ్లల్లోంచి, నీ హృదయం నాకు గోచరిస్తోందిలే...(కొంచెం ఆగి)ఆఁ .. నీ రహస్యం యిప్పుడు స్పష్టమైంది నాకు...నాచేతులో చీరెల్నిచూచి—చిన్నీవిషయం మాట్లాడ్డానికి వచ్చానుగదా అని గ్రహించి—దొంగను తేలు కుట్టినట్లుగా—తప్పును కప్పి పుచ్చచూస్తున్న పసిపిల్లాడిలాగ—నువ్వు యిన్నాళ్లనుంచీ చేస్తూన్న బద్మాషీకి—నిశ్శబ్దత తప్ప వేరేమార్గం లేదన్నట్టుగా ప్రవర్తిస్తున్నావా?...

[ఆ వాక్యాల వాడికి కొంచెం బెదురుతాడు, నీలాచలం.]

...ఎందుకూ—బెదురునటిస్తావ్...ఇన్నాళ్లనుంచీలేని నదురూ బెదురూ—యిప్పుడు నేను అంటూన్న మాటలతో కలుగుతోందా యేం?.. ఏ జంకూ లేకుండా ఏమని ఉపక్రమించావ్—మొదలు?...నీకు నే చేసిన మేలుకి యీవిధంగానా ప్రత్యుపకారం చేస్తావ్? కల్లకపటాలులేని వ్యక్తివనికాదూ విశ్వసించాను నిన్ను? ఈ విధమైన త్రాచుపామువని తెలిస్తే దగ్గరకు వచ్చేవాణ్ణా, నిన్ను నాదగ్గరకు చేరనిచ్చేవాణ్ణా? నిన్ను చూసిన మొదటిమారే—ఎందుకో నామనస్సు నీవైపు మరలింది. అభిప్రాయాలు, ఆశయాలు వున్నవాడవనీ, స్టేజివిషయంలో మంచి అనుభవంకలవాడవనీ, అన్నిటికన్నా –నిష్కల్మషహృదయుడవనీ గాదూ—గ్రహించి నిన్ను మా "ఇచ్ఛాజీవుల" బృందం లోకి జేర్పించాను. నా కవిత్వంగోలలో నేనుంటూంటే—చిన్నీ అప్పుడప్పుడు వొంటరిగా బెంగపడ్తోందనీ—అదీగాక నాటకాల్లో స్త్రీపాత్ర ధరించి వన్నెకెక్కాలనే వాంఛ చిన్నీకూడా వుండబట్టీ—ఆవిడ అభిలాషకు చేయూత యిచ్చి, చక్కని దోహదం చెయ్యగలవాడవు నువ్వేననిగాదూ నమ్మి—నిన్ను తీసుకెళ్లి, చిన్నీకి పరిచయంజేశాను? ఆరాత్రే అన్నది చిన్నీ నాతో:—"మీ నీలాచలం నా కంతగా నచ్చలేదు. అతని చూపుల్లో ఏదో దోషముంది. మనకు లాభికీ ఐనవాడుగా తోచడంలేదు"—అని. ఆ సంశయం నిజమైనది కాదనీ, తప్పకుండా ఆవిడె నీదగ్గరే శిష్యత్వంచేసి స్టేజివిషయాలు నేర్చుకోవాలనీ వొత్తిడిజేస్తేగాదూ, చిన్నీ సమ్మతించింది—నీ మొహం చూడ్డానికి? ఏడ్నర్థంనుంచీ చెలిమిచేస్తున్నవాణ్ణి—నాకు తెలుసు—చిన్నీ హృదయం ఎలాంటిదో? ఆరునెలలైందో లేదో—పరిచయం ప్రారంభమై—నేనిచ్చిన అలుసు పురస్కరించుకొని—చిన్నీమీద చెయ్యి వేయబోయినావ్? చిన్నీని కలుసుకొన్నప్పుడల్లా కళ్లతో వైర్‌లెస్ సందేశా లంపుతావ్?...ఏమని ధైర్యం? చిన్నీతత్త్వం ఏం బోధపడ్డదని ఆ సాహసానికి ఉపక్రమించావు?...చిన్నీ రెండేండ్లయిందనుకో భర్తను విడిచేసి...

అయితే మాత్రం?—అల్లరిచిల్లరగా తిరిగే అవ్యక్తురా లనుకున్నావా? అలాంటిదే అయితే—యీపాటికి ఆవిడెకున్న అందంతో—ఏ జమీందారునో, మహారాజునో అర చేతిలో చిక్కించుకొని—ఓ వెలుగు వెలుగుతూండేదే! సత్యానికి నిలబడేవ్యక్తి కాబట్టీ—తలిదండ్రులు అజ్ఞానిగావున్న చిన్నప్పుడు—అంటకట్టిన భర్తని కొన్ని కారణాల వల్ల ప్రేమించలేదు...అక్కడికీ—తన ధర్మంప్రకారం—ఓ ఏడాది భర్తదగ్గర వుండి చూచింది. పొసగలేదు. అసలు—తత్వాల్లోనే తారతమ్యం వున్నప్పుడు—ఎల్లా అతుకు తుందీ?—అంచేత—భర్తచాటునుండి—అల్లరికి దిగేమనిషి కాదుకాబట్టి—విడిచి వచ్చేసింది!...(తీవ్రంగా చూస్తూ)...ఎందు కల్లా వాడిగాచూస్తావ్. నేనేం బెదురుతా ననుకొన్నావా?...చిన్నీ నాకెట్లా లభించిందనా ప్రశ్నిస్తున్నావ్? ..నాకేం వెరపులేదు చెప్పడానికి...అయినా, అది మా యిద్దరికీ సంబంధించిన విషయం. నీవు తెల్సుకోవల సిన పనిలేదు. ఆవిడెకు నేను నచ్చాను;—నాకు ఆవిడె నచ్చింది. మా ఐక్యానికి ఆటంకమేమీ లేకపోయింది...వెనుకాముందూ ఆలోచించుకునే స్నేహితులమైనాం. ఒకర్నొకరం బాగా అర్థంచేసుకున్నాం...మధ్య నువ్వు వచ్చి అంతరాయం కల్గించాలని మాత్రం ప్రయత్నిస్తే నెగ్గగల వనుకున్నావా? ఈ ఆరునెల్లనుంచీ నువ్వు వేసిన ఎత్తులు, చేసిన చర్యలు—అన్నీ నాకు తెలుసు. అయినప్పటికీ విశాలహృదయుణ్ణి, చిన్నీ స్థాయి తెలిసినవాణ్ణీ—గనుక, నిర్లక్ష్యంగా వూరొక్కన్నాను. నేనేమో తెలిసికోలేను—తెలిసి కొన్నా పర్వాలేదు—అనేదిలాసాతో కాదూ—తప్పడడుగు లేశావు...ఆనాడు చిన్నీని సినీమాకు తీసికెళ్లి, "లవ్ పారేడ్" ఫిలింలో, జానెటీ, షెవలీరు ముద్దెట్టు కుంటూం డడం చూపి—ఏమిటి కూశావ్? జ్ఞాపకముందా? తర్వాత—నేను మెద్రాసు మా వాళ్లయింట్లో పెళ్లికెళ్లినప్పుడు, చిన్నీకి తోడుగా వుంటూ, ఓనాడు సాయంకాలం యిన్నిపువ్వులూ, సెంటూ పట్టుకెళ్లి చిన్నీకి యిచ్చి ఏవిధంగా ప్రవర్తించబోయినావో మరిచావా...మరోసారి—నేను జడ్జిగారింటికి టీపార్టీకి వెళ్లినప్పుడు, తలనొప్పితో బాధపడ్తూన్నట్టుగా నటించి చిన్నీచేత అమృతాంజనం రాయించుకొంటూ, దొంగతనంగా ముద్దెట్టుకోబోయినావ్—జ్ఞప్తివుందా? ఇంకా ఎన్నో. ఆఁ. మరిచిపోయినా. ఓనాడు సాయంత్రం, కాగితంమీద ప్రేమగీతాలు వ్రాసి, క్రింద "—ప్రేమతో, నీలం,"—అని దస్కతుచేసి, ఆ కాగితాన్ని, చిన్నీ అల్లుకునే క్రోషీదారం పెట్టెలో పెట్టావుకాదూ? ఇవికావూ గీతాలు: (చదువుతాడు.)

౧

ఒక తరంగము...

వెంటనే—వెనువెంటనే

ర౫౫

ఉ ద యి ని

మరి ఒక తరంగము.

...చకచకా
తరముకొని, తీరాన్ని
ఒరుసుకుంటూ
క్రిక్కిరిసిపోతూ...

  చిరుపొరల
  నురుగులో
  కరగి, వెను
  దిరిగిపోతూ...

నీలాల గగనాన
పోలిపోయిన తళుకు
తేలిరాగా...

  మలుసంజచాయలో
  తెలివెన్నెలల తేట
  లాలికిపోగా...

సరిఖ కొలుకుల జరీపయ్యెద
సరిగా దిద్ది తీర్చుకొని జక్కవకవ
విరహానికి ఎదురు ఈతగా
ఒకటే త్రోతగా...

  వలచినా,
  నిలువమని
  పిలచినా
  హోరు—హోరులో
  పారమే కనరాని
  వారాన్నిధి పాలి
  మేర దరియజేరే
  కూరిమితో...
  నుదులమీదుగా
  తడబడి—సడలని వడలో,
  విడువని తమితో...
  పరవళ్లు పోయినా,
  పరుగూన సాగినా...

ఆద్యంతాలు

నదీ మదవతీ !
వృథా...
ఈ గమనాయాసమంత
వృథాయేనటమ్మా ?..

2

కోఁ...
కోయని—
ఒక కోయిల కోయని
కూసిన
కేత—కూతకు
ఒక వనలో—
పసరు పూప పూమొనలో

3

వెన్నెల—
వెలవిరిసిన తెలివెన్నెల—
వెన్నెలకేల
వలపు లలముకొనగా...
వెన్నెల—
నెలవుల మెలి దిరిగిన
లలిత లతా లతాంత సౌరః
—మధుమాసాలం...
మదనుని చిగురు బాకు మొః
పదునులు
కలసి మెలసి వెలయగా..
నిలువలేని తమకముతో—
చెలువుని
మధు వానిన
ఒక గడుసరి తుమ్మెద
మోతకు...
అరవిరిసిన
విరిచేడియ లం
దరి దరహాసానికి...

రంజ

వెన్నెలలో—
నెలమేనల్లుని
విలుతరితీపులం—

విరహాన్ని
సరాసరి
మరీ రెచ్చగొట్టడానికి—
ఏమిటి...ఈ...సంబంధం?

చెలిమికి
కలువరించు...జవరాలు!...

ఈ మూడుగీతికలుకదూ కానుకగా అర్పించావు? మహాచక్కనివి కాబట్టి—ఆ కాగితాన్ని నాడైరీలో దాచివుంచాను. అప్పుడప్పుడు చదువుతూండడంచేత—కంఠస్థమైనై. (నిదానించి చూచి) కులకబోక—ఆ కాంప్లిమెంటు నీకేనని...నాకు తెల్సులే—నువ్వు గీతాలుగాని, పద్యాలుగాని వ్రాయలేవని. అవి శాస్త్రి సర్దార్ వ్రాసినవి...ధోరణే తెల్పుతుంది. అతనికి తెలీకుండానో, లేక పీడించో, భుక్తంచేసుకొని వుంటావు. ధైర్యంగా చిన్నికి దానంచేశావు...ఆనాడే చిన్ని నాకీకాగితాన్ని నవ్వుకొంటూ అందిచ్చింది. నాకేం ఒక్కటీ తెలీదనుకొన్నావా? ఎప్పటికప్పుడే అన్నీ చెప్పేసేది చిన్ని—నాతో. అనేకసార్లు, నిన్ను తన్ని, వాకిట్లోకి తగిలేద్దా మనుకొందిట. కాని జాలితోనూ, నే నేమన్నా నొచ్చుకుంటానేమోననీ, బయటకి తెలిస్తే నిన్నందరూ అసహ్యించుకుంటారనీ—ఊర్కొందిట. చిన్నియొక్క మంచి తెలిసికొని, నువ్వే బుద్ధిమార్చుకొని సరిగావుంటావని నేనూ వూర్కొన్నాను. ఇప్పుడేనా ఏమీ అనవలసినవాణ్ణికాదు. అప్రయత్నంగా ధోరణి అల్లాపోయింది. (కొంచెం జోరు తగ్గించి) ఇంకా ఎందుకూ తీవ్రంగా చూస్తావు. నిన్నేమన్నా చేస్తా ననుకున్నావా? నువ్వు ప్రవర్తించినట్టుగా మరొకరేగనుక ప్రవర్తించివున్నట్టయితే—యీపాటికి ఏ ఓఘాయిత్యమో చేసివుండేవాణ్ణి. నిన్ను ఏంచెయ్యడానికీ, ఏమనడానికీగూడా నాకు మనసొప్పడంలేదు. నిన్నుచూస్తే జాలిమాత్రమే కలుగుతోంది నాకు. ఈస్థితిక్కమనిషివికాబట్టి ప్రేమకోసం ఎలా తహతహ పడివుంటావో నాకు తెల్సు. నేనూ ఆఅవస్థ అనుభవించినవాణ్ణే. నువ్వట్లా నాయికకోసం ప్రయత్నించడంలో తప్పులేదు. కాని, చిన్ని చీరెచెంగు పట్టుకుందామని ప్రాకులాడ్డంమాత్రం మనబోటివాళ్లకు తగినపనికాదు. చిన్ని నీకు కావాలని హృదయపూర్వకంగా నువ్వు అభిప్రాయపడ్డట్టయితే, నీప్రేమేగనుక యథార్థమైనదైతే, ఏంచేసివుంటే బాగుండేదంటే,—నాదగ్గర కొచ్చి—ధైర్యంతో, "ఇదిగో, భాయీ, ఇంతవరకూ చిన్ని నీది. నిజమే. కాని ఆవిడ నాకుకావాలని కోర్కెపుట్టింది, సీదామనిషిని కాబట్టి చెప్తున్నాను—మర్మంలేకుండా. చిన్నిని అడుగు. ఆవిడెకు నేను నచ్చితే—

నాకిచ్చెయ్. లేక, ఆవిడెకు నాయందు యిష్టంలేకపోతే—సరే—మీరిద్దరూ యథాప్రకారం వుండండి. ఇక ఆవైపు నాఆలోచన్లు పోనీను.”—అని చెప్పాలిసింది. అట్లా అన్నావని నాకు కోపంవచ్చేదికాదు. నీ సరసత్వానికి ఎంతో మెచ్చుకొనేవాణ్ణి...ఆవెంటనే చిన్నీని అడిగేవాణ్ణి...ఆవిడె గనుక నీనేస్తానికి వొప్పుకొని—నాకుబదులుగా, తనప్రేమను నీకివ్వ డానికి సిద్ధపడ్తే—హృదయపూర్వకంగా చిన్నీని నీకు అర్పించి—మీయిద్దరి సౌఖ్యానికి నాచేతనైనట్టుగా తోడ్పడేవాణ్ణి...బర్ట్రాండురసల్ యీఅభిప్రాయాలను యిప్పుడిప్పుడు వెల్లడించాడు గాని, అవి నాకిదివరకే వున్నాయి. ఎంచేతా—ప్రేమఅంటే పవిత్రమైనది గనుక. అన్ని పవిత్రవిషయాల్లోనూ వక్రత్వానికీ, మోసానికీ ఎల్లా తావులేదో, అల్లాగే ప్రేమలోనూ. ప్రేమ హృదయాలకు సంబంధించిందిగాని శరీరాలకుమాత్రమే సంబంధించిందికాదు. అదే ప్రేమకూ వ్యభిచారానికీ భేదం. అందులోనూ, మనమోస్తరు రసపిపాసులు యిల్లాంటివాటిల్లో బోల్తాపడి మామూలు మనుష్యులమోస్తరు కాకూడదు. అంచేతే, నీవు చేసిందానికి నాకు కోపంలేదు...యథాలాపాన తప్పటడుగు లేశావు... నువ్వంటే ఎందుకో నాకు ఆపేక్ష కుదిరింది కాబట్టీ—చప్పున అర్థంచేసికోగలవాడవు కాబట్టీ—యింతగా చెప్తున్నాను. నిన్ను భయపెట్టి భగ్నమనోరథుణ్ణిగా చేయడానికి సంకల్పించుకొన్నానని అనుకోకు. (ఆప్యాయంగా) చాలించు, మరి, ఆవిధంగా ముఖం వ్రేలాడవేయడం...రా, నాతో...చిన్నీ చీరెలకోసం వాకిలికాస్తూంటుంది. సెలెక్షనులో సహాయపడుదువుగాని...చిన్నీ ఏమన్నా అంటుందని భయపడకు. చిన్నీహృదయంగూడా నాదానిమోస్తరే. వేరువిధమైతే నీకిదివరకే అంపకాలు యిచ్చేది...లే. పోదాం. ఏమీ జరుగనట్టుగానే నడుచుకొందాం?...నేస్తం విడగొట్టుకుందామని యోచించకు. నాకూ చిన్నీకి తగిన ఫ్రెండువి దొరికావు అని సంతోషిస్తున్నాను. నిష్కపటుణ్ణి గాబట్టి నాహృదయాన్ని విప్పిచూపించాను. అర్థంచేసుకో...రా, వెడదాం...నువ్వొక్కనాడు కనపడకపోయినా, ఎట్లాగో వుంటుంది నామనస్సు. చిన్నీగూడా అంటుంది—“చూశారా, నీలం రానేలేదు యీసాయంత్రం, టీకి. ఇల్లంతా చిన్నబోయింది—”అని. నీలం...ఎందు కింకా మూగతనం...వేషంతోనే వున్నావు. బయల్దేరు.

[నీలాచలం మెల్లగాలేచి,—గొప్ప నూతనానుభవం జనింపజేసేకాంతి ముఖాన ప్రకాశిస్తూండగా,—లాల్చీ, పైజామా మడతలు సరిచేసుకొని,—బయల్దేరడానికి సిద్ధమౌతాడు. అతని బుజంమీద చేత్తో చరుస్తూ శ్రీమాలి]

గుడ్‌బాయ్, నీసంగతి నాకు తెలుసుగా, నీలం...జీవితంలో ఎవరికైనా వస్తాయి ఉపద్రవమైన ఘట్టాలు. హీరోలాగ ఎదుర్కొని, రైటుమార్గమేదో తెలుసుకోవాలిగాని, ...మూగనోముపట్టి, పాత “పరంజ్యోతి” పత్రికలు తిరగవేస్తే, సమస్యాపరిష్కార

మాతుందా—సరదా వస్తుందా...నడు...అవిగో—ఆచీరెలు పుచ్చుకో...నువ్వు మోను కొచ్చావని తెలిసి చిన్నీ సంబరపడ్తుంది. ఇప్పటినుంచీ నూతన అధ్యాయం గాదూ? ఆద్యంతాల ఏకరువుతో—వెనుకటి ఘట్టం సమాప్తిఅయిందిగా, నీలం?

['తథాస్తు' అనేసూచకంగా తలత్రిప్పుతూ నీలాచలం చీరలు పుచ్చుకుంటాడు. ఇద్దరూ నడచి పోతారు.]

చేయూత

ఎవరు కావించిన రచనలకు వారే భాష్యంగూడా వ్రాయడం అట్టే సమంజసమైన పనిగాదు. ఆర్టిస్టిక్ నిబంధన లంతగా, అల్లాంటికృషిని ఆమోదించవు.

"యే నామ కేచి దిహ నః ప్రథయం త్యవజ్ఞాం
జానన్తి తే కిమపి తాన్ ప్రతి నైష యత్నః
ఉత్పత్స్యతే ఽస్తి మమ కోఽపి సమానధర్మా
కాలోహ్యాయం నిరవధి ర్విపులాచ పృథ్వీ"

అన్న భవభూతి ధిక్కరణను ప్రకటించే రచయితలను గౌరవించదు పాఠకలోకం. తనవ్రాతలు అందరికీ ఏకమొత్తరుగా గాహ్యమౌతాయని ఏరచయితా అభయహస్త మియ్యడు. వ్యాఖ్యాన, దూషణ, భూషణ—అన్నీ చదివేవారివంతు. తన వ్రాతలను సమర్థిస్తూ గాని, మెచ్చుకొంటూ గాని, ఏవ్రాతగాడైనా చేయూత యిస్తే తను "తుమ్మి చిరంజీవ" అని తానే అనుకొన్న ట్లుంటుంది. బర్నార్డుషా చేసినా అంతే!

ఈలోపమే నేను చేయబోతున్నట్లుగా కన్పడుతుంది. అయినప్పటికీ-నిర్మొహమాటంగా మొదలెట్టాను.

ఎంచేతా?—అంటే:

నాయీ పైరచన కథో, కథానకమో, నాటకమో, నాటికో, సంభాషణో—అనే సంశయం చదివే వారిలో కొంతమందికి కలుగవచ్చు. స్ట్రిండ్ బర్గు, మేటరులింకు మొదలైనవారి కల్పనలతో పరిచయమున్న వారికి "ఆద్యంతాల"ధోరణి నూత్నంగా గాని, వికృతంగా గాని తోచదు. ఇక—తక్కినవారికోసం చెప్పేదేమంటే?—

మొహమాటంచేత, మర్యాదకోసం—గాక, నియమాలను అనుసరించే—"ఆద్యంతాలు"—నాటక-చిన్ననాటక—రకంలో చేరింది. అసలు రంగంమీద అగుపడేదే యిద్దరువ్యక్తులు. అందులోను ఒకరికి ఓమాటగూడా ఉచ్చరించాలిసిన బాధ్యత లేదు...మిగిలిన ఒకరే—అంతసేపూ గొంతు బాధ కల్గేట్టుగా మాట్లాడాలి. గదిలో కూర్చొని చెప్పుకుంటున్న స్వగతమో,—ప్లాటుఫారం యెక్కి యిస్తున్న ఉపన్యాసమో—అనిపించడంలో అసంభవ మేమీ లేదు. కాని, నిదానించి చూస్తే నిజం తెలుస్తుంది. పాత్ర వొక్కటే అయి నప్పటికీ, ఆతను ముగ్గురు (తాను, చిన్నీ, నీలాచలం) వ్యక్తులహృదయ రహస్యాలను, జీవితాలను వెల్లడిస్తాడు. నీలాచలం—తనమౌనంతోనూ, సంజ్ఞలతోనూ—శ్రీమాలికి తోడ్పడతాడు. ఈముగ్గురియొక్క భావాలే కాకుండా, వాళ్ల "ఇచ్ఛాజీవుల" బృందం ఎందుకు ఏర్పడ్డదో,—ఏం ఆదర్శాలు, ఉద్దేశ్యాలు కలదో,—

ఆద్యంతాలు

లలితకళల సహాయంతో తమ రాష్ట్రానికీ తన్మూలంగా దేశానికీ, ఎలాంటిసేవ చేయ సంకల్పించిందో,— వాళ్లది ఎలాంటి అకుంఠితదీక్షో,—కాలాన్ని అనుసరించి నూతనభావాలను ఎల్లా యినుమడించుకోవాలో,— ప్రేమ ఎలాంటి పవిత్రమైనదో,—విశృంఖలత్వమంటే విచ్చలవిడి ఎలా కాదో,—ప్రేమవంటివిషయంలో గూడా సహనం, సౌశీల్యం, నిర్మోహమాటం, నీతి ఎలా అవసరమో,—ఈస్థటిక్ టెంపరమెంటు పుట్టుకతోనే అలవడ్డవారి అభిప్రాయాలు, వాటి ఆచరణ ఎలా వుంటాయో, వాటిసాఫల్యంకోసం ఎంత కష్టపడాలో,—మొదలైనవిషయాలన్నీ శ్రీమాలిద్వారా వ్యక్తమౌతాయి.

తనద్వారా కొంతప్రతిపత్తిని, ఉపకారాన్ని పొంది, తనప్రియురాలివిషయంలో తననే మోసగిస్తున్న వాని ఎదుట నిలబడి, శాంతంగా మాట్లాడుతూ "పరస్య న పరస్యేతి మమేతి న మమేతిచ, తదాస్వాదే విభావాదేః పరిచ్ఛేదో న విద్యతే"—అన్న "సాహిత్యదర్పణ" కారుని సూత్రానికి హద్దులు విశదీకరించడం ఎవరికేనా సాధ్యమా?...ఎందుకు కాదూ? శ్రీమాలి చూపలేదూ సాధ్యమని? ఒథెల్లోమోస్తరు ఉడికిపోయి డెస్డిమోనావంటి నిరపరాధిని హత్యచేయుడానికి అందరూ సిద్ధపడ్తారు. శ్రీమాలి నిరూపించేది వేరు. అది ఉత్తమమైనదో కాదో—ఊహచెయ్యవలసింది మీరు. "అచ్చపుబుద్ధికి లే వగమ్యముల్" అనేరకంలో చేరినవాడు శ్రీమాలి.

తర్వాత: కళఅంటూ, కవిత్వమంటూ, నాటకాలంటూ దేవుళ్లాడుతారే చాలామంది—దానివల్ల ఏమైనా, ఎవరికైనా ప్రయోజన ముందా?—లేక ఊసుపోక చేసే అవకతవకపనులా? ఎట్లా అనుకుంటే అట్లాగు. బంగారం స్వతస్సిద్ధమైన విలువగలది. కాని సరియైనపనికి ఉపయోగించకపోతే రాణించదు. అల్లాగే యీలలితకళలూను. కాలపారంపర్యంగావున్న అవకాశాలివి. ఎన్నడో, పూర్వంలో, వాటివిలువ పూర్తిగా గ్రహింపబడ్డది....అల్లాగే అవి వినియోగింపబడినై గూడాను....ఇటీవల—అవి కేవలం వ్యాపారసరళిలోకి దిగిపోయినై. నాటకం ప్రదర్శిస్తే—ఎంత రాబడి వుంటుందని ప్రశ్న;—చిత్తరువు గీస్తే—ఎవరు ఎంతకు కొంటారని; పద్యంగాని, కథగాని వ్రాస్తే—ఏపత్రిక ఎంత యిస్తుందని;—లేకపోతే ఏవిశ్వదాత అంకితమందుకొని ఎంత యిస్తాడని;—యిదీ ప్రస్తుతధోరణి. రూపాయి—అణాల—పైసల వాతావరణంలో మునిగి తేలుతూన్న ఆధునికయుగధర్మమేగూడా యిందుకు కొంత కారణం. కాని అసలుఆదర్శం ఎందుకు మరుగుపడిపోవాలీ? ఈలలితకళలు—కేవల ధనార్జనకుతప్ప—మరెందుకూ మార్గాలు కావూ? ఆత్మోన్నతి—ఆత్మోపలబ్ధి—మాట అటుంచి, వాటిమూలంగా సంఘానికి, దేశానికి సేవచేసేందుకు వీల్లేదూ? ఎందుకు లేదూ? ఉందని చెప్పడంలేదూ—శ్రీమాలి? జీర్ణించి భిత్తికలు రాలుస్తున్న దేశాన్ని పునరుద్ధరింపవచ్చు....పూర్వంలో గ్రీకులు, రోమనులు చేయలా అలాగ? ఐరిషు రసజ్ఞులు చూపలా యీయుగంలో అలా చేయడానికి వీలున్నదని? మనం మాత్రం...? అలాంటి ఆదర్శాలు అర్థంచేసుకొన్నవాళ్లం—గుప్పెడు మందిమే ననుకోండి. అయితేమాత్రం? శ్రీమాలిఉత్సాహం మన ల్నెందుకు ఆవేశించి, కార్యసాధనకు పురిగొల్పకూడదూ? "దృఢమనస్కుడవై యతించిన, సడలిపోదా దాస్యబంధము?—వీడిపోదా నిద్రమాంద్యము?"—అని గాదూ ఓ కవికుమారుడు అన్నాడు...

ఇదంతా "ఆద్యంతాల"లో వున్నదని—నే ననుకుంటున్నాను...ఇది మనస్సులో వుంచుకు చదివితే బాగుంటుందని నావుద్దేశ్యం. అందుకూ యీచేయూత!

—వెం.నా.

నాటకములు, నాటకకళ

— పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, ఎమ్.ఏ., పిహెచ్.డి. —

విజ్ఞానవిభాగములన్నిటికంటెను నాటకకళయే మానవుని మనోభావములను జీవితమును విశదముగ తెలియజేయగల సాధనము. అనగా సారస్వతప్రపంచమున నాటకకళయే సమగ్రత నొంది, మానవదృష్టియం దెల్లప్పుడును కేంద్రస్థానమును వహించియున్నదని యర్థము గాదు. ఆధునికయుగము నాటకయుగమని వక్కాణింప సాధ్యము గాదు. ఇది నవలాయుగమని చెప్పినను చెప్పవచ్చునేమో. తత్త్వవిమర్శకులును, వ్యాపారైకపరులునుగూడ నవలారూపముగ తమ యభిప్రాయములను వెల్లడించుచున్నారు. తేనెలో పొరలించిన చేదుమాత్రలవలె ఎట్టి అనర్థాభిప్రాయములును, అవివేకపు అంశములును గూడ నవలారూపముననున్న జనాంగీకారమును బడయుచున్నవి.

కాని యొకనవల జనాదరము నెక్కువ పడసినదన్న వెంటనే దానిని నాటకరూపమునకు మార్చి ప్రదర్శింతురు. నవలారచనమునం దున్నతస్థానమును బొందినవారందరును నాటకములను వ్రాయ బ్రయత్నించి, నాటకకళయందుగూడ తమ సామర్థ్యమును జూప బ్రయత్నించుచున్నారు. సారస్వతవిభాగములందు ఏ విభాగము మానవజీవితమును, మానవాభిప్రాయములను ఎక్కువగ మార్పగలిగినదని పరీక్షించినచో, నాటకకళనే అట్టిదానినిగ పేర్కొనవలసియుండును.

ఇందునకు కారణము నాటకకళయొక్క విశిష్టధర్మమే. నాటకరచయితకన్న నవలాకారునికి సౌకర్యము మెండు. నవలాకారునికి విషయవర్గము (range of material) ఎక్కువ; విశేషాధికారములు (privileges) మెండు. పైగా నవలాకారునికి బాధ్యతలు కూడ చాలతక్కువ. అతని సృష్టియే అతనిని శృంఖలబద్ధునిగ జేయజాలదు. నాటకరచయితల కీ చిక్కులన్నియు గలవు. నవలలను బోలిన నాటకములు గూడ కొన్నిగలవు. కాని వాని ప్రాముఖ్యమునకు కారణము నవలానుకరణము గాదు. నాటకధర్మము నవలాధర్మమునకన్న మృగ్యముగ దోచుచున్నను దాని విశిష్టతయును, దాని అద్వితీయతయును (uniqueness) సూక్ష్మదృష్టికి గోచరింపకపోదు. మానవధర్మములను, మానవాదర్శములను నాటకరచయిత బోధింపగలిగినంత స్ఫుటముగను, సార్థకముగను (effectively), సఫలముగను, సూక్ష్మముగను (subtle) నవలాకారుడు బోధింపలేడు. నాట్యకళ కనుగుణములై నటువంటి సంగీతాది ఉపకరణములు నవలాకారునికి లేకపోవుటచేత, విషయ సాక్షాత్కారమునకును, అభిమతవస్తు పరిణతికిని (effect desired) నవలా

కారుని కపోలకల్పనమే సర్వాధారము. ఆవేగాతిశయముచే నలరారు ఎట్టి రసవంతమైన పద్యకావ్యమునకైనను నాటకమున కున్నంత భావబోధకశక్తి లేదు. నాటకము సర్వజనభోగసాధ్యము. మానవుని నిగూఢాంతరాత్మయందుకూడ నాటకము ఆందోళనము కలుగజేయ గలదు. కటికవాని హృదయమునుగూడ పరిస్పందనము నొందింపగలదు. మానవుని కళావిన్యాసమునందు సారస్వత ప్రథమసృష్టి నాటకరూపముగనే యుండియుండును. అనాగరకులనబడు మానవజాతులందెల్లను నేటికిని నాటకప్రాయమైన దృశ్యకావ్యమే సారస్వత ప్రయత్న పరమావధి. గ్రీసుదేశపు నాటకకళ వారల ఆద్యాచారకాండనుండి బయలుదేరిన దని మనకు తెలిసియేయున్నది.

నాటకకళయొక్క ప్రధానప్రయోజనము మానవునికి తాత్కాలిక సంతోషము నొనగూర్చుటయే యని స్థూలదృష్టికి గోచరింపవచ్చును. కాని క్రీడాలోలురకు ప్రొద్దుబుచ్చుమార్గము జూపుటయే నాటకకళయొక్క పరమావధియని తలచుటకన్న గొప్ప పొరపాటుండదు. నాటకలక్షణ మిదియేయైనచో నాటకరచయితకర్తవ్యమును నటుని కర్తవ్యమును అత్యంత సులభమని చెప్పవచ్చును. ఏలయన, ప్రేక్షకుల నేదోవిధముగ నుద్రేకింపజేసి, ఇంద్రియాకర్షకరములగు వాక్యములతోను చర్యలతోను వారల నాకర్షించినంతనే ఈ కర్తవ్యము నెఱవేరును. కాని ఇట్టి యనుభవమునందు ప్రేక్షకుడు దృశ్యవిషయమునందు మానసికముగ నైక్యముజెంద యత్నింపడు. అందునకు బదులు దృశ్యవిషయమును విమర్శించుచు, నిమిషనిమిషమునకును తన శక్తిసామర్థ్యములను పాత్రల శక్తిసామర్థ్యములతో పోల్చుకొనుచు, తన యాధిక్యమునకు తన్నే మెచ్చుకొనుచు తృప్తిపొందుచుండును.

సినిమాయందు చార్లీచాప్లిన్ (Charlie Chaplin) అసందర్భకార్యములను జూచునప్పుడును, నాయికానాయకుల దాంపత్య జీవనమునకు భంగకరమగు పరిస్థితుల నవలోకము చేయునప్పుడును, పాత్రలలో నొకరికొకరి కుండు విశేష సందర్భములను పరీక్షించుచున్నప్పుడును, సినిమా ఎంత ఉత్తమమైన దైనప్పటికిని మనము తన్మయత్వము జెందము. చార్లీచాప్లిన్ చేయునట్టి అసందర్భకార్యములను మన మెన్నటికిని చేయజాలమను దృఢవిశ్వాసముతో మనము వాని చర్యలను జూచి నవ్వుదుము. మన సుఖజీవనమునకు భంగకరమైన స్థితిగతులు సినిమాయందు జూపినట్లు మన కెప్పటికిని రాజాలవనియు, వచ్చినను మనము వానిని సామర్థ్యముతో నెదిర్చగలమను నమ్మకముతో పాత్రల చర్యలను ఖండించియు, ప్రశంసించియు మన సంతృప్తిని వెల్లడిచేతుము. ఇట్లు తాత్కాలిక సంతృప్తి నొందించుటయే సినిమాయొక్క పరమకర్తవ్యము.

సర్వోత్కృష్టమైన వివేకానుభవ ప్రదానమే నాటకముయొక్క ప్రథమ ప్రయోజనము. అవ్యక్తమైన పామరజన చిత్తక్షోభలను మనోభిప్రాయములను బాహ్యప్రపంచమునకు ప్రస్ఫుటపరచి, ఇంద్రియాతీతజన్యమగు మనఃశాంతిని చేకూర్చగల అమూల్యసాధనమే నాటకకళ. అనవగతముగ మనలను వేధించు అపరిశుద్ధభావములను అవగతములుగ జేసి, మనస్సునందలి అవ్యక్తమగు కిలతలను పోగొట్టగల శక్తి నాటక ప్రేక్షణానుభవమునకు గలదు. కాననే ఉత్కృష్టనాటక ప్రేక్షణమునందలి యనుభవము అప్రయత్నపూర్వకము, అబుద్ధిపూర్వకము. అరిషడ్వర్గములతోను, అజ్ఞానాంధకారముతోను పరివృతమై, క్షుభిత మనస్కమై స్వస్థచిత్తతలేని జనబాహుళ్యమునకు ఇట్టి అనుభవము అత్యావశ్యకము.

ఈఅనుభవము బాల్యావస్థయందలి ఆటపాటలతో సమముగ నెంచవచ్చును. కాని ఈ అనుభవమును పొందువారు బాలురవలె గాక అత్యధికముగ నియమనిబంధనలకు లోనైన వారు. కాన ఇట్టి అనుభవము వారియందు స్వచ్ఛందముగ సువ్యక్తమగుట దుస్సాధ్యము. బాలురనువలె చిన్నచిన్న యాటపాటలు వారల మనస్సుల నేవిధముగను జలింపజాలవు. కాని జీవితమునందలి అధికతరకష్టములను గాని దుఃఖములనుగాని వారు చూచినప్పుడు వారిట్టి యనుభవమును జెందుదురు. ఒకచిన్న యుదాహరణము ఈ యభిప్రాయమును సుబోధముగ జేయును. బంతియాట ఆడలేని బాలునికి బంతియాట చూడవలెనని గాని, చదువవలెనని గాని కుతూహల ముండునట్లు, ప్రపంచమున నాయకత్వమును బడయలేని మానవునికి ఒక నాయకుని గాంచినను, ధీరోదాత్తగుణనిధియగు పాత్రాభినయమును గాంచినను కొంత మనఃశాంతి యొడగూడును.

మానవునికి తన యభ్యుదయమునందు గల యావేదనయే మానవపరిణామ వికాసములకు మూలకారణము. ఈ యావేదన కొంచెముగనో గొప్పగనో యున్నంతకాలమును మానవుడు వీరత్వమును బొందలేకపోయినను వీరపూజ చేయుచునేయుండును. అట్టి వీరపూజ అనాగరకజాతులయందు బుద్ధిపూర్వకముగను మనఃపూర్వకముగను లజ్జాభయముల బాధలేకయును జరుగుచుండును. అనాగరక వీరపూజయందు ప్రతివాదును తంత్రమును నడిపింపగలిగినను తంత్రోపదేష్ట ఆ జాతి పురోహితుడు. ఆ తంత్రము వీరపూజకు ముఖ్యాంగము.

నాగరికత హెచ్చినకొలదిని మానవునికి పార్థక్యమును (individuality), వ్యక్తిత్వమును హెచ్చుచుండును. స్వాతంత్ర్యము హెచ్చినకొలదిని లజ్జాసంశయము లధికమగును. కాన మనోభావములు బహిఃప్రకటితములై మనఃశాంతిని పెంపొందించుటకు ఆస్పదము తక్కువయగును. కనుకనే నాగరకజాతుల వీరపూజయందు ప్రత్యేకతంత్రము నశించినది.

ముఖ్యాంగము మనసే. ఈ మానసికపూజ జరుపుటకు అనుగుణమగు పరిస్థితు లేర్పడినపు డెల్ల మానవుడు ఈ తుచ్ఛసుఖముల సమ్మర్దమునుండి, ఒక నిమేషమాత్ర కాలమైనను రచి, విశ్వమందు లీనమగును. ఇదియే నిజమైనపూజ, నిజమైనధ్యానము. విశ్వమునందును స్వతత్వమునందును ఒక త్రుటికాలమైనను మనసులను కేంద్రీకరింప జేయగలిగినదే నిజ)న నాటకము.

సినిమాకళకును నాటకకళకును గల ముఖ్యభేదమే ఇది. సినిమాకళ బహిఃప్రపంచ)నందలి భావములను మనోవీథియందు గోచరింపజేసి క్షణికతుష్టి నొనగూర్చును. నాటక ' అంతరాత్మ నవలేపనము చేసిన యజ్ఞానమును జ్ఞానదీపముచే కరగించి, అంతర్గతమైన న్భావములను బహిరంగము జేసి ఒక క్షణకాలమైనను ఈ విశ్వమాహాత్మ్యమును అభి ముగ జేయును. ఈ విభేదమువలననే సినిమానాటకముల పరస్పరసంబంధములు సాపత్న్య •వము లేక అన్యోన్యాభివృద్ధికరములైనవి. కావననే ఎన్ని క్రొత్తవిషయములను కనిపెట్టి)మాను ఉత్కృష్టస్థితికి గొనితెచ్చినను సినిమా నాటకమును మఱపింపజాలదు.

మిక్కీమౌస్ (Mickey-mouse) ఆటపాటలను జూచి ఆనందించినట్లు, ఉత్తరరామ రిత్రమును దర్శించి క్షణికముదము నొందగలమా? కింగ్ కాంగ్ (King Kong) ను •చియు నేటి పాశ్చాత్యులు సావధానచిత్తులై యుండునట్లు ఒథెలో (Othello) ను •ని, ఆస్ యు లైక్ ఇట్ (As you like it)ను గాని చూచి షేక్సుపియరు (Shakespeare) •టి ఇంగ్లీషువారు సంతుష్ట మనస్కులై ఇంటికి వెడలియుందురా? ఉత్కృష్ట నటశేఖ)ల కౌశల్యముననూ, ఇతర సహాయసంపత్తిచేతను రాణించు ఒథెలో (Othello) నాటక త్కృష్ట ప్రదర్శనమందు ప్రేక్షకులు తన్మయత్వమును చెందగలరు.

నాటికిని నేటికినిగూడ, ఇంగ్లండునందేకాదు, ప్రపంచసారస్వతమునం దంతటను నాటక ళ యొక్కటే ధర్మమున నొప్పియున్నది. ఈధర్మము నెడబాసినపుడెల్లను నాటకము కళా హీనమై అభివృద్ధి నొందక నశించినది. ప్రపంచనాటక కళాసంపదయం దేవిభాగమునందు శీలించినను ఔన్నత్యమును బడసిన నాటకములం దన్నిటియందును ఈ ధర్మ మగపడు)నేయుండును. ఏ గొప్పనాటకమును పఠించినను అది మన మనోభావములకును చిత్త వృత్తులకును అనువాదకరముగను, అంతరాత్మకే అనుపమానానుభవ ప్రదాయకముగను ండును. మానవావేదనను బహిర్గతము చేసి ఉపశాంతి నొందింపజాలినది నాటకకళయే; ాన ప్రతి ఉత్కృష్టనాటకమును మానవుని కష్టసుఖములను, కాలానుగుణముగ మారు పన్న మనోభావములను, ఉన్నతాదర్శములను ప్రకటించుచుండును. కనుకనే నాటకకళ సుద్దమువంటిది. కాలానుగుణముగ విశ్వవిచిత్రమునకు మానవు డొసంగు ప్రత్యుత్తరమే

నాటకరూపమున వెలువడుచున్నది. నాటకములనుండి ఆకాలపు మానవులకు విశ్వమును గూర్చి ఎట్టి యభిప్రాయములు గలవో వ్యక్తమగును.

నాటకరచయిత సంఘమునకు వదనము వంటివాడు. రచయిత కర్తవ్యమునుగూడ అనాగరికజాతులందు పురోహితుని కర్తవ్యమువంటిదే. కనుకనే జనానురాగము బడసిన నాటకమునందు విశదీకరించిన భావములన్నియు జనానుమతములైనవే యని నిర్ధరించవచ్చును. జనబాహుళ్యమునకు తమ మనోభావములను ప్రకటింప శక్తి లేదు గాననే నాటకరచయితకంత ప్రాముఖ్యము వచ్చినది. వాక్చాతుర్యము లేనందునను ఇతర కారణములచేతను, తమయందే యున్న ఉత్కృష్టమనోభావములను వెలిబుచ్చలేక మూగవారివలె నుండు జనసామాన్యపు శృంఖలాబద్ధ అంతరాత్మను విశృంఖలముగ జేయగలిగినవాడే ఉత్కృష్ట నాటకరచయిత.

* * *

నాటకరచయిత ఏవిధముగ ఈ మహాత్కార్యము నెరవేర్చగలడు? అతని కున్న సామగ్రి ఎయ్యది? అతనికిని, నటులకును, ప్రేక్షకులకును ఉన్న సంబంధము లెట్టివి? ఎట్టి కట్టుదిట్టములకు నాటకరచయిత లోనగుచున్నాడు? మున్నగు కొన్ని యంశములను విశదీకరించిన గాని మనకు నిజముగ నాటక మన నేమో యర్థముగాదు.

ఈ యంశములను పరిశోధించునప్పుడు ఒక ముఖ్యవిషయమును మనసునం దుంచుకొనవలెను. ఏ నాటకమైననుసరే దాని ప్రదర్శనమును గాంచక, కేవలము పుస్తకరూపముగ జదివి విమర్శనకు గడంగుట యొకగొప్ప పొరపాటు. అంగత్రయముతో గూడిన గాని నాటకమునకు సమగ్రత యుండజాలదు. ఈ మూడంగములలో నాటకరచయిత ప్రథమాంగము. నటుడు ద్వితీయాంగము. తృతీయాంగము ప్రేక్షకుడు. ఈ మూడంగముల సమ్మేళనమున గాని నాటకమునకు పూర్ణత్వము సిద్ధించదు. ఎట్టి రసికుడైనను చదివినంతమాత్రముననే ఒక నాటకమునందలి రసమును సమగ్రముగ గ్రోలజాలడు. యవనికాదులచే నలంకరింపబడిన నాట్యరంగమందు ఉచితములగు వేషభాషల నవలంబించి నటులు అభినయాదులచే నాటకప్రదర్శనమును గావించిన గాని నాటకమునందలి విశేషములు ఎట్టి రసికునికైనను బోధపడవు.

ఇట్టి ఉత్తమసహాయసంపత్తి యున్నందుననే నాటకము సర్వజనామోదదాయకము. పండితులును పామరులును గూడ నాటకప్రేక్షణమున ఆనంద మనుభవించి తన్మయత్వము గూడ నందగలరు.

ఈ సహాయసంపత్తిని గూర్చి ఇంకను కొంత యోచింతము. మానవజీవితానుభవము నందలి విశేషములే సారస్వతమున కంతటికిని వస్తుసముదాయము. కాని ఈ వస్తుసముదాయమును ఉపయోగించుకొను విధమునందే సారస్వతవిభాగములలో నొక్కొక్కదానికిని భేదము లున్నవి. వ్యాసకారుడు ఈ యంశమును గూర్చి వాదించి, చర్చించి, విశదీకరించును. భావకవి **(lyric poet)** స్వకీయ రసవృత్తినే తెల్పును. కాని నాటకరచయిత ఒకానొక కథను జెప్పియో, లేక ఒక జీవితభాగమును ప్రదర్శించియో ఈ యంశమును వ్యక్తపరచును. ఐతిహాసికులును, నవలాకారులును గూడ ఈ పద్ధతినే యవలంబించినను, వారు నాటకరచయిత కున్న ప్రత్యేకవిధానము నవలంబించరు. నాటకరచయిత తాను చెప్ప దలచుకున్న దంతయును పాత్రల మూలముననే రెండు లేక మూడు ఘంటలకాల వ్యవధియందే తెలియజేయవలెను.

ఇంతటి కష్టమగుపనిని నాటకరచయిత ఏవిధముగ నెరవేర్పగలుచున్నాడను నంశమే నాటకవిమర్శనయొక్క ప్రధానకర్తవ్యము. నాటకరచయితయొక్క ప్రధానవస్తుసామగ్రి నాటకకథయే. నాటకమునకు కథ ముఖ్యాంగము. కథాశూన్యతవలననే థారన్‌టన్ వైల్డర్ **(Thornton Wilder)** నాటికలు రసోత్పత్తికరము లైనను నాటకమున కున్న సంపూర్ణత నొందజాలకున్నవి. ఈ నాటకములు మూడు నిమిషములకాలపరిమితి నతిక్రమించక పోవుటకు ఇదియే ముఖ్యకారణము. రాగప్రకటనమే ప్రధానధర్మముగ నున్న త్రోటక సట్టకములకుకూడ కథావస్తువు ఆవశ్యకమే. పాశ్చాత్యదేశములందలి పాంటొమైంమ్ **(Pantomime)**, ఆపెరా **(Opera)**, హిందూదేశమునందలి కథకళి, యక్షగాన, వీథి నాటకములందు గూడ కథ మిక్కిలి ప్రధానము. కాన కథావిశేషము లేనిదే నాటకము సంపూర్ణసమగ్రత నొందజాలదని దృఢముగ జెప్పవచ్చును.

కథావస్తు సాధనముతో నాటకరచయిత రెండుపనులను సాధించుచున్నాడు. మొదటిది స్వభావప్రకటనము, రెండవది రాగప్రదర్శనము. ఈ రెంటి యుద్దేశ్యముగూడ రసోత్పాదనమే. కాననే ప్రాచీన హైందవ విమర్శకులు కావ్యమును గాని నాటకమును గాని విమర్శించిన ఒకటేపద్ధతి నవలంబించుచుండిరి. నాటకము రసవంతమైనదా లేదా యను ఒక్క ప్రశ్నలోనే దాని గుణాగుణ పరిశీలన మంతయు సమగ్రముగ జరుగుచుండెను. కాని శృంగారాదిచిత్తవికారములకు గూడ రసమనియే అనాదిగ వాడుచున్నందున రసశబ్దమునకు రెండర్థము లున్నవని తెలియుచున్నది. ఒకనాటకము రసవంతమైనదనిన అచ్చట రసశబ్దము శృంగారాదిచిత్తవికారపరముగ నర్థమునీయదు. ఆ పదముయొక్క మహదర్థ మచ్చట అన్వయమగును. మూలికలయందలి పసరునకును ఫలములయందలి సారమునకును సాంకేతిక పద

ముగ నుండిన రసశబ్దము క్రమముగ ఆ సారమును అనుభవింపగల 'రుచి' యను శక్తికిని, పిమ్మట పదార్థముయొక్క సారమునకును సాంకేతికముగ వాడుచువచ్చిరి. ఆ సార మేదో, ఎట్టిదో, పదార్థమును బట్టియు సందర్భమును బట్టియు మారుచుండును. ద్రవ్యమునకు గుణ మెట్టిదో కావ్యమునకు రసము నట్టిదే. గుణమునకు ద్రవ్యాశ్రయ మున్నట్లే రసమున కును కావ్యాద్యాశ్రయము గావలెను. కాని గుణమును గుణవత్త్వమును మానవునిపైనను మానవత్వముపైనను ఆధారపడియున్నవి. ఉన్నదున్నట్టుగ భూమిపై మానవులందరు నశిం చినచో గుణజ్ఞానమే యుండదు గాన గుణము లేనట్లుగనే భావించుకొనవచ్చును. అట్లనే మానవుడే లేనియెడల రసమే యుండజాలదు. అట్టి నిర్గుణముగుస్థితిని ఊహించుకొనుటకు గూడ సగుణుడగు మానవునికి సాధ్యము గాదు.

మానవునియందు రసజ్ఞత అవినాభూతిమైనను అనుభవైకవేద్యము గాన, అనుభవ మునుబట్టి ఎక్కువగను తక్కువగను ఉండును. మోటుజాతి మానవులకుగూడ రసజ్ఞత యుండినను వారికి రసానుభవము అత్యల్పము గాన, వారు నాగరికుల సామ్యమున రసికులు గారనియే చెప్పవచ్చును. అట్లుగాక వారికి రసజ్ఞతయే లేదన్నచో నాగరికప్రపంచమునకు వారిని గొనితెచ్చి విద్యాబుద్ధులను గఱపినచో ఎట్లు రసికులు కాగలుగుదురు. రసజ్ఞత మానవునికి సహజము, కాని వ్యక్తిభేదముచే రసానుభవము మారుచుండును. ఈ రసాను భవమును పెంపొందించుటయే నాటకరచయితయొక్క కర్తవ్యము. రసానుభవము ఆనంద జనకము. రసానుభవజనితఆనందము ఇంద్రియాతీతమైన దైనను ఇంద్రియరూపముగ చాల మట్టుకు వ్యక్తమగుచున్నది. ఐనను దీనిని మానసికానంద మనుటకన్న అంతరాత్మయొక్క అవస్థాభేదమని చెప్పిన సరిగ నుండునేమో. మానవత్వమును విశ్వదృష్టితో తేరిపార జూచి అవగాహన చేసికొని మనఃశాంతిని బొందునట్లే మనము ఆత్మరాగప్రపంచమును రసదృష్టితో పరిశీలించి అవగాహన చేసికొని ఆనందవారిధియందు మునుగగలము. ఇదియే నాటకపు ముఖ్యప్రయోజనము. సర్వోత్కృష్టమైన నాటకమువలన కవి, నట, ప్రేక్షకత్రయమునకు గూడ ఈ యనుభవము సిద్ధించును.

జీవితఖండ ప్రదర్శనమూలముగ నాటకరచయిత రససాగరమునందలి స్వల్పభాగ మును ప్రేక్షక మానసిక చక్షువునకు గోచరింప జేయుచున్నాడు. ఇందువలన రసవంతముగ జేయుటకు కథావస్తు వెంత ముఖ్యమో ఉత్తమనాటకములను జూచినచో బోధపడును. ఐతిహాసిక కథాసామగ్రి నుపయోగించినపుడు గూడ నాటకరచయితలు స్వకపోలకల్పనా చాతుర్యముచేత తగు మార్పులను జేసియే కథానిర్మాణమును గావించిరి. కాళిదాసు తన యభిజ్ఞాన శాకుంతలమునందు వ్యాసోక్తశకుంతలాకథ కొనరించిన మార్పులును,

షేక్సుపియరు తన నాటకములందు డెకమెరానుకథల కొనరించిన మార్పులును ఇందుకు తార్కాణము.

ఏ సూత్రముపై నాధారము చేసి నాటకరచయితలు ఈ మార్పులు చేసిరి యని యోచించిన ఒక యంశము విశదమగుచున్నది. కొన్ని క్లిష్టపరిస్థితులలో చిక్కుకొని నప్పుడు గాని మానవుని రసానుభవమును, ఆ రసానుభవమును బట్టి నిర్దేశితమగు అతని కార్యక్రమమార్గమును విశదముగాదు. కాన ఒక డవలంబించు కార్యక్రమ మార్గమును బట్టి వాని స్వభావము (character) ఇట్టిదని నిశ్చయింప సాధ్యమగును.

రసానుభవము మానసికము గాన దాని ప్రదర్శనము కష్టతమము. ప్రేక్షకుడు రసికు డైన గాని అన్యుని రసానుభవమును గ్రహింప సాధ్యము గాదు. కాని ఎవరి కార్యక్రమ విధానమును బట్టియైనను మనము వారి స్వభావమును, రాగప్రపంచమును అర్థము చేసి కొనగలము. నాటకమునందు స్వభావ చిత్రీకరణమును బాగుగ నొనరింప గలిగినచో నాటకపాత్రముల స్వభావములే గాక వారల రసానుభవముగూడ మనకు చాలవరకు విశద మగుచున్నది. కాన ఎట్టి సందర్భమున నాటకపాత్రలను ప్రవేశ పెట్టినయెడల ఆ పాత్రలు సమగ్రపరీక్షకు గురియై ఆ సందర్భమును బట్టి తమ స్వభావములను సువ్యక్తము చేయ గలవో అట్టి సందర్భ విరచనయే కథావస్తువుయొక్క ముఖ్యోద్దేశ్యము. శకుంతలాదుష్యం తుల స్వభావ చిత్రీకరణమునకు తగు సందర్భమును వ్యాసమహర్షి చూపనందుననే కాళి దాసు కథాసందర్భమును మార్పవలసివచ్చెను.

స్వభావ చిత్రీకరణమునకును రసోత్పాదనమునకును గల సంబంధము కొంతమట్టుకు ఇప్పటికి విశదమైనది. స్వభావము బహిఃప్రకటిత చేష్టాసముదాయము. రసము అంతరా నుభవచిత్తవిన్యాసము. స్వభావ చిత్రీకరణము లేక కేవలము రసోత్పాదకములైన నాటక ములనే సృష్టించుటకు సాధ్యము గాదని ఇదివరకే తెలిసికొంటిమి. కాని రసోత్పాదనమే చేయని కేవల స్వభావ చిత్రీకరణము కూడ సాధ్యము కాదని ఇప్పుడు తెలిసికొనవలెను. మానవులు రాగప్రపంచమున బడి మానసిక అవస్థాభేదములను బొందకయే యున్నచో వారి కార్యక్రమమున కర్థము లేదు. కాననే స్వభావచిత్రీకరణమే ప్రధానముగ నెంచి విమ ర్శించినయెడల మహానాటకములు గూడ దోషయుతములుగ దోచును. పాశ్చాత్యనాటక కళావిమర్శకు లెందరో ఈ తప్పిదము జేసి షేక్సుపియరు నాటకముల సర్థము చేసికొన జాలక ఆ మహాశయునికి అపవాదము నొనర్చిరి. అట్టి మూఢవిమర్శకుని పరిహసించుటకే డికెన్సు (Dickens) కర్డల్ (Curdle) అను పాత్రను సృష్టించెను. ఈవ్యక్తి షేక్సుపియరు

యొక్క 'రోమియో, జ్యూలియట్' (Romeo and Juliet) నాటకమునందలి చెలికత్తె యొక్క మృత భర్త స్వభావమునుగూర్చి అరువదినాల్గు పేజీల గ్రంథమును సృష్టించెనట.

క్షుద్రవిమర్శకులే కాక విమర్శకాగ్రేసరులు గూడ ఈ తప్పిదమున కప్పుడప్పుడు లోనగుచున్నారు. షేక్స్పియరు నాటకకళావిమర్శనమునందు అగ్రస్థానము వహించిన బ్రాడ్లీ (Bradley) దొరకూడ షేక్స్పియరుయొక్క అసమానమహోన్నత్యము నొకచోట అర్థము చేసికొనలేకపోయెను. "ఒథెలోవంటి యోధాగ్రేసరుడు, మానవాగ్రేసరు డేల, శక్తిసామర్థ్య ధైర్యసాహసగుణములతోను, నీచాతి నీచగుణములతోను ఒప్పారు అయాగో (Iago) వంటి విచిత్రపురుషుని నంతగా విశ్వసించెను" అని బ్రాడ్లీదొర ప్రశ్నించి తనప్రశ్న కెట్టి సమాధానమును పొందజాలకున్నాడు. కాని స్వభావ చిత్రీకరణ మను ఒక్కసూత్ర మునే యాధారము చేసికొనక బ్రాడ్లీదొర రసదృష్టితో ఒథెలో నాటకమును పఠించి యుండినయెడల తన ప్రశ్నకు సమాధానము బొందియుండును.

నిదర్శనముల నెన్నిటినో చూపవచ్చును. నాటకమునందు ముఖ్యాంశము రసము గాని స్వభావ చిత్రీకరణముగూడ గాజాలదని ఏ మహానాటకమును చదివినను బోధపడ గలదు.

కాని నాటకమునందు చాలమట్టుకు స్వభావ చిత్రీకరణమే ఇంద్రియగ్రాహకమగు నంశము. రసానుభవము ఆత్మైకానందము. అందువలననే ఇంద్రియైకపరమగు పాశ్చాత్య జనసామాన్య మెప్పుడును స్వభావ చిత్రీకరణమునకే ప్రాముఖ్య మిచ్చుచున్నది. వారి యుత్తమనాటకములందుగూడ కొన్నిటియందు రసపుష్టి సమగ్రసంపూర్ణత నొందకుండుట కిదియే కారణము.

నాటకకథయందలి ప్రపంచము నాటకరచయితయొక్క అభీష్టావసరములను బట్టి ఎన్నెన్ని యోవిధములుగ నుండవచ్చును. ఛెకోవ్ (Tchekov) నాటకప్రపంచము అల్ప వైశాల్యము గలదైనను అత్యంతస్పష్టముగ నున్నది. బర్నార్డుషా (Bernard Shaw) తన నాటకసామగ్రి యంతటిపైనను తన విచిత్రదృష్టి బరపి యొక నూతనప్రపంచమును సృష్టించి యున్నాడు. షేక్సుపియరు తన మిడ్‌సమ్మర్ నైట్స్ డ్రీమ్ (Midsummer Night's Dream) నందు మానవానుభవమునకు వ్యతిరిక్తమైన ప్రపంచమును సృష్టించియున్నాడు. స్వభావ చిత్రీకరణమే ప్రధానముగ నెంచు పాశ్చాత్యనాటకరచయితలు లోకధర్మము (Realism) నెడబాసి ఇట్లు నాట్యధర్మా (Idealism) వలంబనము చేయుట జూడ హైందవ ప్రాచీన నాటకములందే స్వభావ చిత్రీకరణము ఉత్కృష్టముగ నున్నదేమో యను అనుమానము కలుగును.

కథావస్తు నిర్మాణమునందు నాటకరచయితలకు రెండేపద్ధతులు గలవు. వీనిని నాటకధర్మపద్ధతి (Idealism) యనియు లోకధర్మ (Realism) పద్ధతి యనియు భరత ముని చెప్పియున్నాడు. ఈ పద్ధతులనుగూర్చి కొంత తెలిసిన కాని నాటకప్రభేదములగూర్చి కాని, నాటకనిర్మాణమునుగూర్చి కాని విశదముగాదు. కాన ఈ పద్ధతులను కొంతమైన ఇట వివరించి విమర్శించుట యవసరము.

లోకధర్మపద్ధతి యర్థమగుట కష్టముగాదు. ప్రపంచసాదృశ్య మెంత యున్న అంత మట్టుకు ఆ నాటకము లోకధర్మపద్ధతి ననుసరించినదని చెప్పవచ్చును. పాశ్చాత్యనాటక ములలో ఆధునిక ప్రహసన భాణము లన్నియు ఈ తెగకు చేరినవే. ఉదాహరణము (1) My Wife's Family (2) Hobson's Choice (3) Love Race (4) Private Lives మొదలగునవి. సంస్కృతవాఙ్మయమునందలి ప్రకరణములును, భాణములును, ప్రహసన ములును ఇంచుమించుగ అన్నియు లోకధర్మపద్ధతికి జెందినవే. మృచ్ఛకటిక ఇందులకు ముఖ్యోదాహరణము. నేటి తెనుగు'నాటకముల'లో చాలమట్టుకు ఈపద్ధతి వ్యక్తమగు చున్నది.

లోకపద్ధతి విభాగమునకు చెందుటకు ఏయే యంశములను నాటకరచయిత ముఖ్య ముగ గమనింపవలెనో భరతముని తన నాట్యశాస్త్రమునందు వక్కాణించియున్నాడు. భాషావిధానమును, ప్రవృత్తియు, ప్రకృతియు లోకధర్మమునకు ముఖ్యాధారవిషయములు.

భాష పాత్రయొక్క దేశ, రాజ్య, నాగరకత, ప్రకృతి, పదవులబట్టి మారుచుండ వలెనని భరతముని శాసించియున్నాడు. సంస్కృతనాటకరచయితలు భాషావిధానమునందు కడుజాగ్రత్తతో మెలంగినట్లు ఎల్లరకిని తెలిసినయంశమే. పాత్రభేదమునుబట్టి సంస్కృత ప్రాకృతములను వారు నాటకములం దుపయోగించియుండుట సుప్రసిద్ధము. షేక్సుపియరు కూడ తన నాటకములయందు కొంతమట్టుకు ఈ నియమమును పాటింప జూచినట్లు కాన నగును. హెన్రీ ది ఫిఫ్త్ (Henry the Fifth) నాటకమునందు ప్రథమాంకద్వితీయరంగము నందు నాయికానాయక ప్రథమసమావేశసందర్భమున నాయికయగు ఫ్రెంచిరాజకుమారి ఫ్రెంచిలోనే సంభాషించును. మిగిలిన ఫ్రెంచిపాత్రలన్నియు ఇంగ్లీషులోనే వ్యవహరించు చుండ షేక్సుపియరు ఈ విషయమున మాత్ర మేల ఇట్టివిభేద మొసర్చెనో యర్థముగాదు. జూలియస్ సీజర్ (Julius Caesar) నాటకమున బ్రూటస్ (Brutus) కథానాయకుని కత్తితో పొడిచినప్పుడు, అంతవరకును ఇంగ్లీషులోనే వ్యవహరించుచున్న సీజరు (Caesar) అప్పుడు మాత్రము లాటిన్ (Latin) లో నొకవాక్యము జెప్ప నవసర మేమి? కొన్నికొన్ని చోట్ల షేక్సుపియరు భాషావిధానము విమర్శనాతీతము. మర్చంట్ ఆఫ్ వెనీస్ (Mer-

chant of Venice) నందు లాన్సీలట్, గోబోలసంభాషణమును జదివినయెడల షేక్స్పియరు పాత్రకు తగిన భాషనే ఉపయోగించుటకై ఎంత శ్రద్ధవహించెనో విశదమగును. ఆధునిక పాశ్చాత్యనాటకములందుగూడ ఈశ్రద్ధ గానవగును. కాని నీచభాషయగు కాక్నీ (cockney) నుపయోగించియు ఇతరవిధముల ఎన్నిమార్పులు చేసినను మొత్తముగ పరిశీలించినచో పాశ్చాత్యనాటకకళయందు భాషావిధానమును ఒక నియతవిధానము ననుసరించి పాటింపలేదని తెలియుచున్నది.

లోకధర్మమునుగూర్చి మిగతయంశములు రెండే. వీనిని సాధారణముగా ప్రవృత్తియనియు ప్రకృతియనియు జెప్పుచున్నారు. ప్రవృత్తిభేదము లనంతములైనను దేశవిభాగములను బట్టియు, రాజ్యవిభాగములను బట్టియు ప్రవృత్తి మారుచుండునని యుంద రెరిగిన యంశమే. దాక్షిణాత్య, అవన్తీ, పాంచాలీ, మాగధీ యని భరతముని చతుర్విధప్రవృత్తులను పేర్కొనియున్నాడు. ఇప్పటికిని ఇంగ్లీషువారి ప్రవృత్తినిగూర్చి ఫ్రెంచివారును, ఫ్రెంచివారి ప్రవృత్తినిగూర్చి ఇంగ్లీషువారును, అమెరికావారి ప్రవృత్తినిగూర్చి జర్మనులును, ఇట్లే ఒకరొకరును ఒకరొకరి ప్రవృత్తులనుగూర్చి సతతము విమర్శించుచు పుస్తకములందును నాటకములందును ప్రదర్శించుచుండుట సర్వసామాన్యము. ఇక రెండవదానిగూర్చి విశేషముగ జర్చింప నవసరమే లేదు. ప్రకృతి వ్యక్తిగతము. దీనినిగూర్చియే అరిస్టాటల్ (Aristotle) తన అలంకారగ్రంథమునందు (Rhetoric) డిస్పొసిషన్ (disposition), కండిషన్ (condition) అను శీర్షికలక్రింద విమర్శించియున్నాడు. ప్రకృతి వయోభేదముచేతను, స్త్రీపురుష జాతిభేదముచేతను, కులభేదముచేతను, అనేక విభేదములచేతను మారుచుండునని అరిస్టాటల్ సిద్ధాంతము జేసియున్నాడు. వేషభూషణాదులును, సంగీతాభినయాదులును ప్రవృత్తి ప్రకృతులభేదముచే మారుచుండు నను విషయము సుప్రసిద్ధము.

దీనినిబట్టి రచనమునందు లోకధర్మము అత్యంత ప్రాముఖ్యముగలదని తెలియుచున్నది. కాని ఈ ధర్మమునే సమగ్రముగ ననుసరించవలెనన్న దుస్సాధ్యమని ఈ తరగతికి జేరిన పాశ్చాత్యనాటకములనుజూచిన బోధపడును. ఈ ధర్మలక్షణములను భరతు డొసంగినట్లే గైకొని వీని యాధారమున షేక్స్పియరు నాటకములను విమర్శించినచో అవి ఈ ధర్మము నంతగా పాటింపలేదని వ్యక్తమగును. షేక్స్పియరు నాటకములేకాదు, పాశ్చాత్యనాటకములెవ్వియైనను కేవల మీలక్షణములనేపట్టిచూచినచో లోకధర్మతరగతికి జెందవు. ఈపద్ధతిని గ్రీకునాటకములను చర్చించుటకే వలనుపడదు. బర్నార్డుషా (Bernard Shaw) నాటకప్రపంచము ప్రకృతిభిన్నమనియు దాని యునికికి షాయొక్క విచిత్రదృష్టియే కారణమనియు ఇదివరకే చూచియున్నాము.

అనుకరణమును, ప్రపంచసాదృశ్యమును నాటకరచయితకు ముఖ్యాదర్శములైనను కేవలానుకరణమే కర్తవ్యమని భావించుట యవివేకము. విశ్వసృష్టి మానవాతీతము, గాన దాని యుత్కృష్ట అనుకరణము మానవునకు దుస్సాధ్యము. అట్టిచో నాట్యధర్మావలంబనము లేకయే రసవంతమగు నాటకమును రచించుట కెట్లు సాధ్యమగును? రసోత్పాదనమునకును, స్వభావ చిత్రీకరణమునకును ఉపయోగపడని యంశము లెవ్వి యున్నను (అవి మానవజీవితమున కెంత ఉపయోగకరములైనను) వానిని నాటకమునుండి వదలి వేయవలసినదే. ఇంతమాత్రముచే లోకధర్మము లోపించినదని ఎంచరాదు. పైగా రసానుభవమును కలిగించుటకు ఏ ఉపకరణము లనుకూలములైనను వానిని ఉపయోగింపవలసినదే.

ఇట్టి ఉపకరణములను నాల్గు ప్రత్యేకవిభాగములక్రింద విమర్శింపవచ్చును. మొదటిది భాష. నాటకమునకు ముఖ్యోపకరణము భాషాసౌష్ఠవము. భాషాసౌష్ఠవమునుగూర్చియే అరిస్టాటల్ (Aristotle) మొదలుకొని ఆష్లీ డ్యూక్స్ (Ashley Dukes)వరకును పాశ్చాత్య విమర్శకు లందరు ఎన్నియో పుటలు వ్రాసియున్నారు. భూషణప్రాయమైన పదసౌష్ఠవముచే నొప్పి, మనోహరగతి (Rhythm)యుతమై, అల్లికబిగిసొంపున (harmony or aggreable effect of apt arrangement of parts) రాణించు భాషారూపముననే ట్రాజడీ (Trajedy) మహానాటక ముండవలెనని అరిస్టాటల్ (Aristotle) ఆదేశించియున్నాడు. పద్యభాగమైనను, గద్యభాగమైనను నాటకమందలి భాషయంతయు విచక్షణముగ (keen) ఉండవలెను. వ్యంగ్యార్థము నిచ్చు పదముగాని, ధ్వనిగాని, శబ్దార్థాలంకారములు గాని, భాషావిశేషము లేవియైనను సరే ఔచిత్యభంగకరములు గాకుండునట్లు మాత్రము చూచి ఉపయోగించుకొనవచ్చును. [1]

ఉదాహరణముగ ఒకటి రెండు నాటకములను పరిశీలింతము. ఆధునిక ఆంగ్లనాటకములలో విఖ్యాతిబడసిన హాసెన్ (Hassan) అను ఫ్లెకర్ (James Elroy Flecker) రచించిన నాటకపు ఘనతయంతయు భాషాసౌష్ఠవముపైననే యాధారపడియున్నదని పాశ్చాత్య విమర్శకు లెందరో వక్కాణించియున్నారు. కేవల మొక్క భాషాసౌందర్యముతోనే ఎట్టి ఘనత వహించవచ్చునో యనుటకు ఆస్కార్ వైల్డ్ (Oscar Wilde) నాటకము లుదాహరణములు. భావపూరితములైన కొన్ని పదములచేతనే నాటక

[1] "Of the hundred speeches, long and short, that he must deliver in the course of the evening, how many are rhythmically and dramatically expressive? Of how many do we feel that they could be written and spoken in the one way and no other? How many will be accurately remembered by the listener? The actor seeks for the pointed word, the crystalline word, the lyrical word, the inevitable word."

Ashley Dukes.

రచయిత ప్రేక్షకులను కథాంశములోనికి ఎంతదూరము గొనిపోగలడో గాల్‌స్‌వర్దీ (Galsworthy) యొక్క సిల్వర్ బాక్స్ (Silver Box)ను జూచిన తెలియును.

కాని ఈసుగుణమే ఔచిత్య భంగకరమై దుర్గుణముగ పరిణమించుటకుగూడ అవకాశ మున్నది. బర్నార్డుషా నాటకములందలి లోపము చాలవరకు నిదియే. వాక్ప్రౌఢిమ యతని నాటకపద్ధతులలో శ్రేష్ఠమైనదే, కాని కొన్నిచోట్ల ఇది ఔచిత్యభంగకరముగ పరిణమించుచున్నది. షా నాటకములందలి పాత్రలందరును ఇంచుమించుగ నొకటే ధోరణిలో మాటలాడుదురు. ఏపాత్రనోట ఏసంభాషణము వినిపించిననుసరే రసభంగము గాజాలదు. గెటింగ్ మారీడ్ (Getting Married) అను నాటకమున బిషప్‌కును (Bishop), మిసిస్ జార్జికిని (Mrs George), చాప్లిన్‌కును (Chaplin) ఒకటేరకపుభాష నొసగియున్నాడు. ఇక మిగతపాత్రలందు సిరిల్‌కును (Cyril), సిడ్నీకిని (Sydney), రెజ్జీకిని (Rejjy), అతనిభార్యకును ఒకటేరకపు భాష నొసగుచున్నాడు. పాత్రలలో ఒకపాత్ర సంభాషణమంతయు నింకొకపాత్ర కంటగట్టినను రసాభాసముగ పరిణమించదు. ఇక షా రచించిన ఇతరనాటకములను పరీక్షించినచో వాని యన్నిటియందును ఒకటేరకపు పాత్రలును, ఒకటేరకపు భాషయు ఉన్నదని వ్యక్తమగును. షేక్సుపియరు (Shakespeare) నాటకముల నొకమారు గమనింపుడు. ధీరోదాత్తులగు ఆంటోనీ (Antony) హెన్రీ (Henry V) ల భాషల కేమి సామ్య మున్నది? డెస్డమోనా (Desdemona) కార్డీలియా (Cordelia) భాషల కేమి సామ్య మున్నది? ప్రధానపాత్రలనే కాక ఏపాత్రలను దీసికొని పరీక్షించినను ఒకపాత్ర యుపయోగించినట్టి భాషావిధానము నింకొకపాత్ర యుపయోగించినట్లు గన్పడదు. కాళిదాసనాటకములందుగూడ ఈ ముఖ్యాంశము గాననగును. మాలవికాగ్నిమిత్రమందలి ధారిణికిని, విక్రమోర్వశీయమునందలి కాశీరాజపుత్రికకును భాషయందెంతో వ్యత్యాసము గాన్పించుచున్నది. మాలవికాగ్నిమిత్రమునందలి వకులావలికకును విక్రమోర్వశీయమునందలి చిత్రలేఖకునుగూడ అన్నివిధములను ఎంతయో భేదము గాన్పించుచున్నది. దుష్యంత, పురూరవస్, అగ్నిమిత్రుల భాషయందు పరస్పర మెంతయో భేదమున్నటుల గాన్పించుచున్నది. ప్రతియొక్కపాత్రకును భిన్నవ్యక్తిత్వముతోపాటు కాళిదాసు భాషయందుగూడ నొక ప్రత్యేకత సృష్టించెనని సూక్ష్మముగ పరిశీలించినచో బోధపడును.

నాట్యధర్మపద్ధతులలో రెండవది సంగీతము. నాటకమునందు సంగీత మావశ్యకమా కాదాయను విషయమునుగూర్చి నేడు తెలుగుదేశమున విశేషచర్చ జరుగుచున్నది. కాన ఇట నొకటి రెండు అంశములనుమాత్రమే వివరించెదను.

సంస్కృతనాటకములందే కాక ఆధునిక పాశ్చాత్య నాటకములందుగూడ సంగీత మధికముగా గానవచ్చుచున్నది. నేటి ఆంగ్లనాటకకవిశేఖరుడనదగు నోల్ కవర్డ్

(Noel Coward) నాటకములందున్న అనల్ప సంగీతసంపదయే ఇందులకు తార్కాణము. ఉత్తమనాటకములయందు సంగీతము మూడువిధములగు సందర్భములందు గానమగును. మొదటిరకపు సంగీతమును ప్రాచీనహైందవులు ధ్రువాగాన మనుచుండిరి. పాత్రల కేలాటి సంబంధము లేకున్నను నాటక సందర్భమునుబట్టి రసోత్పాదనకు అనుకూలపడునట్లు ఉత్పన్న భావ మిళితమగునట్టి సంగీతమును సాధారణముగా రంగాతర్భాగమునుండి ధ్రువాగాన మనుపేర ప్రవేశపెట్టుట ప్రాచీనహైందవనాటకములందు వాడుకగ నుండెను. కథాసందర్భ మున మునిగినప్రేక్షకులు రసపూరితులై ధ్రువాగాన మున్నదనికూడ గమనింపరు. అట్లు గమనించుట కవకాశ మున్నయెడల ధ్రువాగానము సందర్భౌచిత్యమును పాటించుటలేదని చెప్పవచ్చును. భిన్నసందర్భములందు ఏఏరాగములను ఉపయోగించవలెనో సంస్కృత నాటక లాక్షణికులు చర్చించియున్నారు. పాశ్చాత్యనాటకములందుగూడ పర్కషన్ మ్యూసిక్ (percussion music) అనుపేర ఈ ధ్రువాగానము మిక్కిలి ప్రాముఖ్యము నొందుచున్నది. మూఢునికిని, సంగీతాభిరుచి ఇసుమంతయు లేనివానికిని ఈధ్రువాగానము రుచింపకపోవుటయే కాక రసభంగముగ నున్నట్లుగూడ తోచవచ్చును. పాశ్చాత్యసంగీత మునం దించుకంతయు ప్రవేశములేని హిందూదేశీయులు తమ ప్రియపఠనగ్రంథములైన ఆంగ్లనాటకములను, ఇంగ్లాండుదేశమునందు సర్వోత్కృష్ట ప్రదర్శనముల గాంచియు ఆశాహతులగుటకు చాలమట్టుకీ ధ్రువాగానమే (percussion music) కారణము. కాని తొలుదొల్త ఈవిధముగ ధ్రువాగానము రుచింపకపోయినను రానురాను దాని యావశ్య కత బోధపడి దానియందు అభిరుచి జనించును. అట్లు కొంతకాల మైనపిమ్మట రిహార్సల్స్ (rehearsals) నం దొకొకప్పుడు ధ్రువాగానము లేకున్నయెడల ఏదియో యొక లో టున్నటులగూడ దోచుచుండును.

ధ్రువాగానమే కాక మరి రెండువిధములుగగూడ సంగీతము ఆధునిక పాశ్చాత్య నాటకములందు గాన్పించుచున్నది. మొదటిది, ప్రత్యేక సందర్భములందు నియుక్తమైన సంగీతము. ఆధునిక పాశ్చాత్య నాటకములలో జనసమ్మతిని బడసినవానిలో సాధారణ ముగా నన్నిటియందును ఏదోవిధముగ సంగీతమునకే ప్రత్యేకముగా నొకసందర్భ ముండుట సర్వసామాన్యము. త్రీ మస్కెటీర్స్ (Three Musketeers) నాటకమునందు రాజు సంగీత మును వినగోరును. బిట్టర్ స్వీట్ (Bitter Sweet) నందు కథానాయకుడు నాయికను పాడగోరును. వండర్ బార్ (Wonder Bar) నందు ఒక నైట్ క్లబ్ (night club) అధి కారి యొక పనికత్తె చాతుర్యమును పరీక్షింపగోరును. ఇట్టిసందర్భముల నెవ్వరును నిషేధింప సాధ్యముగాదు. షేక్సుపియరుయొక్క మర్చంట్ ఆఫ్ వెనీసు (Merchant of Venice) అను నాటకమునందు ఒక ముఖ్యసందర్భమున 'టెల్ మి వేరీజ్ ఫాన్సీ బ్రెడ్' (Tell me

where is fancy bred) అను ఒక పాట యుండుట అవివేకమని ఆధునిక ఆంధ్రవిమర్శకు లకు దోచిన దోచవచ్చునుగాని పాశ్చాత్య విమర్శకశ్రేష్ఠుల కది సమంజసముగనేయున్నది.

ఇక ఇప్పుడు చర్చ జరుగుచున్నదంతయు మూడవరకపు సంగీతమును గూర్చియే. నాయికానాయకులు సంగీతమునందే పరస్పర సంభాషణ జరుపుటయు, తమ యభిప్రాయ ములను సంగీతమునందే వెలిబుచ్చుటయు లోనగు సందర్భము లనుచితములని ఆధుని కాంధ్రవిమర్శకులవాదము. వీరివాదములో చాలవరకు సత్యముండుట నిజము. కాని ఈసూత్రమునే యాధారముజేసికొని ఖండించినచో నేటి యుత్తమనాటకము లెన్నియో గతించును. నోల్ కవర్డ్ (Noel Coward) గారి వర్డ్స్ అండు మ్యూసిక్ (Words and Music), ప్రైవేట్ లైవ్స్ (Private Lives) నాటకములుగూడ పై యాక్షేపణకు గురియౌను.

ఈవిషయమున విశేషవిమర్శనకు పూనుకొనక సంగీతమునుగూర్చి ఒకరిద్దరి యభి ప్రాయములను మాత్రము దెల్పెదను. గోయెథె (Goethe) యను జర్మనుదేశపు మహా శయుడు ఈవిషయమునుగూర్చి ఈక్రిందివిధముగ చర్చించియున్నాడు. "సంగీతరూపముగనే సంభాషణము జరిపి, సంగీతమునసే ప్రేమమును వెలిబుచ్చి, సంగీతరూపముగనే యుద్ధము జేసినను గూడ నాటకము యాథార్థ్య వైరుధ్యముచే హేయభావమును పెంపొందించుటకు బదులు ఏల మనసుల రంజిల్లజేయుచున్నది? రసికుడు గాని అనాగరిక ప్రేక్షకునికే కళ కళారూపముగ గాక ప్రకృతిరూపముగ గాన్పించును. ప్రకృత్యనుకరణరూపముగ కళ నుండగోరువాడు కళాభిజ్ఞతలేని అనాగరికుడు గాననే ప్రకృత్యనుభవమువలెనే మోటుగ కళానుభవమునుగూడ పొందగోరుచున్నాడు. ప్రేక్షకులు రెండువిధములు: (1) రసికులైన నాగరకులు (cultured) (2) ప్రారంభికులు, అనాగరకులు. రసికులు నాటకధర్మములపైనను నాటక నియమములపైనను ఆధారపడియే కళాస్వరూపమును అనుభవించి ఆనందించగలరు. రసికత లేని మోటుజనులు నాటకరంగమున గూడ ప్రకృతిచిత్రమునే చూడగోరుదురు." ఇదియే గోయథె (Goethe) యభిప్రాయము.

ఆధునిక విమర్శకశ్రేష్ఠులలో నొక్కడగు R. Assiglio కూడ నాటకమునందు సంగీత మావశ్యకమని ఈక్రిందివిధముగ వక్కాణించుచున్నాడు:

"Without music purely visual spectacles cannot yield equally strong psychic vibrations, but leave rather a feeling of incompleteness, almost of emptiness, as if a third dimension were missing, a 'depth' not spatial, but vital and psychological."

ఇక నాటకరంగవస్తుసముదాయమునుగూర్చి కొంత పరీక్షింతము. గ్రీకుల నాటకమున యవనికాదుల ప్రాబల్యము గాని కథావస్తువున కావశ్యకమైన ఇతరవస్తు సముదాయము గాని యుండలేదు. ఉండినను వాని సహాయ మత్యల్పమే. షేక్సుపియరు కాలమునాటికిగూడ నాటకరంగవస్తువృద్ధి ప్రాథమికదశయందుండెను. కాన దేశకాల పరిసరములను చాలమట్టుకు ప్రేక్షకులే తమ మనోరంగమందు చిత్రించుకొన వలసి యుండెను. కాని ఇంతమాత్రముచేతనే షేక్సుపియరు కాలమునాటి ప్రేక్షకులును, గ్రీసు వారును, ప్రాచీన హైందవులును సమగ్ర రసానుభవమును పొందజాలకుండిరని చెప్ప నలవి గాదు. నేటికిని లండనునందలి హిప్పోడ్రోమ్ (Hippodrome) నాటకశాలయందు భ్రమణరంగ (revolving stage) సహాయమున ప్రదర్శించిన ఒథెలో (Othello) నాటక ప్రదర్శనము, ఓల్డ్ విక్టోరియా (Old Victoria) నాటకశాలయందు షేక్సుపియరు కాల మునందువలెనే యవనికాదులు లేక సామాన్యరంగస్థలమందు ప్రదర్శించిన అదే ఒథెలో (Othello) నాటకప్రదర్శనముకంటె రసవంతముగను మనోరంజకముగను ఉండునని చెప్ప సాధ్యముగాదు. లండను నగరమునందలి బొటానికల్ గార్డన్స్ (Botanical gardens)నందు పట్టపగలు,మిడ్‌సమ్మర్ నైట్స్ డ్రీమ్ (Midsummer Nights Dream), వింటర్స్ టేల్ (Winters Tale) మొదలగు నాటకములను ఆధునికరంగ వస్తుసహాయ మేమాత్రమును లేకయే ప్రతి సంవత్సరమును ప్రదర్శించినపుడు జనము క్రిక్కిరిసి యధిక ధనము వ్యయముజేసియుగూడ చూచి యానందింతురు. లక్షలకు మించిన ధనవ్యయ ముచే రంగవస్తుసామగ్రి నంతయు తయారుచేయు టాకీ (Talkie) కంపెనీల నటశేఖ రులుగూడ రంగవస్తుసహాయ మొకింతయులేని షేక్సుపియరు నాటకప్రదర్శనములందు పాల్గొనుట కుత్సాహపడుచు, చార్లస్ లాటన్ (Charles Laughton) మొదలగువారు అదియే తమ గొప్ప కోరికయని చెప్పుకొనుచున్నారు. దీనినిబట్టి చూడ రంగవస్తు సామగ్రి నెంతకాలమును అప్రధానాంశముగనే ఎంచవలయుననియు, రంగమునకే సర్వ ప్రాముఖ్యమును ఒసంగుట పొరపాటనియు తెలియుచున్నది.

బర్నార్డు షా తన సెయింట్ జోన్ (Saint Joan) నాటకోపోద్ఘాతమునందు రంగవస్తు విమర్శనముచేయుచు నాట్యరంగమందు నిజమైన వంతెన దానిక్రింద నిజమైన నీరు మొదలగునవి నిర్మించుటయును, జోన్ కన్యను నిజముగ గుఱ్ఱముపైననే రంగము పైకి గొనితెచ్చుటయు యవివేకమనియు, అట్టి చర్యలవల్ల రసానుభవమున కెట్టి అను కూల్యమును సిద్ధించదనియు నొక్కిచెప్పియున్నాడు. ఇందువల్ల ఈ ప్రకృతి నిర్మాణములను రంగముపై తయారుచేయునంతకాలము ప్రక్కనున్న ఉపహార విక్రేతలకు ప్రాప్తించు లాభము తక్క వేరెట్టి ప్రయోజనమును లేదని షా హాస్యము జేసియున్నాడు. ఆష్లే

డ్యూక్స్ (Ashley Dukes) అను మరొక విమర్శకుడు, ఈ కృత్రిమ ప్రకృతి నిర్మాణము యాథార్థ్యభావము నుద్భవింపజేయుటకు బదులు ప్రేక్షకుల మనసులందు తద్విరుద్ధభావమును జనింపజేయునని చెప్పుచున్నాడు. [1]

నాట్యధర్మమున ఇతర అంశము లెన్నియో గలవు. వానినన్నిటిని ఒక చిన్న వ్యాసమున వ్రాయుటకు సాధ్యముగాదు. ఒకటి రెంటి నిట గమనింతము. యాథార్థ్యమునకు విరుద్ధమైనను చీకటిలో జరిగిన కార్యములను జూపించుటకు కొంతయైనను వెలుతు రుండితీరవలయును. పూర్వాపర కథను గాని విశేషములను గాని తెలియ జేయుటకు నాటకరచయిత, ఆత్మగత, స్వగత (soliloquy), అపవార్యము (aside) లను నాట్యధర్మముల నుపయోగించకతీరదు. [2]

నాటకరచయిత తనవ్యక్తి నెప్పుడును బహిరంగపరుపగూడదు. పాత్రలనోట తన వ్యక్తినే బహిరంగపరచినాడని ప్రేక్షకులకు దోచినవెంటనే మాయాబుద్బుదము భగ్నమై రసాభాసమగును. షేక్సుపియరు తన టెంపెస్ట్ (Tempest) నాటకమున ఇట్టి తప్పిదము జేసియున్నాడు. ప్రాస్పెరో (Prospero) తనకథ మిరాండాతో చెప్పునపుడు యాథార్థ్యమునకు భంగము కలిగి ప్రేక్షక కవుల కుండు గూఢసంబంధము బయల్పడుచున్నది. ప్రాస్పెరో (Prospero) తనకథను మిరాండా (Miranda) కు జెప్పుచున్నా డన్న భావము మారి కవియే స్వయముగా ప్రేక్షకులకు కథ జెప్పుచున్నాడను అంశము ఇట బహిర్గతమగుచున్నది.

ఇంతవరకును తేలినయంశము లివియే. నాటకరచయిత తన దృష్టిపథమున సతతము ముందుంచుకొనవలసిన ధర్మము రసోత్పాదనము. రసోత్పాదనము కలిగించుటకు కథావస్తువును, అందు ప్రధానముగా స్వభావ చిత్రీకరణము సాధనములు. ఇతర సాధనసామగ్రి నుపయోగించుటయందు నాటకరచయిత జ్ఞాపకముంచుకొనవలసిన ధర్మసూత్రము ఒక్క

---

[1] "But the symbols of the theatre can never be other than theatricai. Every endeavour to make them 'real' reverses the actors' natural purpose by creating a world of sham reality from the world of appearance. The presence of real donkeys or cascades of real water on the stage gives pleasure to large audiences, but it can scarcely be said to diminish the theatricality of a performance............In the very effort of the actors' creation of another world without external aids, there is a special appeal.........Workers in the theatre know that rehearsals are often more satisfying. in an emotional sense, than full-dress performances."

[2] యూజీన్ ఓ'నీల్ (Eugene O'Neil) అను నాటకరచయిత స్ట్రేంజ్ ఇంటర్‌లూడ్ (Strange 1nterlude) అను నాటకమందు దీనిని ప్రధానముగానే ఉపయోగించుచున్నది. ఒకప్రక్కను బహిర్గతమైన భావములను, ఇంకొకప్రక్క అంతర్గతభావములను ప్రకటించుచు, బాహ్యప్రపంచమునకు మానసరంగమందలి ప్రతి యంశమును చూపుచు ఈ నాటకమునందలి పాత్రలు ఒక విచిత్రనాటక పద్ధతి ననుసరించి అత్యధికవిమర్శకు పాత్రులైరి. రచనాకౌశలముతో నొప్పారు యూజీను ఇట్టి దుర్భరకార్యమును సమర్థతతో నెరవేర్పగలిగినది గాని సామాన్యుల కిది సాధ్యముగాదు.

ఔచిత్యముమాత్రమే. ఔచిత్యమునకు భంగకరమైన యెడల ప్రకృతి సిద్ధములైన యంశములనుగూడ వదలివేయవలసినదే. ఔచిత్యమునకు మాత్ర మెట్టిభంగమును కాకుండునట్లు చూచి రసోత్పాదనమునకై నాట్యధర్మముల నెంతమట్టుకైనను అంగీకరింపవచ్చును.

ఆధునిక పాశ్చాత్యనాటకములందు దినదినమును ప్రకృతియాథార్థ్యములు దూరమై నాట్యధర్మ మధికమగుచున్నది. రంగవస్తునిర్మాణము ఎడ్వర్డుకాలమునందలి యాధిక్యము నంతయు గోల్పోయినది. నాటకములు సాధారణముగ ఏకరంగ, త్రిరంగ నాటకములుగ మారినవి. నాటకప్రదర్శనమునందు మధ్య ఒక్క అంతరాళమునుమాత్రమే ఒసంగుచున్నందున చాల నాటకములందు రంగము మారుటకు ఒకటిరెండు అవకాశములు మాత్రమే యున్నవి. వండర్ బార్ (Wonder Bar)ను, గెటింగ్ మారీడ్ (Getting Married) ను ఇందుకు రెండుదాహరణములు. నాటకకవిశేఖరులలో అగ్రస్థాను నీయదగు సింజి (Synge) నాటకములు మూడు రంగములకు మించవు.

నాటకములందు భావములను మూర్తీభవింపజేసి నాటకపాత్రలగ ప్రవేశపెట్టుట ఆధునికపాశ్చాత్యనాటకములందు గానవగు మరియొక నాట్యధర్మవిశేషము. జనబాహుళ్యపుమూర్తి (spirit of the masses), పురుషుడు, స్త్రీ, నామరహితమైనది (the nameless one), కరుణ, దేవత్వము, పర్వతగాంభీర్యము, నగర ఆకర్షణము మొదలగునవి పాత్రరూపముగ ప్రవేశించి పామరులనుగూడ రంజిల్లజేసినవని చెప్పుటకు, టాల్లర్స్ మాన్ అండ్ ది మాసస్ (Tollers Man and the Masses), ఆడ్డింగ్ మెషీన్ (Adding Machine) మొదలగు నాటకములు గడించిన కీర్తియే తార్కాణము. షేక్స్పియరు, జాన్సన్ (Johnson), బాస్వెల్ (Boswell), షెల్లీ (Shelly), ఇబ్సెని (Ibsen) మున్నగు సారస్వత ప్రపంచ మహామహులు పాత్రరూపముగ ఈ భూమిమీద నవతరించి, ఆధునిక సారస్వత విమర్శకుల వెన్నంటుచు వారి సద్విమర్శనలకు ఆనందించుచు, దుర్విమర్శనలకు ఆవేదన పడుచు నాటకమున ముఖ్యపాత్రలుగపాల్గొనుచున్నను నాటకమునందలి ఇతరపాత్రలు వీరిని గాంచనట్లుగనే ప్రవర్తించుచుండుట జూడ ప్రబోధచంద్రోదయ సంకల్పసూర్యోదయాదులందలి నాట్యధర్మముగూడ నేటికిని రసికజనాకర్షకరమని చెప్పకతప్పదు.

పశుపక్ష్యాదులుగూడ పాత్రరూపముగ నాటకములందు ప్రవేశించి మానవులవలె సంభాషించుచు, వ్యవహరించుచు నుండుటగూడ ఆధునిక పాశ్చాత్యనాటకకళయందలి నాట్యధర్మవిశేషమే. లూయిస్ కెరోల్ (Lewis Carroll) రచించిన అలిస్ ఇన్ ది వండర్లాండ్ (Alice in the Wonder land), అలిస్ ఇన్ ది లుకింగ్ గ్లాస్ (Alice in the Looking glass), సర్ జేమ్స్ బారీ (Sir James Barrie) రచించిన పుస్ ఇన్ ది బూట్స్

(Puss in the Boots), ఎ. ఏ. మిల్న్ (A. A. Milne)రచించిన కింగ్స్ బ్రేక్‌ఫాస్ట్ (King's Breakfast) మొదలగు విచిత్రనాటకములు మహానాటకములకన్న అధికముగ విఖ్యాతి బడసినవి.

నేటి పాశ్చాత్యులకు నాట్యధర్మపద్ధతి సర్వసామాన్యమైనదిగాననే వారు తమ ప్రాచీన నాటకములను వీక్షించి యానందించగలుగుచున్నారు. లేకున్న గ్రీకునాటకముల జూచి ఆనందించుటకు వీరి కెట్లు సాధ్యమగును. ఉదాహరణముగ ఆంటిగాన్ (Anti gone) నాటకమును గైకొందము. ఈశతాబ్దపు ఇంగ్లీషువారికి ఆంటిగాన్ (Antigone) యొక్క విషమసమస్య ఎట్లు అవగాహనమగును? ఆసమస్యయే యర్థముగానిచో ఇక వా రెట్లు ఈటకప్రదర్శనమును జూచి ఆనందించగలరు? ఆంటిగాన్ అనుభవించు చిత్తక్షోభయు, మనోభావములును, హృదయావేదనయు, వెయ్యేల ఈ పాత్రయొక్క స్వభావ చిత్రీకరణమంతయు, ఆంటిగాన్‌కు సంభవించిన ఒక ప్రత్యేకవిషమస్థితిపై నాధారపడి యున్నది. అట్టి విషమసిథి నేడు పాశ్చాత్యులలో నెవ్వరికిని ఎన్నటికిని కలుగజాలదు. ఉత్తరక్రియలు సల్పలేకపోవుట హృదయవిదారణమగు నంశముగ నేటి ఆంగ్లేయుల కెప్పటికిని గన్పడదు. ఇక మృత సహోదరుని యుత్తరక్రియలు సల్పినయెడల రాజాజ్ఞ ధిక్కరించి స్వశిరఃఖండనమునకు గుఱియగుదునను దుర్భర సందర్భమునుగూడ నేటి పాశ్చాత్యు లూహించుకొనజాలరు. అట్టిచో ఈ నాటకము ఆధునిక పాశ్చాత్యుల హృదయముల నెట్లు కరగించగలదు? ఈప్రశ్నకు సమాధానము నాట్యధర్మమే. నాట్యధర్మదృష్టితో పరిశీలించినచో ఈవిషమసమస్య విచిత్రతను గోల్పోయి వ్యక్తిఇచ్ఛకును రాజ్యపదవీ శక్తికిని మధ్య సంభవించు పోరాట మను ఆధునికవిషమసమస్యగ పరిణమించును. ఆంటిగాన్ ఒక ప్రత్యేకవ్యక్తి గాక ఒక ప్రత్యేకభావమునకు ప్రతినిధిగ నేర్పడును. అట్టిభావ మర్థమగుట దుస్సాధ్యముగాదు. నేటికిని ప్రభుత్వాజ్ఞలెన్నియో మనఇచ్ఛానిచ్ఛలను ప్రతిరోధించుచు నేయున్నవి గాన ఆంటిగాన్ జీవితసమస్యయుగూడ ఆధునిక జీవితసమస్యల సామ్యమున అర్థమగును. ఈవిధముగ కొన్నికొన్ని కథాంశములు ప్రేక్షకుల జీవితముల కెట్టి సామ్యమును జెందక కొన్నిసందర్భములందు యాథార్థ్యమునకు విరుద్ధముగగూడ నుండినను నాట్యధర్మసాధనముచే నాటకరచయిత ఇట్టి కథాంశములనుగూడ హృదయ రంజకముగ ప్రదర్శించి, ప్రశంసనీయుడు కాగలడు.

నాటకకళకు రసమే ప్రధానమగు నంశము. రసహీనమైన నాటకమున కెన్ని ఉపకరణము లున్నను అది రాణించదు. రసవంతమైన నాటకమున కెన్నియో లోటు లుండజాలవు. కాననే ఏనాటకమైనను సరే అది నిజముగ రసవంతమే యైనచో అది దేశకాల పాత్రాదిభేదములనుగూడ చాలమట్టుకు మించి ప్రకాశించగలదు.

'ఏకవీర'[1]

ఆచంట జానకిరామ్

ఏకవీర ఒక గొప్పనవల—'ఒక విచిత్ర కథామంటపము'; దీనికి ఏకవీర, ఆమె భర్త కుట్టాన్, వీరభూపతి, అతని భార్య మీనాక్షి నాలుగు స్తంభాలు.

కథావస్తువు సృష్టి మొదలు నేటివరకు—మన హృదయాలలో ప్రేమ ఉన్నంత వరకు, మనలను వేధించే ప్రేమ సమస్య: ప్రేమ ముఖ్యమా? విధ్యుక్తధర్మము ముఖ్యమా? ఈ సమస్యచేతనే పైనలుగురను బాధించి, దీనివలననే వారికి తీరని ఆత్మ పరీక్ష, గొప్పనిగ్రహము, అందుబాటులో జయము—కాని, తుదకు భరించడానికి అలవికాని ఆశాభంగము కలిపించి విహరించినాడు కవి!

కథ జరిగిన స్థలము మధుర—యించుమించు తిరుమలనాయకుని కాలము. కాని ఎప్పుడైనా, ఎక్కడైనా, యిందులో చిత్రించిన విషయాలు శాశ్వతాలు. ప్రతిదినము మనయెదుట జరుగుతూవుండేవే. కుట్టాన్ సేతుపతిన్నీ వీరభూపతిన్నీ పరమమిత్రులు—వొకరిమీద వొకరికి గొప్పవిశ్వాసము. ఏవిధమైన దాపరికం లేదు—జీవనపుసమస్యలలో వొకరి కొకరు వింతగా బలము నిచ్చుకుంటూవుంటారు. కుట్టాన్ సేతుపతి, రామనాథపురపు యువరాజు, అదివరకే మీనాక్షిని ప్రేమించివున్నా, ఆమె తలిదండ్రులు సాధారణస్థితిమంతులు కాబట్టి తండ్రి ఆజ్ఞవల్ల కుట్టాన్‌కు ఏకవీర భార్య అవుతుంది. అతడున్నూ ధర్మబద్ధుడయి భార్య అయింది కాబట్టి ఏకవీరనే ప్రేమించాలని వ్యర్థయత్నాలు చేస్తాడు. చమత్కారం యేమిటంటే: అతడు తన నిజస్థితిని ఆమెకు వెల్లడిచేస్తాడు. చేసి, తాను కష్టపడి ఆమెను ప్రేమించుటకు ప్రయత్నిస్తానంటాడు! ఏకవీర సామాన్యురాలు కాదు. రాచకన్య, అందకత్తె, నవనీతమైన హృదయం కలది—భర్త తన్ను నిరసిస్తే, వోపికతో స్వామిప్రేమకు ప్రయత్నించి తుదకు నిరాశ పొంది, వొకానొకప్పుడు దూరాన్నుంచి తన్ను సమ్మోహింపజేసిన ఒక అందగాని రూపానికి మళ్ళా తన మానస వీథిని తావియ్య మొదలుపెటుతుంది. "తాను నిర్మించిన ప్రేమసౌధమునకు కుట్టాన్ తీసిన నిర్దయాద్వారమునుండి తన తొల్లిటివలపుకాడు ప్రవేశిస్తాడు."

1 రసతరంగిణి ౫. విశ్వనాథ సత్యనారాయణ, ఎమ్. ఏ., బందరు.

కాని, యీమధ్యలో, ఏకవీర ప్రేమించిన అజ్ఞాతప్రియుడు, వీరభూపతి_కుట్టాన్ ప్రాణస్నేహితుడు, తనకు లభింపని ఆమెకోసము తపించి తపించి చివరకు ఆమెమీద ప్రేమను దట్టమైన పితృభక్తి దొంతరల వెనుక దాచుకుంటాడు. తండ్రి అతనికి మీనాక్షిని పెండ్లిచేస్తాడు! మీనాక్షి దివ్యవ్యక్తి. ఆమె హృదయాన్నంతా కుట్టాన్ సేతుపతి! అధీనముచేసి, సర్వకాల సర్వావస్థలందు అతనినే ధ్యానిస్తూవున్న ఆమె పెండ్లిఅయిన మగనికి సేవజేస్తుంది, స్నేహ మిస్తుంది. కాని ప్రేమను, పవిత్రమైనదేహాన్ని పంచి యివ్వ లేకపోతుంది :

వీరభూపతి : కాళ్లు నొప్పిగా నున్నవి. సేవకుని పిలిచెదవా ?

భార్య : నేను పిసికెదను.

వీర : నన్ను నీవు ముట్టికొనెదవా ?

భార్య : సేవకభావములో దోషము లేదు. మీరు నాటి కల్లే మాటాడెదరు. ప్రభూ ! నాకు దానిపై నిచ్చలేదు. భార్యా భర్తృత్వ సంబంధమున కదియే ప్రధానమా ? నా మనస్సున కట్లు తోచుటలేదు. నే నేమి చేయుదును ?

పాపము! వీరభూపతికి రెండు దుఃఖాలు. తనను యించుమించుగా పిచ్చివానిగా చేసిన మొదటిప్రేమ. ఏదోవిధంగా ఆప్రేమను చంపుకొని, యీ క్రొత్తఆమెయందు ప్రేమ నిలపా లనుకుంటే ఆమెకు యీ ఖండితమైన విముఖత్వము. ఏమి చేయకలడు! తన అసహాయత్వాన్ని స్నేహితుడగు కుట్టాన్‌కు వెల్లడిస్తాడు. (ఈ ఘట్టము గొప్పది.)

వీరభూపతి భార్య తన మీనాక్షే అని తెలిసికొన్న కుట్టాన్—ధీరుడు—వొక్క విశ్వప్రయత్నంచేసి మీనాక్షిని తన చెల్లెలుగా మార్చేసుకుంటాడు. ఈ విచిత్ర పరిణామము అతనికి వింతబలా న్నిస్తుంది. ఆ నిమిషాన్నుంచి మీనాక్షికూడా తన భర్తనే ప్రియునిగా భావించి అతనిని అన్నివిధాల సంతోషింపజేసి తాను సంతోషించా లని పూనుకుంటుంది. కాని వీరభూపతి మాత్రం అంత సులువుగా పరిస్థితులను సమన్వయించుకోలేకపోతాడు. అతనికోసము వేయికళ్లతో నిరీక్షిస్తూవున్న భార్యాప్రేయసియొక్క యీ క్రొత్తప్రేమను అతను స్వీకరింపలేకపోతాడు—ఆమెకు దూరమవడానికి రాచకార్యాలను సాకుచేసుకుంటాడు. ఈవిధంగా, యింటికి రాకరాక, వొక రోజున అకస్మాత్తుగా వచ్చినపుడు, తన అంతఃపురములో అవతరించిన తన తొలిప్రేయసిని చూస్తాడు. ఆమె ఏకవీర! మీనాక్షీ ఏకవీరలు స్నేహితులు గనుక వీరింటికి వచ్చి, యిక్కడ కూచిపూడి భాగవతుల భాగవతం చూస్తూ తన్మయత్వం పొందిన ఏకవీర. ఇతన్ని తన మొదటిప్రియుణ్ణిగా గుర్తిస్తుంది_ఒకనిమిషము—వొక్క దివ్యమైన నిమిషము వీరు లోకాన్ని మరచిపోతారు.

'ఏ క వీ ర'

ఆమె యచ్చట, నత డచ్చట నేల యున్నారన్న యూహ పోలేదు. వీరభూపతి పరిష్వంగార్థము దగ్గర దగ్గరకు వచ్చుచుండెను. ఏకవీర చేతులు చాచుకొని నిలంబడినది. ఆమె యొడలెల్ల చెమ్మటపోసెను. ....వీరభూపతి కౌగిలించికోదగినంతదగ్గరకు వచ్చెను. ఆమె పాదములక్రింద భూమి యల్లలనాడెను. ....అత డామెను గాఢాతిగాఢముగా గౌగిలించికొనెను.......అత డామె పెదవిపై నొక్క ముద్దిడెను. ఆమె జిహ్వేంద్రియ మా ముద్దురుచి తెలిసికొనలేదు......అతని స్పర్శ యీసారి యామెలో నస్థిసంచయమునకుగూడ తాకినది. ఆమెకు హృదయసంచలమునందుమాత్రమే స్థితి. తక్కిన సర్వాణువులందు ప్రళయము.........మంచుగడ్డను కౌగిలించుకొన్నట్టుగా చైతన్యపు వేడి కానరాని యామె కౌగిలి వీరభూపతి కప్పుడు తెలిసినది. వెంటనే అతనికి ప్రబోధము కలిగినది.......

కాని, ఆమె కుట్టాన్ భార్య అని తెలిసికొన్నప్పుడు వీరభూపతికి పిడుగుపడినట్లవుతుంది. ఏకవీరలో గొప్ప మూర్ఛ వస్తుంది. ఒకవిధమైన ఆవేశం వచ్చి, వీధిలో పడి, అప్పుడే కాకతాళన్యాయంగా, మధురవీధుల్లో ప్రచారంచేస్తూవున్న క్రైస్తవ మిషనరీ డినోబిలిప్రయత్నాలకు అడ్డమగుతుంది. అతన్ని వాదనలో ఓడిస్తుంది. ఇదంతా ఆవేశపరమైన ఏకవీర. తర్వాత బేల అయిపోతుంది. అంతఃపురము జేర్పింపబడ్డాక తన నిజస్థితి అంతా తెలుసుకుని, తనకొరకు యుద్ధాలు జయించి తహతహలాడుతూ వస్తూవున్న కుట్టాన్ సేతుభూపతికి యేవిధమైన స్వాగత మివ్వకలదు? పవిత్రమైన ఆమె మనస్సులో తాను, తన మొదటిప్రియుని కౌగిలికి లొంగిన తాను, భర్తకు తగదు!

కుట్టాన్ కన్నులలో ప్రేమ కురిసినది. ఆమె కన్నులలో భయము విరిసినది. కుట్టాన్ మాటాడుద మనుకొన్నాడు. ఆమె పరాంగన కాదు. ఇదివరకే తన్ను ప్రేమించినది. తాను ప్రేమించలేకపోయినాడు. ఇప్పుడా ప్రేమ ముసురుకొనివచ్చినది. 'బాగుగ నున్నావా? ఏమి చేయుచుంటివి?' మొదలగు ప్రశ్నలకు తావు లేదు. తన ప్రేమకు తగిన దొక్కటియే. అది యొక గాఢపరిష్వంగము. తాను మాటాడలేకపోయినాడు. అతని కన్నులవెంట నీరు గిర్రున తిరిగెను. గొంతుకలో గాద్గద్య మేర్పడెను. ఏకవీర యతని నాగుమన్నది. అత డొకయడుగు ముందునకు వేసెను. ఏకవీర యానపెట్టినది. కుట్టాన్ నిలిచిపోయెను. ఏకవీర యేడ్చినది. కుట్టాన్ మరల నొక యడుగువేసెను. ఆమె తన్ను తాకవలదన్నది. తాకినచో చచ్చిపోయెద నన్నది............

ఏకవీర పారిపోతుంది. కుట్టాన్ ఆమెను వెంబడిస్తాడు.

కుట్టాన్ : ఎక్కడకు పోవుచుంటివి?

ఏకవీర : వైగైనదికి.

కుట్టాన్ : ఎందుకు?

ఏకవీర : నాయొడల మహాఘ మున్నది. అది కడిగివేయుటకు.

వైగైనది చూపుమేరలో వుండగా వీరి కెదురుగా ఒక సన్యాసి వస్తాడు. అతన్ని చూచి ఏకవీర కంపించిపోయి కన్నులు రెండు మూసుకొంటుంది. కుట్టాన్ ఆశ్చర్యపడి అతన్ని పలుకరిస్తాడు :

కుట్టాన్ : వీరా ! ఇది యేమి ?

సన్యాసి తలయెత్తెను. ఎదుట గుట్టానును చూచెను. వీరభూపతి కన్నులలో బాష్పము లేర్పడబోయి వెనుకకు మరల్పబడెను. కుట్టానున కనేకములగు నూహాలు తోచెను. తన మీనాక్షిప్రేమ యితని సన్యాసమునకు గారణ మనుకొని,

'స్థానాపతీ! క్షమించలేకపోతివి !'

అన్నా డతడు, వీరభూపతి కన్నులలో జాలి పొడసూపెను.

ఇంతట్లోకి ఏకవీర నీటిపొర జేరుతుంది. కుట్టాన్‌కు కోపం వస్తుంది.

'అడుగు వైచితివా, నిన్ను బలవంతముగ నింటికి దీసికొనిపోదును' అని అతనిలో వున్న భర్త శాసిస్తాడు! "ఏకవీర కదలదు. వీరభూపతి, తనప్రేమ, దాని విచిత్రపరిణామము పూసగ్రుచ్చినట్లు చెప్పెను. తన దేహములో నున్న ప్రతియణువు వీరభూపతిస్పర్శ మనుభవించుచున్నదని చెప్పెను. అది యింకొక విజాతీయస్పర్శ తాళుకోలేద నెను "!!

ఏకవీర విచిత్రంగా ప్రశ్నిస్తుంది : "మీారు నన్నింకను ప్రేమింతురా."

ఆమె పెదవులసందునుండి యొక సన్ననినవ్వు వినంబడెను. తపస్వియైన కుట్టాన్ తా నామెను ప్రేమించుచున్నా నన్న సంగతి చెప్పలేదు. అతడు ప్రేమచే కదలిపోయెను. ప్రేమప్రవాహ మతనిపై విఱుచుకొని పడినది !

కాని, పాపము! అతనికి దక్కినది నిర్జీవియైన ఏకవీరయే. మీనాక్షి సంగతి మనకు తెలియదు.

కవి మన జీవితాలకు ఆయువుపట్టయిన ప్రేమవిషయాన్ని తీసుకొని పూర్వపు సాంప్రదాయలతో మిక్కిలి ఆధునికంగా చర్చించి, చక్కని కథను నడిపించారు. సమయానుకూలంగా కథపట్టుకు రక్తికలిగేట్టుగా స్థలవర్ణనలు, చారిత్రవర్ణనలు, శిల్పవర్ణనలు, చివరకు సాహిత్యంలోవి, అలంకారశాస్త్రంలోవి, భరతశాస్త్రంలోవి విశేషాలు కొన్ని, కుప్పించి గొప్పకలంతో వ్రాశారు. ఒకచిత్రము : వీరు తమ వ్యక్తుల మనోభావాలను, వారి అనుభవాలను వర్ణించేటప్పుడు పదేపదే వారి కంటివెంట నీరు తెప్పిస్తారు. వీరి నాయికానాయకులు యిట్టే యేడుస్తారు. కాని, ఆ మాటకొస్తే, కొన్ని సన్నివేశాలు అనుభవిస్తూవుండే మనకుకూడా అక్షరాలు నీటితెరలోంచే కనబడతాయి !

గ్రంథమంతా కవి 'సులభశైలినే' వ్రాశారు; కాని, వీరు వొకమోస్తరు గ్రాంథికభాషలో వ్రాయకుండా, యీరోజుల్లో ఎక్కువ అమలులోనికి వస్తూవున్న, మనం అందరము మాట్లాడుకునే, ఆలోచించుకునే, అనుభవించే సజీవమైన వాడుకభాషలో వ్రాస్తే గ్రంథము మన హృదయాలకు మరింతదగ్గరగా పదింతలు గొప్పగా వుండేది. వాక్యాలు యిప్పటివలె విడివిడిగావుండకుండా వొకదానిలోనికి వొకటి దొర్లిపోయి కలసిపోయి, వొకజిగి యేర్పడేది. అయితే, వీరు యించుమించు పూర్వపుభాషను వాడడానికి కారణా లుండవచ్చును. ముఖ్యంగా వీరికి సంస్కృతభాషమీద ఆపేక్ష కావచ్చును. అనేకములైన ఉపమానాలతోటీ, అలంకారాలతోటి విరాజిల్లుతూవున్న గ్రంథానికి యిప్పటి వాడుకభాష యింకా మన స్తృప్తికరంగా పనికి రాకపోవచ్చును.

ఉపమానాలు వింతవింతవి.

వైగైనది యిసుకతిన్నెలను వర్ణిస్తూ, 'ఇసుకతిన్నెలు మొగలిపుప్పొళ్లు చల్లి సిద్ధముచేసిన విశ్రాంతిస్థలమువలె నుండెను' అన్నారు.

ఆకాశమున తెల్లనిమేఘములు గాలికి కదలు దోమతెరలవలె కదలజొచ్చెను.

ఒత్తుగా పరచిన మల్లెపూవులలో నేకవీర గోధుమవన్నె త్రాచువలె ముడుచుకొని పండుకొన్నది.

కనులలో నిండుప గింజలంత బాష్పములు నిలిచినవి.

ఆమె యందే వాడిపోయిన మందారమువలె మంచమున కంటుకొనిపోయి యున్నది.

...సన్నని నీటిపాయలలోని చిఱుకెరటములు త్రాచుపాముపిల్లలవలె నొడ్డునకు కొట్టుకొనుచు వచ్చుచుండెను.

కుట్టాన్ప్రేమ ఏకవీరవైపు పూర్తిగా మరలిపోవుటకు అతడు గడువుపెట్టినాడు. ఆమె రోజులు లెక్కించుకొంటుంది. రెండవసంవత్సర ప్రారంభమునందు అతడు అంతఃపురంలోకి వెళతాడు. "గదిలో గోడమీద ఎర్రనిబొట్లు రెండు నెత్తురులు చిమ్మినవి. అప్పుడే రెండవ సంవత్సరము గుర్తుపెట్టిన ఏకవీర చేతికైన నూనె కలిపిన కుంకుమవర్ణమతని హృదయమునుండి యామె నెత్తురును తీసిన ట్లతనికి తోచెను."

ఒకచోట అద్భుతమైన ఉత్ప్రేక్ష.

...'కస్తూరియు పునుగును నలందబడియున్నవి. ఆవాసన లిల్లంతయు గ్రమ్మివేసినవి. ఆవాసనలచేత దీపము పోవునేమో యనుకొంటిని.' (!)

ఇంకను ఉపమానాలు :

ఆమె పుష్యమాసపు నదివలె పుష్టయు గాక, యెండుచేత గోధుమవన్నెగలదియు గాక, కొబ్బరినీళ్ల వలె నతిశబలయు గాక, యిప్పుడే వికసించి సంపూర్ణశోభతో చెలువారని, పూర్తిగా వదలిపోయి శోభాహీనము గాని నవమల్లికవలె ప్రకాశించినది. ఆమె నిటాలమున కస్తురిబొట్టు సెగకన్నుగా, తలపై రావిరేక చంద్రవంకగా, నిటాలస్వేదబిందువు శిరఃస్థగాంగఝురము చెమ్మగా, నామె పార్వతివలె ప్రకాశించినది.

ఈ సంప్రదాయాలు పూర్తిగా ప్రబంధవైఖరి నున్నవి. సంస్కృతభాషతో కలసి వున్న వీరి వర్ణనలకంటె చక్కని తెలుగువర్ణనలు హాయి నిస్తాయి.

చిన్నతుప్పర మొదలుపెట్టెను. పిల్లలేచి చూరుదాక పోయి తనచేతులు వానలో చాచి చేతులు తడిసిన తరువాత రెండు చేతులు మొగమున రాచుకొనెను. బండివానిని చూచి నవ్వెను.

'వడగళ్లకై వెదకులాడి యొక చప్పనివడగల్లు నోట వైచుకొని పిల్లలు తమకు తగిలిన దెబ్బలు మరచిపోవుచుండిరి!' అని వ్రాసి తర్వాత వర్ణించారు:

...శిశిరచంద్రజ్యోత్స్నకలహాంతరితవోలె జలదాంతర్నిగూఢబామ్మరైౖ విముఖకా, మొగలిపొట్టలలో నీరు నిలిచి ఖండిత సజలదీర్ఘసితాపాంగభ్రాంతి కల్పింప, రాజహంసి భీతయై ప్రోషితభర్తృకవలె తామరతీగ గొడుగాకుక్రింద తల దాచుకొనగా, నెమ్మి పురి విప్పి స్వాధీనపతికవలె నృత్యాభిరామమూర్తికా, మందార పూవును వదలి రాలేక రాలేక వచ్చిన తుమ్మెదయెడ గన్నేరు ఈర్ష్యాకషాయితకా, వాసకసజ్జికవోలె నలంకరించుకొని కడిమి మేఘనాథునకు స్వాగతము పూన, బలాకాపాంగ మేఘనీలపటపరివృత యాకాశలక్ష్మి కాల పురుషుని నభిసరించి, విప్రలబ్ధాకృశీభూతదేహయష్టివలె శోక మానుపై మొవ్వువోలె ఆకులవెంట కన్నీరు గార్చ వర్షాశ్రీ సర్వరసాకృతివలె మోహనాతిమోహన మయ్యెను.

గంభీరము; కాని, ఆడంబరము. ఈవర్ణనకు పద్యకావ్యమందు స్థానము. కాని, కేవలము మానవప్రకృతులను గురించియున్న యీ వచనకావ్యంలో అంత చోటు లేదు.

మానవప్రకృతులను తేటతెల్లంగా మన ముందర పెట్టగల గొప్పశక్తి వుంది వీరికి. మొట్టమొదట కుట్టాక్ వీరభూపతుల ఆంతరంగికమైన అన్యోన్యమును తెలుపుతూ, స్నేహితులంటే వీరే సుమా అనిపిస్తారు: "కుట్టాక్ కుడిచేయి వీరభూపతి కుడిచేతిని పట్టుకొనియున్నది. కుట్టాక్ వీరభూపతిచేయి నొక్కినాడు. కుట్టాక్ దేహ మంతయు వణకిపోయినది. ఆచీకటిలో వీరభూపతి కుట్టాక్ దురవస్థ కనులార చూచుచునే యున్నాడు!......'నీ భార్యను నీవు ప్రేమింతునని వాగ్దాన మిమ్ము'" అని మరీమరీ వొప్పించే వీరభూపతిమాటలవల్ల కుట్టాక్ అర్భకు డైపోతాడు. ఏడుస్తాడు.

'ఏ క వీ ర'

వీరభూపతి తన యుత్తరీయపుకొంగుతో కుట్టాన్ కన్నీళ్లు తుడిచెను. వీరభూపతి మరల 'ఏమీ వాగ్దానము చేసెదవా! అది నీ మేలుకోసమే చెప్పుచున్నాను. నీయందు నాకుగల స్నేహము నీవలన నీ వాగ్దానము తప్పక పుచ్చుకొమ్మని నన్ను వేధించుచున్నది. ఇకముందు నీ భార్యతో నీవు సరిగా నుండుమని నా చేతిలో చేయి వేయుము!......నాకీ వాగ్దాన మిచ్చిన గాని నే నిందుండి లేవను' అని వీరభూపతి కుట్టాన్ పాదములపై బడుటకు సంసిద్ధుడైనాడు. కుట్టాన్ తొట్రుపాటు నంది, 'వీరా! ఎంత మంచివాడవు! ఇన్నాళ్లనుండి యేమో పట్టిస్నేహితుడవనుకొంటిని గాని నేను నీవుగా నూహించుకొనునంతటి ప్రేమ నాయందు నీ కున్నదని తెలిసికొనలేకపోతిని.'

ఇట్లే మిక్కిలి ఆప్యాయమైన సంభాషణలు. కొన్ని గొప్ప 'ఆత్మగతాలు'న్నూ కుట్టాన్ తన తల్లిని చూడడానికి వెళతాడు. ఆమె అనురాగంతో కొడుకు కోడళ్లకు గల ప్రేమగురించి ప్రశ్నించి కొంత తెలుసుకొంటుంది. కుట్టాన్ అనుకుంటాడు:

'అందఱును ఏకవీరను ప్రేమించు మనుచున్నారు. వీరభూపతి అదేమాట. ఇచ్చట వచ్చిన తల్లియు నదేమాట. ఇందులో నేదో రహస్య మున్నది. నేను ప్రేమించిన స్త్రీని వదలిపెట్టి బలవంతముగా నా మెడకు కట్టిన స్త్రీని నా ప్రేమించవలె? నా కర్థమగుటలేదు. ప్రేమించుట, ప్రేమించకపోవుట యనునది నా స్వాధీనములో నున్నదా? ఎవరి స్వాధీనములో నున్నది. భగవంతుని స్వాధీనములో నున్నది. ఏ భగవంతుని స్వాధీనములో నిది యున్నదో ఆ భగవంతుడే నాకీ స్త్రీని తెచ్చి పెండ్లిచేసెను కదా! భగవంతుడు కాదు. నా తండ్రి చేసినాడు. భగవంతుని యిచ్చ లేనిది నాతండ్రి యెవరు చేయుటకు? ఈ స్త్రీకిని నాకును సంబంధ మేమున్నది? ఏమియు లేకున్న మే మిరువురము భార్యాభర్తలుగా చేయబడుట యెట్లు? పూర్వజన్మములలో నే సంబంధ మున్నదో!'

కుట్టాన్‌లోని—అంతే కాదు—యీ యుగసంధిలో బాధ నొందుతూవున్న అనేక యువకహృదయాలలోని, అంతరంగయుద్ధమంతా పైమాటలలో యిమిడ్చినారు!

మనోభావాలను చేష్టలవల్ల వర్ణిస్తారు కొన్నిచోట్ల:

బండిలో కూర్చున్న మీనాక్షి కన్నులలో వీరభూపతి యాడినాడు. ఎఱ్ఱనిమానిసి. శాంతమైన వదనము.........చక్కనికన్నులు. ఎప్పుడు నవ్వుచున్న మొగము. మీనాక్షి తా గప్పుకొన్న బంగారు పూవులుగల తెల్లని పట్టుశేలువలోపల రెండుచేతులు ప్రక్కల కదుముకొని కన్నులు మూసికొని బండిలో నొకవైపున కొదిగి కూర్చున్నది. రంయిమని చల్లనిగాలి తెరలసందుగా లోనికి దూరినది. మీనాక్షి కన్నులు మరింత మూసికొని, నక్కినక్కి మూలమూల కొదిగియొదిగి కూర్చున్నది.

వీరభూపతి ఆమె కంత అవసరమైనాడు. అతడు దగ్గరలేమి ఆమె నంత అసహాయగ చేసినది.

ఉదయిని

కవికి మెక్కువగా పాశ్చాత్యసాహిత్యాలతో పరిచయము కలదనిన్నీ, వానిలో కొన్ని గొప్పతనాలను వీరు తమవిగా జేసుకొన్నారనీ బాగుగా కనబడుతుంది. మోహములేని ప్రేమ, కామేచ్ఛలేని భార్యాభర్తల సంబంధము, యీ గ్రంథములో చూపినంత అందముగ యిదివరకు ఎవరు వ్రాసిన తెనుగునవలలోను లేదని చెప్పవచ్చును.

ఏకవీర మహాప్రబంధ మనవలెను. ప్రేమసంబంధమైన కథ అయినా, వీరరసము ఉప్పతిల్లుతూవుంటుంది. నలుగురూ వీరులే—జితేంద్రియులైన వీరులు! కొంతవరకు అంతరంగయుద్ధము. తగిలిన గాయములు ఒకరికి చూపించుకొని గర్వింపతగ్గవి కావు. అనుభవించక తప్పదు. నలుగురున్నూ జయము పొందినారు !!

రసతరంగిణివారి యీ ఐదవ కెరటము మన భాషాప్రవాహాన్ని చాలదూరము తీసుకుపోతుంది.

విద్యార్థి

కొంపెల్ల జనార్దనరావు

[రూపవతి, ఆజ్ మల్.]

ఆజ్ మల్.— అడుగో అక్కడ, ఆ యుద్ధఘోషలో మునిగి తేలుతున్నాడు.

రూపవతి.— సౌందర్యము నిగ్గులు తెలిసినవాడు, తన కళాచాతురికి ఆటపట్ట ంన నన్ను వదలి యీ వికారవుసన్నివేశము రుచిగా చూచుకొన్నాడేమి? విద్యార్థీ!

ఆజ్ మల్.— సౌందర్యము నిగ్గులు తెలిసినవాడు కనుక. ఆతని దిద్దుబాటు రిస్తూ నిష్క్రియవై నిలిచే నీవు ఈదృశ్యముతో సరివస్తావా?

రూపవతి.— దీని కొక శ్రుతియా, రేఖయా—ఏ మున్నది?. ఇది ప్రళయ ాయము. సౌందర్యము కొల్లపోయే స్థితి కాదూ ఇది?

ఆజ్ మల్.— అవు నాతడు దానిని ఉద్ధరిస్తాడు.

రూపవతి.— నే నీ యేడుపులో, భయములో నీరు విచ్చుతుండగా ఆతడు న్ను మరింత వేధిస్తున్నవాడు సౌందర్యం ఏమి ఉద్ధరిస్తాడు! నే నాతని భావాలకు ఉత్తే న మిచ్చి, ఆతని కళావిలాసాన్ని పొంగులెత్తించిన ప్రేమసీమను, నన్ను వదలి ఆతడు ందర్యదూరుడు కాదా అవుతున్నాడు?

ఆజ్ మల్.— నీవు ధన్యురాలవు—ఇది దూరసౌందర్యములే!

రూపవతి.— మీ రిద్దరు కలిసి హిందూమహమ్మదీయుల, రెండు మతాల, ండు జాతుల మైత్రిని పరిపక్వముచేసి ఒక్క జాతిని సృష్టించుకొన్న సౌందర్యాన్ని ాలో ప్రతిష్ఠించుకొన్నారు సరే. కాని యీ వైషమ్యాలలో, కుట్రలలో, దుండ ాలలో విప్లవించిన యీ అర్థములేని ఘోషలో ఒడలు మరవడంలో ఏమి ప్రయోజన ున్నది? ఒక సౌందర్యప్రవాహాన్ని, ఈ మధురమైన జీవితగతిని భంగపరచడం ఎందు ని? నే నీతని తీసుకపోతాను!

ఆజ్ మల్.— ఈ ఘోషకై వెదుకుకొని పోలేదు విద్యార్థి. మా యిరువురి క్యములో సౌందర్యమే ఉంటే ఇందరి ఐక్యం ఎంత అపేక్షణీయం! ఈ వైషమ్యాలు, ండగాలు, కుట్రలు—ఇవి ఉన్నవి నిజమే: ఈవైరమే ఒక దివ్యమైనస్థితి లేవకుండా

భంగపరుస్తున్నది: అది తొలగించడానికే అతడు అవసరము: అది తొలగించడం ఆ సౌందర్యానికి అవసరం. ఈఘోషకై వెదుకుకొని పోలేదు విద్యార్థి! ఈ వికారపు సన్నివేశమే ఆతని వెదుకుతున్నది, అతని స్పర్శకై తడవుతున్నది. సౌందర్యము నిగ్గు లెరిగిన ఆత డిది యేలాగున ఓర్వగలడు?

రూపవతి.— జగమంతటా వికారాలే. చేతనైన సౌందర్యము రచించుకొని భోగించక యిది యేమిటి? తాను అనుసరిస్తున్న కోవను తెంపి, దీని కాత డంత కావలెనా! ఆతనివల్ల ఏమవుతుంది? నే నిది భరించలేను. నే నీతని తీసుకపోతాను—విద్యార్థీ!

ఆజ్మల్.— ఆత డీ ఘోషను వెదుకుకొని రాలేదు. తనను చుట్టుకోవచ్చిన యీ వికారమునుండి అతడు పారిపోవలెనా? ఆతడు జడజీవి కాడు. ఆతని సౌందర్యము ప్రళయతాండవమందలి బిందువును కోరేది. మహాత్ముడు భారతదేశాన్ని వదలి పోలేదు. ఈతడు వెనుదిరిగి ఒక అంగకము లోపింపజేసి, మరీ వికృత మేలాగు చేయగలడు ఈ దీనమైన సన్నివేశాన్ని?

రూపవతి.— మరి నామాట యేమిటి? నా యీ స్వప్నసౌధాన్ని భంగపరచి, రక్తాలు చీకట్లు చిమ్మే ఖండజీవితం నాకు మిగిల్చి, తన ప్రాణము పోయి ఏమి సాధించినట్టు? నేను తీసుకపోవలెనోయీ! విద్యార్థీ! ఆతని నింత అపేక్షించే నాగతి యేమిటి!

ఆజ్మల్.— నీవు శాశ్వతముగా బ్రతుకు. సౌందర్యఖనివి—జీవితములో వైవిధ్యము, ఈ ఆహ్వానముపట్ల వైరుధ్యము చూచి బెదరే నీ చిన్నారిసోయగము దాచుకొని దైవికాలకు దుఃఖించి పోషించుకో!

రూపవతి.— నే నీ కత్తులు భరించలేను. పోనీ నన్నాతడు రానీయడే: నే నేమి చేయను? ఆతడు లేనిదే భూమిమీద నా కింక సౌందర్య మేమిటి? నే నాతని తీసుకపోవలెనోయి—విద్యార్థీ! పలక వేమి బాబూ!

ఆజ్మల్.— విరిగిపడుతున్నారు ఆతని గుంపువంకకే భూతకోటి. భూమే ముక్కలయి తరగెత్తి వస్తున్నది.

రూపవతి.— విద్యార్థీ!—నన్ను చూచికూడా ఆవంకకే పరుగిడుతున్నాడు—డేగవలె, సర్పమువలె, విజయధ్వజమువలె. మరీ దూరమైపోతున్నాడు విద్యార్థి!

ఆజ్మల్.— ఆ సముద్రము పిలుస్తున్నది, ముంచెత్తుతున్నది. కత్తులు, కర్రలు—రక్తము, మంటలు. వీరి పెనుబొబ్బలు గాలినికంటె ఈ కళవళము కళ్లను ముందు చీలుస్తున్నది.

రూపవతి.— నే నిది చూడలేను. ఒక్కక్షణములో కనబడ్డది యింకొక క్షణానికి చీల్చుకపోతున్నది. ఈ ప్రళయములో నా విద్యార్థి ఉరుకుతా డేమి? ఇది నేను చూడలేను! విద్యార్థీ!—ఇంక లాభము లేదు. నామెలుగు వినబడదు. నే నిది చూడలేను.

ఆజ్మల్.— నీవు చూడలేవమ్మా! ఉపాసకుడు లేనిదే నిలవజాలని సౌందర్యానివి నీవు: ఇది చూడలేవు. ఇది చైతన్యము నంతా విద్ధముచేయగల సౌందర్యోపాసన: సౌందర్యప్రతిరావము. ఇది నీ అచలసౌందర్యానికి విరుద్ధమై, నిన్ను స్థిరగతిని పాటించిన మనస్సులో ప్రవహించి దానిని లోగొనవచ్చిన ద్రవ్యాల సంఘట్టము! నీ వేమి భరించినావు పో! నీవు దూరముకా—ఈ ఆవేశము నిన్ను పడనేసి పోతుంది!

రూపవతి.— ఇదేమి నీ వింత సివమెత్తుతున్నావు—నన్ను భయపెట్టకోయీ! నా కళ్లలో రక్తాలు చిమ్ముతున్నవి. నా జీవనాళాలు తెగుతున్నవి!

ఆజ్మల్.— నీకై నేనూ ఏడ్వగలను. కాని నీవు విద్యార్థికై ఏడ్చి లాభము లేదు.

రూపవతి.— మరి నన్ను రానీయ రేమి? నేను నా విద్యార్థికి తోడుపోతాను.

ఆజ్మల్.— నీ విందు చొరనూలేవు. ఇది నీకు కాదు. ఇది మహాభయంకరమైనది. నీ కిందు లొంగేది లేదు. నీవు వీరికై చచ్చి లాభము లేదు.

రూపవతి.— అయ్యో! నన్ను భయపెట్టకోయీ! నీవు నా విద్యార్థికి తోడుపో. నన్ను ఇల్లు చేర్చండి!

ఆజ్మల్.— ఇ ళ్లెక్కడ? ఇళ్లు తగులపడ్డవి. తిరిగి నిర్మించవలె ఇళ్లు. ఇళ్లలో జీవము జారింది. జీవము పోసి కట్టవలె ఇళ్లు.

రూపవతి.— నన్ను రానీ—నేను విద్యార్థిని విడవలేను. నేను పోలేను పోలేను. జీవము జారి సగము విరిగిన నాసౌధము నేను చూడలేను. నాగతి యేమిటి?

ఆజ్మల్.— ఒక ఉపాసనలో వచ్చి కళామూర్తులు మీ రిద్దరు కలిసినారు సరే. అతనిని అనుసరించడమే నీ పని కాదు. నీవు పో. నీ విక్కడ ఆగలేవు. నీ వీ జనముకై చచ్చి లాభము లేదు. అడుగో నీ విద్యార్థిని చూచి పో—ఇదుగో!

రూపవతి.— అమ్మో—ఈ దృశ్య మేమిటి! నే నిది భరించలేను: నా బ్రదుకు: నా విద్యార్థి! నన్ను రానీయరు: నాగతి యేమిటి?

[కొందరు మనుషులు పరుగెత్తుకవస్తారు. చంటిపిల్లలతో ఇద్దరు ముగ్గరు స్త్రీలున్న. రూపవతి వారిలో చిక్కకొంటుంది. అందరూ పారిపోతారు.]

ఆజ్‌మల్.— పోండి పోండి పాపం మీారందరు.

రూపవతి (లోపలనుండి).— ఆజ్‌మల్ !

ఆజ్‌మల్.—భయం లేదు! పో! రాలేవు, పో !—విద్యార్థి నెత్తురులు కక్కతున్నాడు ఒడలినుండి, నోటినుండి—ఒకచోట నేమిటి !–ఆధ్వని ఆతని తలపయినే ! నెత్తురులా మంటలా అవి ! మంటలలో ఆతను దుమికినాడా, అతని ఒడల వెడలిన మంటలా అవి ! ఆతడు హిందూమతపతాకలా ఎఱ్ఱనై రోదసిలో తాండవిస్తున్నాడు. నే నది కౌగిలించవలె. హృదయాన ధరించవలె. ఆతని తలపై చంద్రవంక చిందింది. ఈతడు నా విజయపతాక ! నా ధర్మపతాక ! మానవకోటికి ఆశీఃపతాక ! వీరి శివమూర్తిని ఊహించగలను ! మరి నా కీ నరాలు సడలుతున్న వేమి ?—ఎందరిరక్షకై ఆతడు విస్తరిల్లుతున్నాడు ! ఆతని రక్షలో సర్వము ఉపాధులు భద్రపరుచుకో పరుగిడుతున్నది! ఈ శకలాల, అవయవాల, స్వరాల ఐక్యములో మేళమై పరచిన యీా చైతన్యము నాలో మనస్సు పొంగిస్తున్నది ; ఆనందము కాబోలు పొంగివస్తున్నది. ఆతనితో వాదించిన నేను నేర్చినాను కాబోలు ఈ సౌందర్యము. ఆతడు సౌందర్యమై నాకు తన్ను నేర్పుతున్నాడు—దౌర్బల్యము కట్లు తెంపి. తెలిసింది స్వామీా నీ తాండవము ! జడసౌందర్యమునుండి పెరిగివచ్చిన నే నిది ఆస్వాదిస్తాను : ఈ కృత్స్న సౌందర్యలీలలో నేనూ లీనమౌతాను !—ఏడి నా విద్యార్థి !—ఓహో, విద్యార్థి ఆత్మకు ఈ శరీరము చాలలేదు—ఆతడు విడివడుతున్నాడు ! ఏడి నా విద్యార్థి ! నా విద్యార్థి యేడీ !

[పరుగిడిపోతాడు.]

[కొందరు పౌరులు అటునుండే పరుగిడుతూ వస్తారు.]

మొదటి పౌరుడు.— ఈత డెవరు ? విద్యార్థివలె ఈత డెవరు ?

రెండవ పౌరుడు.— ఈత డెవరో మహమ్మదీయుడు మనల నందరినీ కాపాడుతున్నాడు, తనవారినే కాక.

మొదటి పౌరుడు.— అందరూ తనవారే అతనికి.

మూడవ పౌరుడు.— విద్యార్థి యీా సదమదములో ఉన్నాడా ?

మొదటి పౌరుడు.— లేడు. ఆతడు కడతేరినాడు. ఈత డవతరించినాడు.

రెండవ పౌరుడు.— రండి మనము పోదాము.

[పరుగిడతాడు.]

[ఆజ్ మల్ వస్తాడు, ఇద్దరు గాయపడ్డవారిని తీసుకొని.]

ఆజ్ మల్.— మీరు కదలండి. ఈ గోడమాటు మీకు చాలదు.

[గాయపడ్డవారిని తీసుకొని అందరూ త్వరగా వెళ్లిపోతారు.]

వీధి బడ్డ దుర్బలజనానికి రక్ష లేదు. మీరు పొండి!—ఇంకా ఈజనము పోరాడ తా రేమి? విద్యార్థి ఆత్మ వీరిపై విచ్చినది. ఆశక్తి వీరిలో ఆవహించ దేమి? నే నొక్కడ నేనా యీ ఐక్యానికి నోచుకొన్నది? వీ రెప్పు డింక చూచేరు?

[పరుగు.]

[మొదటి పౌరుడు మళ్లీ వస్తాడు.]

మొదటి పౌరుడు.— ఈత డేమి రోదసి నిండి యీ వీరవిహారము! మందరము లాగ, మేరువులాగ—నేను నిన్ను చూడలేకున్నానోయి!— ఈతడు తప్పించినవారు తమలో తామే చంపుకొంటున్నారు: అయ్యో!—

[గాఢముగా గాయపడ్డ ఆజ్ మల్, మరికొందరు.]

అయ్యో! నేను నిన్ను చూడలేకున్నానోయి!

నాలుగవ పౌరుడు.— ఎవరీ వింతమనిషి!

ఐదవ పౌరుడు.— పాపం ఒడలంతా గాయాలు, కాల్పులు. ఏమి చేయవలె? ఎవరో ఈతడు?

ఆజ్ మల్.— నేను విద్యార్థిని.

నాలుగవ పౌరుడు.— విద్యార్థిని నేను రక్తాలలో మంటలలో చూచేను.

మొదటి పౌరుడు.— విద్యార్థి కడతేరినాడు. ఈత డెవరో మహానుభావుడు.

ఆజ్ మల్.— నేను విద్యార్థిని!

మొదటి పౌరుడు.— అయ్యో! ఈతడు స్మృతి తప్పి పలవిస్తున్నాడు. ఇత నింక బ్రదుకడు కాబోలు. ఇతడు చావగా మనము ప్రాణాలు తప్పించుకొని పోవలె— అంతమంది ఆసంకులములో నలిగిపోతున్నారు! ఇత డింక బ్రతుకడు—విద్యార్థివలెనే.

ఆజ్ మల్.— అయ్యో వీరు నమ్మ రేమి. నేను విద్యార్థిని!

మొదటి పౌరుడు.— అయ్యో! ఏడవనా? నవ్వనా? విద్యార్థి చనిపోయినా డనుకున్నాము: ఈతడు తాను విద్యార్థి నంటాడు.

నాలుగవ పౌరుడు.— నమ్మవలెనా? మహమ్మదీయ వేషములో నీవు విద్యార్థి వేమిటి నాయనా!

ఆజ్మల్.— అయ్యో వీరి కింత నమ్మకాలు లే వేమి! ఈ జనముకై బ్రతికి లాభము లేదు కాబోలు! బ్రతికి లాభము లేదు కాబోలు!

[మృతి.]

మొదటి పౌరుడు.— బ్రదికి లాభము లేదూ?— ఈ జనముకై బ్రదికి లాభము లేదూ? ఈ విడివడ్డప్రశ్న రోదసి నిండి కనబడుతున్నది నాకు!

27/10/76 1-30 2-15 PM

శేషమ్మ—A STUDY

'చలం'

శేషమ్మకి యీలోకంలో ఏమాత్రమూ ఆనందమూ సౌందర్యమూ కనపడడం మానేసి ముప్ఫైయేళ్లయింది. ఇతరులు నవ్వుతున్నా, తింటున్నా, పాడుతున్నా, ఆమెకి విచారమో లేక అసహ్యమో కలుగుతుంది. పిట్టల కూతలూ, పిల్లల నవ్వులుకూడా ఆమెని 'ఇరిటేట్' చేస్తున్నాయి.

"పాడుపిట్టలు—పని లేదు వీటికి. వెధవ అరుపులూ, గోలలూ. అంతకన్న చస్తే నేం?"

ఆమెకి ప్రపంచం దుఃఖమయం, పాపభూయిష్ఠం, అపవిత్రం. దీన్నంతా విడిచి పోవాలని, మృత్యువుని తలుచుకుని అందరూ వినేట్టుగా ఆహ్వానిస్తోవుంటుంది. "ఆ యీశ్వరుడు యెప్పుడు దయతలుస్తాడో, యెప్పుడు పిలిపించుకుంటాడో, యీ నరకం లోంచి నన్ను!"

ఆ యీశ్వరుడు తన తండ్రిలాగూ, తనని భూలోకమనే అత్తవారింటికి పంపినట్టూ మాట్టాడుతుంది. నాలుగేళ్లక్రిందట కలరా తగిలినప్పుడుమాత్రం—

"ఒరే, చస్తానురా, చస్తానురా. డాక్ట రేమన్నాడూ? ఆస్పత్రి పెద్దడాక్టర్ని పిలుచుకురా. ఆపెరుగు తోడుకుందో లేదో చూచావులే. మాఅమ్మ యెనభైయేళ్లు బతికిందిరా. ఇంత చిన్నదాన్ని నా కప్పుడే యేంచావు? అవునులే. ఈ ముసిసి ముండ చస్తే ఎవరి కేం? అందరికీ పీడ విరగడై పోతుంది." అంది మళ్లీ.

ఆమెమొహాన నవ్వు చూసినవా ళ్లెవరూ లేరు. చిన్నపిల్లలు గంతులేస్తోవుంటే, "ఈగంతు లెన్నాళ్లు? మీ కాళ్లు విరగా. ఇదేం పోయేకాలంరా. సరిగా కూచుని యేడవలేరూ?" అన్నట్టు చూస్తుంది. ఎంత విచారంగా కనపడితే, యీలోకంమీద, యీమాయమీద ఎంత అసహ్యం కనపరిస్తే, ఎంత సౌందర్యాన్ని ద్వేషిస్తే యీశ్వరుడికి అంత సన్నిహితురాలూ, ప్రియతమురాలూ ఐవుంటుంది. ఈలోకంలో తనవంటి సన్మార్గులకు కష్టాలుతప్ప యింకేమీ లేవు కనక సుఖపడేవాళ్లంతా దుర్మార్గులే ఐవుండాలి. తను కష్టాలకోసం ఎంత ప్రయత్నించి ఏరుకుంటుందో ఆమెకి తెలీదు.

"అదేమిటీ ఆకామాక్షి అట్లా పాడుతోవుంటుంది యెప్పుడూ! దేన్ని చూసు కునీ ఆ బోర్లపాటు! ఆ మొగుడివుద్యోగం వూడితే తెలుస్తుంది, అమ్మగారి అదిరి పాటు!"

ఆమెని "యెట్లా వున్నా రమ్మా!" అని అడిగితే యెప్పుడూ "బాగానే వున్నా" నని అనలేదు. అసలు యీదేశంలో ఆమాట అనేవాళ్లే తక్కువ. నిజంగా బాగా వుండేవాళ్లే తక్కువ. బాగా వున్నా కూడా, బాగా వున్నామని తెలుసుకున్నవాళ్లు చాలా తక్కువ. తెలుసుకున్నా, 'బాగావున్నా'మని అంటే దిష్టితగిలి, అదృష్టం మారుతుం దని ఆమాట అనరు. అంతే కాక బాగా వుండడం దోషమనీ, పాపాత్ములు మాత్రమే బాగా వుంటారనీ, మూర్ఖులుమాత్రమే బాగా వున్నా మనుకుంటారనీ నమ్మకం.

"ఏం బావుండడ మమ్మా! కుర్రాడికి నిన్నటినించి జలుబుకదా! ఇంతవరకు కన్ను (ముక్కు అనాలి) తెరచి యెరగడు. ఆవు పాలివ్వడం మానేసింది. మొన్ననేగా మా తాత గారి సవితితల్లి మేనమామ పోయినాడు. వాడి మనమడు మూడోక్లాసు తప్పిపోయినాడా! రాచ్చిప్ప చిల్లిపడ్డది. నిక్షేపమంటి రాచ్చిప్ప! ఇట్లా వుంది మాగతి. ఏమోనమ్మా యీ కాలంలో అంతా మాయ. మాయ రాచ్చిప్పలూ, మాయ మనుషులూ! అవునఃలే అమ్మా! ఏం శాశ్వతం? ఈదేహమూ అంతేకద, వూరికే పట్టుకు పాకులాడ తారు గాని."

ఈ వాక్యాలే ఏ దేశాభిమానిఐనా విన్నాడా, అక్కడే మూడుపల్టీలు కొట్టి, "హా భారతమాతా! ధన్యురాలివి. ఇట్లాంటి ఆధ్యాత్మికులైన ముసలమ్మల్ని కన్నావు" అని అరిచి ఆనందంలో మూర్ఛపోతాడు.

"దుగ్గిరాలవారింటో పెళ్లయిందా? వాళ్ల కేం? పెళ్లిళ్లూ చేస్తారు, వొడుగులూ చేస్తారు. వాళ్ల ముత్తాత మూటలు సంపాయించి పడేసిపోయినాడుగా! ఒక నీతా, న్యాయమా? ఏముందీ? పరాయివాళ్లని దోచుకునేదీ, పెళ్లిళ్లు చేసేదీ!"

డబ్బు వుందంటే, అన్యాయార్జితమనే ఆమె వుద్దేశ్యం.

ఎవరన్నా—"అదీ, ఆరత్తమ్మ! మొన్నరాత్రి పారిపోయిందటమ్మా!" అంటే,— శేషమ్మ—"ఛీ, ఛీ. అట్లాంటిమాటలు నాచెవిని పడనీకు. నాకెందుకు? నా రామనామమేమో నేనేమో! సరే కాని, యింతకీ, ఎవడితో?"

"అక్క యింటికి."

"ఇంతేనా? ఐతే విశేష మేముంది? పారిపోయిం దంటావేం?"

"ఏమో వాళ్లంటే నే నన్నాను."

కొంచెం ఆగుతుంది శేషమ్మ యింకా యేమన్నా చెపుతారేమోనని. చెప్పక పోతే—

"నా కెందుకమ్మా! కాని అక్కయింటికి యెవరు తీసికెళ్లారు? ఎవడో మొగాడు వుంటాడు. బాగా చూడమను. వాతలు పెడితే యిద్దర్ని పట్టుకుని—నా కెందుకులే. వొద్దన్నా నా కెందుకు చెపుతావు! అక్క యింటి కెళ్లిందో, యింకెక్కడికి వెళ్లిందో! ఆ అక్కసంగతి తెలుసుగా! దాని పోకులూ, రవ్వలదుద్దులూ—నా కెందుకమ్మా! బండెడుచాకిరీ తెల్లారి లేస్తే, చస్తున్నాను."

"మీకోడలు పని చెయ్యదా?"

"అయ్యో, దాని చేతులు పువ్వులుట. దాని కాళ్లు తామరాకులుట!"

"మీ కూతురో?"

"మా కూతురికి గంపెడురోగమమ్మా! అదేం చేస్తుంది, దాని మొహం!"

"అట్లానమ్మా! బాగానే తిరుగుతోవుంటుందే!"

"మీ కంటికి అట్టానే కనపడతుంది. పై పుష్టే గాని, లోపలంతా గుల్ల. ఒకటే ఆయాసం."

"మరి యెప్పుడూ అట్లా చిరుతిళ్లు తింటే—"

"అయ్యో, ఏం తింటుంది? అన్నం అసలే తినదు. ఆ చిరుతిళ్లుకూడా లేకపోతే ఎట్లా బతుకుతుంది?"

"మా కూతురమ్మా, మా సుబ్బలక్ష్మి! దానికి ఒక్కరోజు జబ్బుచెయ్యదుకద!"

"చెయ్యకేమమ్మా! అట్లా తిరిగేవాళ్లు గబాలున పడతారు. మామామ మన మడు అంతే. పిడిరాయిలాగు—"

శేషమ్మ ప్రపంచం, పనీ, ఆచారమూ తెల్లవారకట్ట నాలిగింటికి లేచి, రాత్రి పద కొండింటివరకు (మధ్యాన్నం రెండు గంటలు విశ్రాంతితో) పనిచేస్తుంది. ముప్పై యేళ్లనించి, ప్రతిదినమూ ఆవిధంగా పనిచేస్తోంది. ఆమె పనిచేసినంతసేపూ, ఆమె నోరూ పనిచేస్తోవుంటుంది, మాటలతో, తిట్లతో. తెల్లారకట్టే రాత్రి అల్లరిచేసిన పిల్లుల్నీ, యెలికల్నీ తిట్లు; తరవాత పదింటిదాకా దాసీదాన్ని తిట్లు; అల్లరిచేసే పిల్లల్నీ కాకుల్నీ తిట్లు; కానీకి వీశడు బీరకాయ లివ్వని కూరలదాన్ని, మజ్జిగదాన్ని తిట్లు. ఈ

ముప్ఫైయేళ్లలోనూ ఒకరోజుకూడా చిక్కనిమజ్జిగ పొయ్యలేదు కదా, ఒక గొల్లదీ కూడా. పుచ్చిపోనికూర లివ్వలేదుకదా ఒక కూరలవాడుకూడా! మధ్యాన్నించి యిరుగుపొరుగువాళ్లనీ, కోడల్నీ, కొడుకు అనాచారాన్నీ, కృతఘ్నతనీ, దేవుణ్ణీ, పిచి కల్నీ, తోవ పొయ్యేవాళ్లనీ తిడుతుంది. ఎవరూ లేకపోతే రాత్రి పదింటికి తనని తాను తిట్టుకోడం ప్రారంభిస్తుంది. పని చెయ్యలేకుండా వుండలేదు. అదే ఆమె మతం. ఆమె శరీరమే పనిచేసేమర అయిపోయింది. ఆమె 'ఇన్‌టెలిజెన్సు' ఎప్పుడో మానింది పనిచె య్యడం. 'రొటీన్' తప్ప యింకేమీ ఆమె చాతకాదు. ఒక్క రవ్వ ప్రోగ్రామ్ మారిందా, యిల్లు పడుకుంటుంది. అంట్ల శుభ్రం, యిల్లు కడగడం, పేడ చల్లడం, మెతుకులూ, యెంగిలీ, మైలమైల అని అరవడం—యిదే బతుకు! ఒక కొత్తపనీ, కొత్తయోచనా రెండూ ఆమె చాతకావు. గానుక్కి కట్టిన యెద్దు నయం. అందువల్లనే మార్పుఅంటే గుండెలు పగిలి చస్తారు. బెత్తం లేకండా పాఠం చెప్పమంటే, ముసలి స్కూలుమాస్టరుకి యెట్లా వుంటుందో, యింగువ లేకుండా వంట చెయ్యమంటే ఆమె కట్లా వుంటుంది. లేపు లేకండా పనిచెయ్యమంటే తాలుకాగుమాస్తాకి యెట్లా వుంటుందో, మడికట్టుకోకండా వండమంటే ఆమె కట్లా వుంటుంది. ప్రపంచం ముక్కలైనా ఆమెకి అంత ఆశ్చర్యం కలగదు. ఇంతపని యిన్నేళ్లు చేసిందా యెవరి కా వుపయోగమంటే యేమీ కన పడదు. అందరూ ఆమెని చూసి విసుక్కునేవాళ్లే గాని కృతజ్ఞత కనపరిచేవాళ్లు లేరు. నలుగురికి భోజనం పెడుతోంది. తాను తింటోంది. ఇంటిని మురికిచేస్తుంది. ఎందుకు? కడగడానికి. కడగడ మెందుకు? మళ్లీ మురికిచెయ్యడానికి. అంతకాలం వంటచేస్తే మూడువందలమందికి భోజనం పెట్టవచ్చు వొకమనిషి. స్వర్గంలో అంట్లు తోమడమూ, బట్ట లారవెయ్యడమూ లేకపోతే యేం చేస్తుందో యీమనిషి?

పాపం, ఏ కొత్తకాంతినీ, ఆశనీ, ఆనందాన్నీ, కోర్కెనీ, అన్నిటినీ త్యజించి, ఆ వంటింట్లే తన ప్రపంచంగా, తనబాధే తన ఆనందంగా, తనచేతికి చిక్కిన అయిదారు గురూ దాసీతో సహా, తన నోటితీటను తృప్తిపరచగల సాధనాలుగా, తన ఆచారాన్నీ, తులసికోటనీ చూసుకుని గర్వపడి బతుకుతోంది. భూకంపాలు రానీ, దేశాలు దేశాలు తగలబడనీ, సామ్రాజ్యాలు పడిపోనీ, ఆమె కేమీ సంబంధం లేదు—తన యింటికి వంద గజాల సర్కిల్ దాటి ఆమె మనసు పనిచెయ్యదు.

కాపరము, పిల్లలు, ప్రేమ, ఏమీ లేక తనది, స్వంతంగా తనది అనే ఆస్తి గాని మనిషి గాని లేక, క్రమంగా క్రమంగా మనసు మోడైపోయి నిలిచింది ఆమె. ఇంకే ఆసక్తి లేక, ఆ పాతపురాణాలలో విన్న అక్కడక్కడి వచనాలని పట్టుకుని, వాటి వాస్త వత్వంపైన తన ఆత్మపుగోభివృద్ధిని ఆధారంచేసుకుని కన్నంలో యెలికవలె బతుకుతోంది.

ఎవరికైనా ప్రేమించడంకన్న ద్వేషించడం సులభం. ప్రేమ మనిషిని తన స్వంతంగా చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఈ పేదవితుంతువు స్వంతంకావడానికి ఎవ రంగీకరిస్తారు? తన కోడలికి ఒక్కొక్క బిడ్డే పుడుతోవుంటే, తన స్వంతం చేసుకోవాలని చూసింది. ఆతల్లి ప్రతినిమిషమూ జ్ఞాపకంచేసేది ఆపిల్ల తనదని—చూపుచాతా, నడవడిచాతా. ఆపిల్లలే మూడేళ్లు రాగానే అందరికన్న లోకువ గనక కర్రలు తీసుకుని బాదేవారు ఆమెని. ప్రేమ లేక, సంతోషం లేక, జీవితంలో యింటరెస్టు లేక, తను ఏబాధపడ్డా కరుణించేవారు లేక, ఇంక విధి లేక యీ బండచాకిరిలో తన శక్తినీ, ద్వేషంలో తన ప్రేమనీ, తిట్లలో తన ఆనందాన్ని, సార్థకం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఇట్లా ఎందరు ఎందరు యీదేశంలో యిట్లా కొయ్యబారిన ఆత్మలతో తమ జీవితాన్ని యితరుల జీవితాన్ని క్షోభపెట్టి మృత్యువులో చివరికి తప్పించుకునే స్త్రీలు! కాని మృత్యువులోనైనా తప్పించుకుంటారా? వాళ్ల జన్మలో వుందా యీలోపం, వాళ్లనిట్లా చేసిన సంఘపరిస్థితులలో వుందా? వాళ్లు సంఘాన్నిట్లా ఎండపెడుతూన్నారా, సంఘం వాళ్లని కొయ్యల్ని చేస్తోందా?

లేఖలు

'జగత్కథ' విమర్శనము

'ఉదయిని' సంపాదకులకు:

ఆర్యా,—వాఙ్మయ విమర్శకులు సరియగు విచక్షణతో సంఘవృద్ధికరములు జ్ఞానదాయకములు అగు గ్రంథముల బ్రోత్సహించుట యవసరము. కాని కొందరందుకు వ్యతిరేకముగ జేయుచున్నారు. ఈ మేనెల 'ఉదయిని'లో 'జగత్కథ' యను గ్రంథమును డాక్టరు పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారు విమర్శించియున్నారు. 'జగత్కథ'లో చాలాభాగము హెచ్. జి. వెల్సుగారి Short History of the World అను ఆంగ్ల గ్రంథము కనువాదము. ఈ అనువాదముచేయుటకు శఠకోపాచార్యులుగారిని నేనే ప్రోత్సహించితిని. మరియు వెల్సుగారును శఠకోపాచార్యులుగారును ఈ తర్జుమాషరతులు నిర్ణయించుకొనుటకును నేనే సహకారి నైతిని. Short History ని Thinkers' Library లో ప్రచురించిన Rationalist Press Association (London) అను హేతువాదప్రచురణ సంఘమువారి పక్షమున చెన్నరాజధానికి నేను కార్యదర్శినయి యుండుటచే నాసంస్థవారి సేవకై యీపని సమకట్టితిని. డా. శ్రీనివాసాచార్యులుగారు వ్రాసిన ఈ తీవ్రవిమర్శలో విజ్ఞానచరిత్రలగూర్చిన కొన్ని మూలసిద్ధాంతములే పూర్వపక్షము చేయబడినవి. అందువలన వానిని బహిరంగముగ సమర్థించుట నాబాధ్యత యగుటచే నే నీక్రిందివిషయములను వ్రాయవలసివచ్చినది.

"గొప్పవిమర్శకులును, విజ్ఞానకోవిదులును" వెల్సుగారి గ్రంథము సవ్యముగ లేదని 'ఖండించి'రట. 'ఒకానొక గొప్పవిమర్శకుడు' వెల్సుగారికి చరిత్రయన నేమో తెలియదనియు, వెల్సుకు తన యజ్ఞానమే బోధపడలేదనియు వ్రాసెనట. ఈ పేరులేని విమర్శకు లేయేవిషయముల ఖండించిరో, అందు కాధారము లేవియో ఆ విమర్శలో తెలుపలేదు. ఇట్లు వివరముల నీయక సూచనలచే మహనీయులపై దోషారోపణల జేయుట భావ్యము కాదు. డార్వీను తన సిద్ధాంతమున కాధారముగ తెల్పిన విషయములలో కొన్నివివరముల గూర్చి దరిమిలా పరిశోధకులు కొన్ని భిన్నాభిప్రాయముల దెల్పిరి; కాని ఆభేదవిషయములు మూలసిద్ధాంతమును, దాని కాధారములగు మూలసూత్రములను ఎంతమాత్రమును మార్పవు. సరికదా మరింత బలపర్చునని వైజ్ఞానికప్రముఖు లందరును అంగీకరించియున్నారు.

పరిశోధనలును అనుభవములును హెచ్చినకొలదిని, ప్రపంచమందలి జీవకోటి కొన్ని సుప్రసిద్ధసూత్రములకు లోబడి క్రమవికాస మొందుచున్నవనియు, నరజాతి యభివృద్ధిగూడ ఇట్టి సూత్రములకు లోబడియే యున్నదనియు, జీవతత్త్వపు ముఖ్యస్వభావ మేకరీతిదేయనియు వైజ్ఞానికులును, తత్త్వజ్ఞులును అంగీకరించియే యున్నారు. విజ్ఞానపరిశోధనలు ప్రాథమిక స్థితిలోనే యుండి చాల విషయము లెవ్వరికిని తెలియని స్థితిలో ఆరంభకుడగు డార్వీను కొన్ని వివరములగూర్చి పొరబడుట సహజమే. అట్టి స్థితిలో ఆరంభకులగు ప్రాచీనుల గోరంత లోపముల కొండంత జేసినంతమాత్రమున ప్రకృతిసిద్ధాంతము లనృతములని నిర్ధారణ కాదు. విజ్ఞానపరిశోధనలు శైశవస్థితిలో నున్నప్పు డఖండప్రతిభతో మూలసిద్ధాంతములను తప్పకుండ గనిపెట్టినందుకు వారు దూషణకు బదులు భూషణకే తగుదురు. వైజ్ఞానికవిమర్శ యన సత్యపరిశోధనము;

ఆ పరిశోధకులు సృష్టిరహస్యమును, జీవతత్త్వమును, దాని యథార్థములను గమనించి విజ్ఞానసత్యమును తెల్పుటలో అంతకు పూర్వము గొప్పపండితులు, మతాచార్యులు గూడ నమ్మి ప్రచారము చేయుచుండిన అనేక "సిద్ధాంతము"ల గూడ ఖండించుట తప్పదు. అది చాల కష్టకార్యమైనను సత్యశోధకుల కది తప్పదు. "క్షురస్య ధారా నిశితా దురత్యయా దుర్గం పథ స్తత్కవయో వదంతి" అని ఉపనిషత్తు ఘోషించుచున్నది. అందుచే నీ వైజ్ఞానికులపైనను ప్రకృతితత్త్వజ్ఞులపైనను చాలమంది పండితమ్మన్యులకు మనఃక్లేశము గలిగి, కొందరు మతాచార్యులును పూర్వధోరణి పండితులును వెల్సుగారిపై దండయాత్ర చేసి, 'ఉదయిని' వ్యాసములో నుదాహృతములైన రీతివగు నిందాగర్భితపదములతో దూషించిరి. అట్టి మొదలు తుద లేనివిమర్శ లన్నిటిని సత్యమనియు, వాని ననుసరించి వెల్సుగారు తమ గ్రంథమును సవరింపవలెననియు మన విమర్శకులు భావించిరి. ఆ ప్రతిపక్షులు వ్రాసిన వానిలో మచ్చు కొకటిరెండు పూర్వపక్షములకు వెల్సుగారు జవాబు నిచ్చియే యున్నారు. (Forum Series లో ప్రకటితమైన Mr. Belloc objects to the Outline of History ని చూడుడు.) వెల్సుగారు విజ్ఞానచరిత్రము లన్నిటియందు పారంగతుడు, ప్రత్యేక పరిశోధకుడు కాకపోవచ్చును; అంతమాత్రమున ఆయన కేవల మజ్ఞానియని, ఊహాధారముననే యాగ్రంథము రచించెనని సూచించుట కేవల మన్యాయము. వెల్సుగారు జంతుశాస్త్ర పట్టభద్రుడై విశేషముగ గ్రంథపఠనాదులచే విజ్ఞానము వృద్ధి జేసికొని, విజ్ఞానచరిత్రములందలి సారము గ్రహించెను. ఆయన నవలలు మున్నగునవికూడ కేవల మూహాధారములు కావు; అవి వినోదముకొరకే వ్రాయబడినవియు కావు. అందు చాల విజ్ఞానభావములు గల్గి విశేషజ్ఞానప్రదములై యున్నవి. ఆర్థిక సాంఘికవిషయముల గూర్చియు ఆయన చాల ఉద్గ్రంథముల వ్రాసెను. కాని యెంత విద్వాంసుడైనను ప్రపంచచరిత్రవంటి మహాగ్రంథమును వ్రాయుట సుసాధ్యముకాదు.

(ఆ పద్ధతి నాంగ్లమున గూడ ఇంకెవ్వరును రచింపకపోవుటయే అందలి కష్టమును తెల్పును.) అందువలన ఆయన తాను మహావిద్వాంసుడనని గర్వింపక, విజ్ఞానచరిత్రాది ఆయావిద్యాశాఖలందు పారంగతులనిపించుకొని జగత్ప్రసిద్ధులైన కొందరు విజ్ఞులచే తన చరిత్రగ్రంథపు ఆయాభాగముల బరిశోధింపజేసియే ప్రచురించెను. (Outline of History ఉపోద్ఘాతమును చూడుడు.) Outline గ్రంథపుసారమే జగత్కథకు ముఖ్యమాతృకయగు Short History of the World.

ఐనను ఈ ఆంగ్లగ్రంథమం దెట్టి లోపములును లేవని నేననుటలేదు. భూమిఉత్పత్తిమొదలు ఆయాయుగములందలి జీవవికాసమును సర్వదేశములయొక్కయు సర్వకాలములందలి చరిత్రను సమన్వయించు ఇట్టి మహాగ్రంథము నెట్టి విద్వాంసు డెందరు విజ్ఞులసహాయముతో వ్రాసినను అందు లోపము లుండుటలో నాశ్చర్యము లేదు. మానవుని జ్ఞానము ఎల్లప్పుడును అసంపూర్ణము. మరియు ప్రతివ్యక్తికిని కొన్నిప్రత్యేకభావము లుండును; అట్టిభావములు మహాగ్రంథముల వ్రాయునప్పు డందు జొరపడుట సహజము. అందువలన పరిశోధకుల మనోవృత్తినిబట్టి గ్రంథమం దనేక లోపములు గాన్పింపవచ్చును. కాని వానిచే ఈ గ్రంథమునందలి ముఖ్యప్రణాళికకు హానిలేదు. ఈగ్రంథపు మూలసిద్ధాంతము యథార్థమని నిష్పక్షపాతు లంగీకరింపక తప్పదు. అవసరమునితోచినమీదట Short History 1934 లో పునర్ముద్రణములో చివరిరెండు అధ్యాయములలో కొన్ని అంశములను వెల్సుగారు మార్చియున్నారు. ఆభాగ మాప్రకారమే 'జగత్కథ'లోను వ్రాయబడినది. వెల్సుగారికి గల్గినంతవైజ్ఞానిక చారిత్రజ్ఞానము మనయాంధ్రదేశమున నుదయించినచో ప్రజాస్వాస్థ్యము చాల పెంపొందగలదని మా ముఖ్యాభిప్రాయము. అది ఆయనకు తెలియదనుటయు రాధాకృష్ణునిగూర్చిన అనుచితప్రసంగమును

అటుండనిచ్చి, శ్రీ శ్రీనివాసాచార్యులుగారు విమర్శలో వక్కాణించిన లోపముల బరీక్షింతము. బుద్ధాశోకుల గూర్చిన అధ్యాయములబట్టి మిగిలిన అధ్యాయము లింకెట్లుండునో గ్రహింపవచ్చునని, ఆగ్రంథపుదోషముల నందు వివరించుట సాధ్యముకాదని మాత్రము వారు వ్రాసిరి. కాని ప్రత్యేకలోపముల వేనిని తెలుపరైరి. బుద్ధాశోకులగూర్చిన అధ్యాయములు సమగ్రములుకావు; వృత్తాంతములగూర్చి ఆయాపూర్వపుస్తకములతో బోల్చినచో కొన్ని స్వల్పభేదములును కలవు. కాని యేచరిత్రలోనైన అంత సంగ్రహముగ వ్రాయునప్పు డట్టి లోపము లుండును. మరియు దృక్పథమునుబట్టియు భేదము లుండక తప్పదు. కాని చాలమంది యితరచరిత్ర కారులకన్న బుద్ధాశోకులగూర్చి వెల్సుగారు కొన్నివిషయములందు చాల బాగుగనే వ్రాసిరి. వెల్సుగారికి మన ప్రాచ్యఖండపు బుద్ధాశోకులగూర్చి (ఇతర ప్రాంతములగూర్చిన దానికన్న)పరిచయము చాల తగ్గియుండుట ఆశ్చర్యకరము గాదు. ఆయన దృక్పథమును పాశ్చాత్యదృక్పథమే. అందువలన ఈ అధ్యాయములనే గ్రంథము కంతకు పరీక్షాస్థలముగ గ్రహించుటయు భావ్యము కాదు.

5-వ చార్లెసుతిండిని ఉత్తరక్రియలనుగూర్చి వెల్సుగారు వ్రాయుట యసమంజసమని ఈవిమర్శలో వ్రాయబడినది. 5-వ చార్లెసు మహాచక్రవర్తులలో నొకడనియు వానప్రస్థుడగుటలో ఆయన లోకాతీతమగు మహాత్యాగము కావించెననియు చారిత్రికులు తరుచు వ్రాయుదురని వ్రాసి, నిజముగా ఆయనచర్యలబట్టి చార్లెసులో నట్టి ఘనత గాని నిజమగు జ్ఞానిత్వాదులు గాని లేవనుటకు, వానిని వెల్సుగా రుదాహరించిరి. (వయసగా తీవ్రచరిత్రపఠనచే వ్యాకులచిత్తులగు వారికి హాస్యరసభరితమగు దీనిచే మనోవిశ్రాంతికూడ కల్గును.)

ఇట్లు నేను వ్రాసినందున వెల్సుగారి భావములన్నియు అంగీకారయోగ్యములేయనియు, వారి ప్రపంచ చరిత్రగ్రంథము లోపరహితమనియు నాయభిప్రాయ మెంతమాత్రము కాదు. మరియు అనువాదకులగు శఠకోపా చార్యులుగారికిని అట్టిభావము లేదని జగత్కథలోని టిప్పణులవలననే స్పష్టమగును. "అనువాదముచేయుటకు బదులు శఠకోపాచార్యులుగారు ఈగ్రంథముపై నాధారముచేసుకొనియు ఇందలి సందేహాస్పదవిషయములను విశదీకరించియు మన కప్రస్తుతములగు విషయములను సంగ్రహపరచియు.. ఇందలి దోషములను సవరించియు వేరొకగ్రంథమును తయారుచేసియుండవలసిన"దని విమర్శకులు 'ఉదయిని'లో వ్రాసిరి. ఈ యనువాదగ్రంథము కన్న స్వతంత్రగ్రంథము వ్రాయుటే సులభమని తోచినను వెల్సుగారి గ్రంథముతో సంబంధములేకుండ స్వతంత్రగ్రంథమును సామాన్యులు వ్రాసినను అది జనులలో ప్రామాణికముగ చలామణి కాదనియు, ప్రపంచ చరిత్రమును గూర్చిన యేగ్రంథమును అందరికిని తృప్తికరము కాజాలదనియు శఠకోపాచార్యులుగారు భూమిక (౨౨-వ పుట)లోనే వ్రాసిరి. వెల్సుగ్రంథముపై నాధారముచేసుకొని దానిని సవరించివ్రాయుటకు వీలులేదని విమర్శకులు గ్రహించకపోవుట శోచనీయము. వెల్సుగారు జీవించియున్నారు. ఆయన గ్రంథములకు కాపీరైటు కలదు. ఆయన మూలగ్రంథము నేరీతిగాను సంగ్రహించుట, మార్చుట జరుగనిపద్ధతినే అనువాదమున కంగీక రించినారు. ఆయన అంగీకారములేకుండ దానినిమార్చి స్వతంత్రగ్రంథమను పేరుతో ప్రచురించి గ్రంథచౌర్యము (plagiarism) చేసిన ఆక్షేపణకు లోనగుటకన్న కొంత 'రాయల్టీ'ని వెల్సుగారికిచ్చుకొను నష్టమునకును విచిత్ర శైలిగ్రంథమునకు దుస్సాధ్యమగు అనువాదముచేయు కష్టమునకును లోనై, 'జగత్కథ'ను రచించుట, శఠకోపా చార్యులుగారి న్యాయశీలతను సూచించుచున్నది. మూలగ్రంథములోని లోపములను గమనించుటవలననే (వెల్సుగారితో గ్రంథపాఠముగురించి జరిగినయొడంబడిక గమనించియు) శఠకోపాచార్యులుగారు తమ టిప్పణులలో వివిధముఖ్యాంశములను జేర్చుటయే కాక, కొన్నిచోట్ల వెల్సుగారి యభిప్రాయము

లాక్షేపణీయములని తోచినప్పుడు టిప్పణులలో తమ భేదాభిప్రాయములను వైజ్ఞానికుల భిన్న సిద్ధాంతములను సహేతుకముగ నిరూపించియేయున్నారు. (ఉ: జగత్కథ ౩౪౭, ౬౩౩—౬౩౫, ౧౩, ౧౪ పుటలు చూడుడు.) టిప్పణులలో "ఆంధ్రదేశమునుగూర్చి వ్రాసిన సంగతులు ప్రపంచచరిత్రమునకు అప్రసక్తములు అనుపయుక్తములు" అనియు వీ రాక్షేపించిరి. ఆంధ్రసామ్రాజ్యము, బౌద్ధ, జైన మతవ్యాప్తి, కోస్తా వ్యాపారముద్వారా ఆంధ్రులవ్యాప్తి, విజయనగరసామ్రాజ్యము, ఇట్టి ప్రధానవిషయములే అందు వ్రాసియున్నవి. వానిని సందర్భముల సమన్వయముకై వ్రాసినట్లు శఠకోపాచార్యులుగారు భూమిక (౩౦వ పుట)లో వ్రాసియున్నారు. ఆంధ్రసంస్కృతికి ప్రపంచచరిత్రతోగల సంబంధము, నాగరికలోకమున ఆంధ్రుల స్థానమును తెలియుటకివి యవసరముకావా? చరిత్ర సామాన్యమున ఆంధ్రులకు స్థానమే లేదా? ఆంధ్రులే పాఠకులుగా నుద్దేశించు 'జగత్కథ'లో ఆంధ్రులప్రశంసయే కూడదని విమర్శకుల భావమా? ఇట్టి విమర్శలు రచయితల నిరుత్సాహపర్చునే కాని ఆంధ్రపాఠకులరుచికి సవ్యమార్గమును ప్రదర్శింపదని తోచుచున్నది.

మూలమందలి చిత్రపటముల నిందు ప్రచురించకుండుట గొప్పలోపమని, తేజోమేఘము, శిలాధాతువులు మున్నగువాని వివరణమే యిందు లేదని విమర్శకులు వ్రాసిరి. వాని వివరణము గ్రంథమున లేకపోలేదు. మరియు అనువాదకులు తమ టిప్పణులలోను వీనిని విశదముచేసినారు. (ఉ: 'జగత్కథ' ౧౫౪వ పుట.) చిత్రపటములు Outlineలోనేకాని Short History of the Worldలో లేవు. జగత్కథలో Short Historyలోని పటము లన్నిటినే గాక రెండు క్రొత్తపటములగూడ చేర్చియేయున్నారు. Outlineలోని కొన్ని చిత్రపటముల నిందు చేర్చుట మంచిదే; కాని ఇప్పటికే 'జగత్కథ' అచ్చొత్తించి ప్రచురించుటలో శఠకోపాచార్యులుగారికి కలిగినబాధ నావలె స్వయముగ తెలిసినచో విమర్శకు లట్లు వ్రాసియుండరు. మన ఆంధ్రపాఠకులు చాలవరకు తత్కాలవినోదమునే యిచ్చు కథలను, నవలలను, లేక మూఢభక్తినే ప్రోత్సహించు ప్రాచీనమతసంబంధ గ్రంథములనుమాత్రమే కొందురు; కాని విజ్ఞానవ్యాప్తి గావించు ఇట్టి వాఙ్మయమున కాంధ్రలోకమున ద్రవ్యరూపముగ సహాయప్రోత్సాహములు లేవనియు, చిత్రపటముల గూడ జేర్చుటచే విశేషద్రవ్యవ్యయమై, పుస్తకపు కిమ్మతు నింకను హెచ్చించుటయు, అందుచే కొనుబడి యింకను తగ్గుటయు జరుగునని గమనింపవలసివచ్చెను.

Outline of History తెలుగున లేనందున ఈ 'జగత్కథ' ఆంగ్లము తెలియని ఆంధ్రుల కుపయోగకరము కాదనియు మన విమర్శకులు వ్రాసిరి; Short History ఏవిధముగను Outline గ్రంథమునకు అనుబంధము కాదనియు, "వేరుగా నిర్ణయించి వ్రాసిన సామాన్యచరిత్ర"యనియు, సామాన్యపాఠకులందరికిని సులభముగ నుండుటే దాని ముఖ్యోద్దేశమనియు వెల్సుగారి పీఠికవలననే స్పష్టమగును. Outline గ్రథంపురీతి విపులగ్రంథమును శ్రీ శ్రీనివాసాచార్యులుగారుగాని ఇతర మహాశయులుగాని ఆంధ్రమున వ్రాసిన మంచిదే; కాని దాని ప్రచురణ ప్రయత్నము నారంభించినగాని అందలి కష్టములు విమర్శకులకు గ్రాహ్యములు గావు. మరియు క్లప్తమగు 'జగత్కథ'కే ఆంధ్రజనప్రోత్సాహము సందిగ్ధమగునప్పు డింకను విపులమగు గ్రంథము పాఠకలోకము ప్రోత్సహింపగలదాయని యింకను సందేహింపనగును. ప్రస్తుతస్థితిలో అది ఆర్థికముగ జయప్రదమగుట యసంభవము.

ఉదయిని

తనకు సాధ్యమైనంతవరకు వ్యయప్రయాసములకు సంకోచింపక శఠకోపాచార్యులుగారు చాల టిప్పణులను అనుబంధములను చేర్చి, మూలగ్రంథమును చాల వృద్ధిచేసి జగత్కథను ప్రచురించినారు. పాశ్చాత్య దృక్పథముచే గలిగిన వైపరీత్యములుగూడ టిప్పణులవలన సవరింపబడినవి. అట్టిస్థితిలో 'జగత్కథ' లోప భూయిష్ఠమని విద్వాంసులును విమర్శలో సూచించుట నవ్యవాఙ్మయమును ప్రోత్సాహకరము కాదు. ఆంధ్రమున ఇట్టి వాఙ్మయము చాల అవసరమైనను, ఇట్టి గ్రంథముల బ్రచురించువా రరుదు. విమర్శకులు గ్రంథములందలి నిజమగులోపముల గనపర్చుట మంచిదే; అది గ్రంథకర్తల కుపయోగకరము, మార్గదర్శకముగ నుండుట భావ్యము. 'ఉదయిని'లోని విమర్శ ఆరీతిదిగ గన్పట్టదు. ఇది కొంతవరకు నవ్యవాఙ్మయమంతకు సంబంధించుటచే నింతదూరము వ్రాయవలసివచ్చినది. గన్కనే తుదకు శ్రీ విమర్శకాచార్యులవారు వ్రాసిన రీతిని "ప్రపంచచరిత్ర మేమాత్రము నేవిధమునను దెలియని యాంధ్రుల కీ గ్రంథము" అవ్యాజానురాగముతోను, గడుమన్ననతోను సమర్పింపబడినది.

కాకినాడ

ఎస్. వి. వి. కె. రంగాచార్యులు, బి. ఎ.

20—7—1936

Hon. Secretary, R.P.A., for Madras Presidency.

[పై లేఖకు డా. పుట్టపర్తి శ్రీనివాసాచార్యులుగారి సమాధానము:]

ఆర్యా,—జగత్కథ విమర్శనమునుగూర్చి శ్రీ ఎమ్. వి. వి. క. రంగాచార్యులుగారు వ్రాసిన వ్యాసము నామూలాగ్రముగ జదివితిని.

రంగాచార్యులుగారి వ్యాసము నారంభమునందు ఈక్రింది వాక్య మున్నది:

> "శ్రీనివాసాచార్యులుగారు వ్రాసిన ఈ తీవ్రవిమర్శలో విజ్ఞానచరిత్రలగూర్చిన కొన్ని మూల సిద్ధాంతములే పూర్వపక్షము చేయబడినవి. అందువలన వానిని బహిరంగముగ సమర్థించుట నా బాధ్యతయగుటచే నే నీ క్రిందివిషయములను వ్రాయవలసివచ్చినది."

ఇట్లు ప్రారంభించియు ఏలకో నే జేసిన పూర్వపక్షములను రంగాచార్యులుగారు చర్చించనేలేదు. ఉదాహరణముగ నా విమర్శలోని మొదటి పూర్వపక్షము తు గైకొందము. "'ప్రపంచమంతట నొకే ప్రజారాజ్యనిర్మాణమును, అంతర్జాతీయసంఘస్థాపనయు ఇతిహాసభావమని వెల్సుగారి యూహ.' ఈయూహకు ప్రపంచచరిత్రమునందు సహకారములగు విషయములు చాలకొద్దియే. ప్రతిబంధకములగు విషయములు మాత్రము అసంఖ్యాకములు. అదియే గాక 'విశ్వజనీనభావమును', 'జగదాత్మకత్వమును' వ్యాప్తి నొందించుటకు ప్రపంచమందంతటను ఒకే ప్రజారాజ్యమును నిర్మాణముజేయుట యొక్కటే మార్గమని చెప్పుటకు వీలుగాదు" అని నా విమర్శనమునందు నేను వ్రాసితిని. ఎందులకో రంగాచార్యులుగారు దీనిని చర్చించనైనలేదు.

వెల్సుగారి చరిత్రమును విమర్శించిన ఆంగ్లవిమర్శకులలో నొకరి యభిప్రాయమును నా విమర్శనమునం దుదాహరించితిని. ఈ విమర్శనము సాధారణముగా మన కందరికిని తెలిసిన Illustrated London News అను పత్రికలో ప్రచురించియున్నందున అందరికిని తెలిసియేయుండునని భావించితిని. కాని ఆ విమర్శకుని పేరు తెలుపలేదని శ్రీరంగాచార్యులుగారు నన్నాక్షేపించినందున ఇట వివరించెద. అతని పేరు Osborn.

ఇంచుమించుగ అన్ని పత్రికలకన్న Illustrated London News పత్రికకే యధికవ్యాప్తి (circulation) కలదు. ఇందలి విమర్శన లెప్పుడును కేవల మొక్క విజ్ఞానాభివృద్ధిదృష్టితోనే చేయబడుచున్నవి గాని ఎప్పుడును పక్షపాతబుద్ధితో చేయబడునవి గావు. ఈకారణముననే ఈపత్రిక సర్వజనామోదమును బడయుచు దినదినప్రవర్ధమాన మగుచున్నది. హిందూదేశమునందుగూడ నితకన్న నెక్కువవ్యాప్తిగల ఇంగ్లండుదేశపు పత్రిక లేదని తలతు. గనుకనే ఈపత్రికయందలి విమర్శనమును నే నుదాహరించితిని. ఈ ఆంగ్లవిమర్శకుడు శక్తిమంతుడనియు, జ్ఞానైకరతుడనియు, పక్షపాతపుఁవ్రాతలు వ్రాయువాడు కాడనియు నా సంపూర్ణవిశ్వాసము. ఆంగ్లదేశమునందు పామరజనమునకును, పండితులకునుగూడ ఇతనినిగూర్చి సాధారణముగా నిట్టి యభిప్రాయమే కలదు. రంగాచార్యులుగారు హిలేరి బెల్లక్ (Hilaire Belloc)గారి ఖండనమునుగూర్చియు, అందునకు వెల్సుగారొసగిన ప్రత్యుత్తరమునుగూర్చియు ప్రస్తావనజేసియున్నారు. బెల్లకు రోమనుక్యాథలిక్ (Roman Catholic) మతాభివృద్ధియందే లగ్నమనస్కుడై, ఆ మతవ్యాప్తికై తన జీవితమును ధారపోసిన వాడు. రోమనుక్యాథలిక్ మతదృష్టితోనే చరిత్రలు వ్రాసినవాడు. అట్టివాడు చూపిన తప్పులను పరిగణింప నవసరములేదు. నే నిచ్చినది, అట్టి పక్షపాతదృష్టితో విమర్శించినవాని యభిప్రాయము కాదు. కేవలము ప్రపంచదృష్టితోమాత్రమే చూచినయెడల వెల్సు గ్రంథమునం దెట్టి లోపములు గాన్పించునో అట్టివానినిమాత్రమే నా విమర్శనమునందు తెల్పితిని. రంగాచార్యులుగారే వ్రాయుచున్నారు, "వెల్సుగారి భావములన్నియు అంగీకారయోగ్యములేయనియు వారి ప్రపంచచరిత్రగ్రంథము లోపరహితమనియు నా యభిప్రాయ మెంతమాత్రమును గాదు" అని. ఇక నేనుమాత్రము చెప్పిన దేమి?

వెల్సుగారు ఈ గ్రంథము ప్రచురించునప్పటికి ప్రపంచచరిత్రమునుగూర్చి విశదమగు అభిప్రాయము లుండలేదు. కాని అప్పటినుండి ఇప్పటివరకును ఈవిషయమునుగూర్చి ఎందరో మహామహులు యోచించి, పరిశోధించి, తమ యభిప్రాయములను విశదీకరించియున్నారు. చరిత్ర యన నేమి? చరిత్రము నెట్లు వ్రాయవలెను? ప్రపంచము నంతటిని ఒకటే యవిభక్తఖండముగ (unit) పరిగణించి చరిత్ర వ్రాసినయెడల ఏయే నూతనాంశములు వ్యక్తమగును? అట్టి దృష్టితో జూచినట్లయిన ఏయంశములు ప్రధానములై, ఏ యంశము లప్రధానము లగును? మొదలగు ఎన్నియో విషయములనుగూర్చి అనేక వ్యాసములును, పుస్తకములునుగూడ ఇటీవల ప్రచురించియున్నారు. వెల్సుగారి దృష్టికి భిన్నదృష్టితో పరికించి వ్రాసిన ప్రపంచచరిత్ర గ్రంథములుగూడ ఎన్నియో వచ్చినవి. మదరాసునందలి కన్నిమరా గ్రంథాలయమునందుగూడ కొన్ని కొన్ని ఈ లక్షణగ్రంథములును, లక్ష్యగ్రంథములును గన్పట్టుచున్నవి.

ఇట్టిస్థితిలో వెల్సుగారి గ్రంథమును సమగ్రముగ విమర్శించుటకు అతని ఔట్‌లైన్ ప్రథమమున ప్రచురించిననాటికన్న నే డెక్కువ యనుకూలము లున్నవి. అంతే గాక వెల్సుగారికి అనుకూలురును ప్రతికూలురును ఐన విమర్శకు లెందరో ఈగ్రంథము నిదివరకే విమర్శించియున్నందున ఇందలి సత్యాసత్యము లెవ్వియో కనుగొనుటకు నాటికన్న నేడు మన కెక్కువ యవకాశ మున్నది. సాధ్యమైనంతవరకును అట్టి యనుకూలములను, అవకాశములను ఉపయోగపఱచుకొనియే నేడు నా విమర్శనమును వ్రాసితిని. ఎన్ని చరిత్రములు వచ్చినను ప్రపంచచరిత్రమును ప్రప్రథమమున వ్రాసిన కీర్తి వెల్సుగారిదే. దాని నెవరును తుంచి తమ చేయజాలరు. కాని తప్పులని నే విమర్శనమునందు జూపిన 'మూలసూత్రములను' సమర్థించి నే జెప్పిన రీతిని ప్రపంచచరిత్ర ముండదగదని ఖండించి రంగాచార్యులుగారు ప్రపంచచరిత్రము నెట్లు వ్రాయవలెనో విశదీకరించియుండినచో చాల బాగుగ నుండెడిది.

బుద్ధాశోకులనుగూర్చి నేను వ్రాసినదానిని ఆక్షేపించుచునే రంగాచార్యులుగారు,

> "బుద్ధాశోకులనుగూర్చిన అధ్యాయములు సమగ్రములు కావు; వృత్తాంతములగూర్చి ఆయా పూర్వపుపుస్తకములతో బోల్చినచో కొన్ని స్వల్పభేదములును కలవు. కాని యే చరిత్రలోనైన, అంత సంగ్రహముగ వ్రాయునప్పు డట్టి లోపము లుండును. మరియు దృక్పథమును బట్టియు భేదము లుండకతప్పదు. కాని చాలమంది యితర చరిత్రకారులకన్న బుద్ధాశోకుల గూర్చి వెల్సుగారు కొన్నివిషయములందు చాలబాగుగనే వ్రాసిరి. వెల్సుగారికి మన ప్రాచ్య ఖండపు బుద్ధాశోకులగూర్చి (ఇతరప్రాంతముల గూర్చినదానికన్న) పరిచయము చాల తగ్గియుండుట ఆశ్చర్యము గాదు. ఆయన దృక్పథమును పాశ్చాత్య దృక్పథమే."

అని సమాధానముకూడ వారే వ్రాసియున్నారు.

ఇక నొక్కయంశము. ఆంధ్రులనుగురించి నేను వ్రాసిన విషయమును అపార్థముచేసికొని రంగాచార్యులుగారు ఏమేమో తోచినదెల్ల వ్రాసియున్నారు. రంగాచార్యులుగారి కున్నంత లేకపోయినను నాకును కొంత ఆంధ్రాభిమానము గలదు. అందునిమిత్తమే ఆంధ్రదేశచారిత్రమును నా యభిమానకార్యరంగముగ జేసికొని పనిచేయుచున్నాను. ప్రపంచచరిత్రమున ఆంధ్రులకు స్థానము కలదన్నచో అది కోస్తా వ్యాపారము వల్ల మాత్రము కాదు. కాని ప్రపంచచరిత్రమున ఆంధ్రులకు స్థానము లేదనిమాత్రము నే ననను. జగత్కథ గ్రంథకర్తగారు టిప్పణులందు వివరించినది ప్రపంచ చరిత్రముగ ఆంధ్రులస్థానమునుగూర్చిన చర్చ గాదు; నిర్ణయముచేయు విషయములును గావు. వారు వర్ణించినది కేవలము హిందూదేశచరిత్ర. హిందూదేశచరిత్రము సంగ్రహముగనైనను విశదీకరింపవలసివచ్చుట జగత్కథకు అవసరమని ప్రతివిమర్శకాచార్యులవారు అభిప్రాయపడినచో నా యభిప్రాయభేదమును వారు కొంత సహింపగలరు.

చారిత్రకలోపముల నెత్తుట ఎందుకు. శాస్త్రవిషయములలో (science matters) రంగాచార్యులుగారు ప్రస్తావించిన ఒక్కవిషయమునుమాత్రము గైకొందము. "డార్విను తన సిద్ధాంతమున కాధారముగ తెల్పిన విషయములలో కొన్నివివరములగూర్చి దరిమిలాపరిశోధకులు కొన్ని భిన్నాభిప్రాయములను దెల్పిరి; కాని ఆ భేదవిషయములు మూలసిద్ధాంతమును దాని కాధారములగు మూలసూత్రములను ఎంతమాత్రమును మార్పవు. పరికదా మరింత బలపర్చునని వైజ్ఞానికప్రముఖులందరును అంగీకరించియున్నారు" అని రంగాచార్యులుగారు వ్రాసియున్నారు. ఈవాక్యమున "మూలసిద్ధాంతము", "మూలసూత్రము" అన నేమో విశదముగాలేదు. డార్విను సిద్ధాంతములో Theory of Instinct ఒక మూలసూత్రము గాదనియా రంగాచార్యులుగారి యభిప్రాయము? డార్విను "మూలసిద్ధాంతమును, దాని కాధారములను" ఏవిధముగను బలపరచుటకు బదులు అందు కొన్ని ముఖ్యములగు మార్పులను గావించియున్న ఒకటి రెండు అంశములను పైన దెల్పిన Osborn విమర్శకుడే ఈక్రిందివిధముగ సంగ్రహముగ తెల్పియున్నాడు: "Evolution, as now accepted does not guarantee the development of homo-sapiens into homo-pacificus. The careful study of living creatures, such as birds and insects, has certainly demolished some of the deductions—e.g., the Theory of Instinct—from the Darwinian hypothesis............'the survival of the fittest' is nothing less than the urge and pressure of God knocking sense into hippopotami, men, water-lilies, blue tits, spiders and roses." దీనికి రంగాచార్యులుగారైనను, మరి ఏఇతర జీవశాస్త్రజ్ఞులు

(biologists) ఐనను సరియైన సమాధాన మొసగిన గాని రంగాచార్యులుగారి పైన జూపిన వాక్యము పాక్షిక ముగ ఎట్లో వెల్సును సమర్థించుటకు మాత్రమే చెప్పినట్లు ఎంచవచ్చును.

మనకు డార్వినుపై గౌరవ మున్నంతమాత్రాన అతని కాలమునుండి నేటివరకును జరిగిన యభివృద్ధి నేమాత్రమును గమనించక డార్విను చెప్పిన విషయములనే సతతము వల్లె వేయుచుండినయెడల మనము డార్వినును గౌరవించిన ట్లగునా? అట్లయినయెడల కోపర్నికస్ (Copernicus) నకు పూర్వులగు శాస్త్రజ్ఞులను దూషించిన ట్లగునని జ్యోతిశ్శాస్త్రమును (astronomy) వ్రాయువారు భూమిచుట్టును సూర్యుడు తిరుగుచున్నాడని వ్రాయవలసినదే! న్యూటను (Newton)ను అగౌరవపరిచిన ట్లగునని ఐన్‌స్టయిన్ (Einstein)గారి రిలెటివిటీ థియరీ (Theory of Relativity)ని వదలివేయవలసినదే! డార్విను సిద్ధాంతముల ననుసరించుట లోపము గాదు. కాని డార్విను తన సిద్ధాంతమును ప్రతిపాదించిన నాటినుండి నేటివరకును, అనగా ఈ 76 సంవత్సరములలో జీవశాస్త్రవిషయమున జరిగిన అనల్పపరిశోధనమునందలి ప్రధానాంశములను వదలివైచినచో అది యొకలోపముగనే ఎంచబడును.

శాస్త్రీయములైన ఇట్టి ఒకటిరెండు లోపములను మాత్రము చూపినాను. రంగాచార్యులుగారు మాత్రము లోపములు లేవనెదరా? ఈ సందర్భమననే వారు వెల్సుగారి నెట్లు ఖండించుచున్నారో చూడుడు: "ఐనను ఈ ఆంగ్లగ్రంథమం దెట్టి లోపములును లేవని నే ననుటలేదు. భూమి ఉత్పత్తి మొదలు ఆయాయుగములందలి జీవవికాసమును సర్వదేశములయొక్కయు సర్వకాలములందలి చరిత్రను సమన్వయించు ఇట్టి మహాగ్రంథము నెట్టి విద్వాంసు డెందరు విజ్ఞులసహాయముతో వ్రాసినను అందు లోపము లుండుటలో నాశ్చర్యము లేదు." ఇది ఆచార్యులవారిమాట. వారే చెప్పుచున్నారు: "వైజ్ఞానిక విమర్శయన సత్యపరిశోధనము; ఆపరిశోధకులు సృష్టిరహస్యమును జీవతత్వమును దాని యథార్థములను గమనించి విజ్ఞానసత్యమును తెల్పుటలో అంతకు పూర్వము గొప్పపండితులు మతాచార్యులుగూడ నమ్మి ప్రచారముచేయుచుండిన అనేక సిద్ధాంతములగూడ ఖండించుట తప్పదు. అది చాల కష్టకార్యమైనను సత్యశోధకుల కది తప్పదు" అని. ఇక నేను మాత్రము వ్రాసిన దేమిటి? వారి యుద్దేశ్యానుసారమే నేను వ్రాసినది—అది నిష్ఠూర మైనప్పటికిని. లోపములను జూపినపుడు, అవి సరియైన వైనపుడు, ఆదరబుద్ధితో గ్రహించిన గాని ఏగ్రంథమునుగూర్చిగాని సత్యవిమర్శనము రాదు. సత్యవిజ్ఞానము పెంపొందదు.

వెల్సుగారు జంతుశాస్త్ర పట్టభద్రులని నాకు తెలియును. కాని అంతమాత్రముచేతనే రంగాచార్యులుగారు చెప్పినట్లు వెల్సునవలలలో నున్న శాస్త్రవిషయముల (scientific matters) నమ్మి, అవి సరియనియు, 'విజ్ఞానప్రదము'లనియు, రంగాచార్యులవారివలె నే జెప్ప సాహసింపను. The First Men in the Moon అను అతని ఒక ముఖ్యనవలను గైకొందము. చంద్రగోళముపైన ఇద్దరుమానవులు ఒకరితో నొకరు మాటలాడు కొనగలిగిరనియు, ఇతరధ్వనులు చేయగలిగిరనియు వెల్సుగారు ఈనవలయందు వ్రాసియున్నారు. ఈసందర్భమున అది నవలయని మాత్రమే మనము గుర్తించుకొనవలయును. శాస్త్రగ్రంథము కాదు. చంద్రగోళముపైన గాలి (atmosphere) ఏమాత్రమును లేనందునను, ధ్వనికెరటములు గాలియున్నగాని ప్రసరించనందునను అచ్చట మనచెవివద్ద నొక నగారా వాయించినను మన కేమాత్రమును వినబడదనియు, వెల్సుగారివ్రాత కెట్టి యాధారమును లేదనియు కొంత యోచించిన బోధపడును. చమత్కారమునకే గాని వెల్సుగారు మాత్రము అదియే సత్యమని వ్రాసియుండురా? వారి యుద్దేశ్యమున అది నవలయే. వీనిలో కొన్ని కాకతాళీయన్యాయముగ శాస్త్రసమ్మతములైనను గావచ్చును.

లేఖ లు

వెల్సుగారి గ్రంథములందు ఏవో కొన్నిలోపము లున్నవని చెప్పినంతమాత్రమున ఆయనఘనత ఏమియు తక్కువకాదు. ఆధునిక ప్రపంచమునందలి గొప్పవిజ్ఞానవేత్తలలో వెల్సు ఒక్కడన్నది నిర్వివాదాంశము. ఎంత గొప్పవాడైనను విషయము వచ్చినప్పుడు లోపము లున్నచో తలపెట్టకుండ ఉండలేము. లోపములను లోపములని చెప్పక మానలేము.

గ్రంథముద్రణ ప్రకటనవిషయముల నాకంటె రంగాచార్యులుగారికి ఎక్కువ అనుభవజ్ఞాన ముండ వచ్చును—వారు హేతువాద ప్రచురణసంఘము (Rationalist Press Association) వారి పక్షమున చెన్న రాజధానికి కార్యదర్శి గనుక. నేను కేవలము విజ్ఞానాభివృద్ధికరదృష్టితో మాత్రమే చూచి ఈగ్రంథప్రాశస్త్య మునుగూర్చియు గ్రంథమునందలి విషయములనుగూర్చియు విమర్శనజేసితిని.

"ఆంధ్రపాఠకులు చాలవరకు తత్కాలవినోదమునే యిచ్చుకథలను నవలలను, లేక మూఢభక్తినే ప్రోత్సహించు ప్రాచీనమతిసంబంధ గ్రంథములను మాత్రమే కొందురు" అని రంగాచార్యులుగారు వ్రాసి యున్నారు. అనుభవజ్ఞులు గాన వారు వ్రాసిన ఈవిషయము నిజమని ఒప్పుకొన్నను, 'విజ్ఞానవ్యాప్తి గావించు' గ్రంథములను సులభముగ పామరజనముగూడ అర్థముచేసికొని శ్రద్ధదీసికొనునట్లు వ్రాసినయెడల అట్టి గ్రంథ ములు ఎక్కువగ అమ్ముడుపోగలవనియు, వానికి తగిన ప్రోత్సాహమును ఆంధ్రలోక మొసంగుననియు నా యభిప్రాయము. శ్రీ శఠకోపాచార్యులవారు ప్రత్యేకముగ నొక స్వతంత్రగ్రంథమే వ్రాసియుండినచో, గ్రంథప్రచురణమునందు కొంత వ్యయము తగ్గి, గ్రంథము ఆంధ్రజనబాహుళ్యమునకు సులభముగ నర్థమై ఉత్సా హమును బుట్టించి తగుప్రోత్సాహమును పొందియుండునని ఇప్పటికిని నేను విశ్వసించుచున్నాను.

ఇంతకును మాననీయులైన శఠకోపాచార్యులవారిని నిరుత్సాహపరుపవలెనని గాని, వారిగ్రంథమును తెగడవలెననిగాని ఎంతమాత్రము నాయభిప్రాయము కాదు. ఇది గమనింతురుగాక. విజ్ఞానవాఙ్మయమును పెంపొందింపవలయుననియే నాయాశయము. ఇందుల కెందరు నడుములుకట్టిన నంతమంచిది. వ్రాసియే యున్నాను నావిమర్శనయందు, "ఆచార్యులవారి ఉత్సాహోసక్తులును, భాషాభిమానమును ప్రశంసార్హము" లని; "వెల్సుగారి దోషములకు ఆచార్యులవారు బాధ్యులు కా"రనికూడ. మరల చెప్పుచున్నాను నావిమర్శలో చెప్పినసంగతులనే, "విమర్శదృష్టితో జూచినచో నిందు లోపము లున్ననేమి, విషయబాహుళ్యమునుబట్టి అందరు చదువవలసిన గ్రంథ మిది...దోషముల కేమి, లోపముల కేమి, వేలువేలుగ్రంథముల రూపమున నూతన విజ్ఞానము మన తెలుగులోని కెంత ఎక్కువగ వచ్చిన నంత మంచిది," యని.

మద్రాసు
27-7-1936

పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు

వా ఙ్మ య వీ థి

హిందూదేశము : క్రైస్తవ ప్రభుత్వ నిర్మాణ తత్త్వము. అనువాదకుడు మహీధర జగన్నాథరావు. విశ్వసాహిత్యమాల, ముంగండ, తూర్పుగోదావరి. ౨౦౧ పుటలు. ౮ అణాలు.

కొన్నిసంవత్సరాల క్రితము 'మోడరన్ రివ్యూ'లో మేజర్ బాసుగారు మనదేశంలో యిప్పటి ప్రభుత్వము యేవిధంగా నాటబడి, యెదిగి, శాశ్వతమైనదో తెలియజేస్తూ, అదివరకు అందరకు తెలియని కొన్ని క్రొత్తవిషయాలను నిదర్శనాలతో నిరూపించి చాల అలజడి కలిగించినారు. ఈ వ్యాసాలనే Rise of the Christian Power in India (హిందూదేశంలో క్రైస్తవరాజ్యాంగప్రభుత్వవిజృంభణము) అనీ, Consolidation of the Christian Power in India (హిందూదేశంలో క్రైస్తవరాజ్యాంగప్రభుత్వస్థాపన) అనీ రెండు గ్రంథాలు గా ప్రచురించారు. రెండవ గ్రంథానికి అనువాదమే జగన్నాథరావుగారిది.

'అనువాదము' అనడముతోనే 'మాతృక'లోని అభిప్రాయాలను, విషయాలను, ముఖ్యంగా వాతావరణాన్ని యెంతవరకు మన భాషలోనికి తేగలిగినామో చూడవలసివుంటుంది. అవకాశాన్నిబట్టి విషయాలను అన్నిటినీ తీసుకురావచ్చును గాని, అభిప్రాయాలతోను, వాతావారణంతోను అసలుగ్రంథానికి ప్రతి యేర్పరచుట చాలకష్టము. ఈకష్టమైనపనికి పూనుకొనుట అనువాదకుని కార్యదీక్ష సూచిస్తుంది. కాని, బాసుగారి గ్రంథాన్ని ఆంధ్రదేశానికి బాగుగా పరిచయం చేయకలిగిన వీరు, భాషాంతరీకరణంలో చాల లోట్లు చూపించినారు. సరియైన భాషాపద్ధతి (style) లేకపోవుటవల్ల, అనువాదము చదువుటకు చాల కటువుగా వుంటుంది. అచ్చుపొరపాట్లకు లోటు లేదు. (అది గ్రంథకర్త తప్పు కాదు.) అయితే, విదేశ ప్రభుత్వము యేయే అక్రమపు మార్గాలమీద ఆధారపడి, ఎట్టెట్టి కుతంత్రాలను సాయంగా తీసుకొని, యిప్పటికీ శాశ్వతంగా కనబడుతున్నదో సవిస్తరంగా వెల్లడిచేశారు. వీరు జరిగిపోయిన గాథను మరల ప్రస్ఫుటంగా చూపించి కంపింపజేస్తారు; మనము పడిన అవమానాలకు కన్నుల నీరు తెప్పిస్తారు; మన బానిసతనానికి కోపం తెప్పిస్తారు;—ఇప్పటి మన మాంద్యమును పోగొట్టడానికి చాల తోడ్పడతారు.

'విశ్వసాహిత్యమాల' వారి ఆశయాలు గొప్పవి. తక్కువ వెలతో మంచి పుస్తకాలు చందాదారులకు సరిగా అందజేయుట మాటలు కాదు. వీరి యితర గ్రంథాలు యింతవరకు 'లియో టాల్‌స్టాయి', 'ఇటలీ'. గ్రంథమాల ఆంధ్రభాషాభ్యుదయానికి తప్పక సాయపడుతుంది.

ఆచంట జానకిరామ్

కోపదారి మొగుడు. రచయిత టేకుమళ్ల కామేశ్వరరావు, పిఠాపురము. వెల ౪ అణాలు.

ఇది యొక సాంఘికవృత్తమును గూర్చిన నాటకము. "అనేకమంది కోపదారులైన మొగాళ్లు తమ భార్యలను పెట్టేబాధలు చూసి వీటి నివారణకొకనాటకం రాయాలని ఉద్దేశించాను" అని నాటకరచయిత

తన ఉపోద్ఘాతములో చెప్పుకొన్నాడు. ఈ ఉద్దేశ్యం ఈ నాటకరూపంగా కొనసాగునో లేదో చెప్పజాలము, గాని "కోపదారులైన మొగాళ్లు తమ భార్యలను పెట్టేబాధలు" మాత్రము నాటకరచయిత ఎట్టి మొహమోటమును లేక విశదముగ—కొన్ని సందర్భములందు అత్యధికముగా—వర్ణించినాడు. కథానాయకుడగు కోపదారి మొగుడు స్కూళ్ల డిప్టీ ఇనస్పెక్టరు. కాని ఇతని కోపమంతయు మొదటిభార్యపైననే. ఆమెను కన్న కష్టముల బెట్టి, ఆమె టైఫాయిడ్ జ్వరముతో బాధపడి చనిపోయిన వెంటనే "జీవితమంతా మంచారిపోయినట్లు అయిపోయిం"దని ఏడ్చి, పునర్వివాహపుమాట ఎత్తిన మండిపడుచునుండి, పిదప కొంతకాలమునకే వీరేశలింగంగారి తోటలో నున్న 30 ఏండ్ల వయస్సుగల ఒక వితంతువును వివాహముచేసికొన నుద్దేశించును. ఆమె కిదివరకే ముగ్గురుపిల్ల లున్నను, తనకుకూడ ఇద్దరుపిల్ల లున్నందున "సంసారపు టనుభవంలో ఇద్దరమొకటే స్థితిలో నున్నందున" పూర్తిగా పరస్పరమైత్రి పొసగుట సులభమని నిర్ధరించి ఆమెను వివాహముచేసికొనును. ఈ వివాహమునకు తన సవతియన్నకొడుకు గోపాలం మాత్రమే కాక తనముసలి మేనమామ జగన్నాథం కూడా అంగీకరించి తగుమట్టు సాయముజేతురు. ఇరుగుపొరుగువారి ఉబుసుపోకలు, పూర్వాచారపరాయణుల యధిక ప్రసంగములు, అమ్మలక్కల వ్యాసంగములు మొదలగు సందర్భములను నాటకరచయిత ముచ్చటగను జీవితానుకరణముగను చిత్రించియున్నను, ఒకొకసందర్భమునందు మాత్రము కేవలము అది సామాన్యముగ గన్పడి కావ్యములకును నాటకములకును ఉండవలసిన వస్తువిశిష్టతను గోల్పోవుచున్నది. చిట్టెమ్మ జీవితవిధానమును, ఆమె యవసానదశయు ఈ నాటకరచయితయందు నిగూఢముగ నున్న స్వభావచిత్రణ (characterization) రసోత్పాదకర శక్తులను సూచించుచున్నవి.

కాని నాటకరచయిత భిన్నలక్ష్యములను తన మనస్సునం దుంచుకొనుటవలన కథయొక్క బిగి సడలినది. ఒకటి రెండుపాత్రల స్వభావచిత్రణము (characterization) కూడ వన్నె దప్పినది. నాటకాగ్రేసరులుగూడ ఒకొకమారు లోనగు,నొకముఖ్యలోపమునకు ఈ నాటకరచయితకూడ లోనైనాడు. స్వభావచిత్రణమూలముగనో మరి ఇంకేవిధముగనో రసోత్పత్తి కలిగించుటయే నాటకరచయితయొక్క పరమావధియని వీరు గమనించిన ట్లగపడదు. ఈ ముఖ్యసూత్రమును ముందుంచుకొనక, కొన్నికొన్ని విషయములనుగూర్చి ప్రచారము (propaganda) సలుప నుద్దేశించి పాత్రలరూపముగ ప్రేక్షకులకు తానే యుపన్యాసముల నిచ్చుటకు గడంగినందున ఔచిత్యమునకు భంగము కలిగి, రసవంతముగ ప్రారంభమైన ఈనాటకము తుదకు sunday sermon గ మారి పోయినది. స్వభావచిత్రణమునుబట్టియు, కథావస్తువునుబట్టియు, రసపోషణమునుబట్టియు వ్యక్తముగుచున్న తమ కొన్నియభిప్రాయములతో తృప్తినొందక పాత్రల సంభాషణరూపముగ మరల నొకమారు వేరొకవిధముగ తన వివిధాభిప్రాయములను నొక్కి చెప్పుటకు ప్రయత్నించుటవలన ఈకళంకము సంభవించినది. ఇట్టి ప్రయత్నమే లేకున్నచో ఈనాటకము నాలుగవ అంకముతోనే పరిసమాప్తిజెందియుండును. నేటి వర్ణాశ్రమపరిస్థితులను గూర్చియు, వర్ణాంతర శాఖాంతర వివాహములను గూర్చియు, communalism వల్ల కచేరీలయందును కళాశాలలందును కలుగు హానినిగూర్చియు, విగ్రహారాధనను గూర్చియు, "పెళ్లిళ్లలో డబ్బు తగలెయ్యడం" గూర్చియు, ఇతర విషయములనుగూర్చియు చర్చయే అనవసరమైయుండును. తిండిపోతుగను, సామాన్య వృద్ధునిగను చిత్రించిన జగన్నాథమును తుదకు సంఘ సంస్కార నాయకునిగ జేయ నావశ్యకత యుండి యుండదు. కొంత వ్యక్తిత్వము నొసంగి చిత్రించిన గోపాలం అను పాత్రమునకు తుదకు వ్యక్తిత్వమును పోగొట్టి సంఘ సంస్కార నాయకుడగు జగన్నాథమున కొక సామాన్య అనుచరునిగ జేయ నావశ్యక ముండి

యుండదు. ఏవిధముగనైనను తన యభిప్రాయముల నన్నిటిని తెలియజేసి కొంత propaganda చేయవలెనను నాటకరచయితయొక్క ఉద్దేశమే దీని కంతటికి కారణము. విమర్శదృష్టితో జూచినచో, ఈ నాటక రచయిత నాలుగంకములను ఒక్కపెట్టున వ్రాసి, పిమ్మట కొంతకాలమునకు ఐదో అంకమును తీరికగ వ్రాసి మిగత భాగమున కతికించినట్లు గన్పడుచున్నది.

నాటకమునంతటిని మూడు రోజులలో వ్రాసితినని నాటకరచయిత తన యుపోద్ఘాతమునందు చెప్పుకొనియున్నాడు. ఇట్టి రచనవలన రసోత్పాదనము సుకరమైనను, స్వభావచిత్రణము మాత్రము కొన్ని లోపములకు గురియగుచున్నది. అట్టి లోపము లిందుగూడ కొన్ని గాన్పించుట యొక విశేషము గాదు. రంగముల సంఖ్య నధికముగ పెంచి ఒక్కొక్క రంగమును చాల చిన్నదిగ చేయుట రసపోషణమునకు అనుకూలమగు విధానము కాజాలదు. ఈ చిన్ననాటకమునందు ఇరువదియొక్క రంగము లున్నవి. కొన్ని కొన్ని రంగములు రెండు పుటలనుగూడ మించవు. గాన ఇట్టి నాటకములను ప్రదర్శించునపుడు ప్రేక్షకుల దృష్టిని కథావస్తువునందు కేంద్రీకరింపజేసి రసోత్పత్తిని కలిగించుట చాల కష్టము. భాషావిషయమున నాటకరచయిత యవలంబించిన మార్గము ఆధునిక సారస్వతాభివృద్ధియం దుత్సాహమున్న ఎల్లరకును సంతోషదాయకమే.

పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు

సాహిత్యతత్త్వవిమర్శనము. రచయిత జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, ఎమ్.ఏ., బి.ఎల్. ఆంధ్ర పబ్లిషింగ్ హౌస్, ౨౧ ఎర్రబాలుచెట్టి వీధి, జి.టి., మద్రాసు. డెమీ ౨౦౬ పుటలు. రు ౧-౮-౦.

సాహితీ హృది, శైలి, మాతృభాష, లలితకళలు, నాట్యకళ మొదలైన వివిధవిషయాలను పట్టి యిందు పదుమూడు సారస్వతవ్యాసము లున్నవి. 'ఉత్తమ సారస్వతమును, ఉత్తమజీవనమును, ఉత్తమమతమును వేఱు చేయుట అసాధ్యమని నాతలంపు' అన్న వీరివాక్యమువల్ల సారస్వత ప్రయోజనముపై వీరి కెంతటి తాత్పర్యమో తెల్లమవుతున్నది. సృష్టియందూ, కవి హృదయమందూ, కవి కృతియందూ కలశక్తి ఒక్కటే అనినీ, అదే 'సాహితీహృది' అనినీ వివరించడానికి వీరు వివిధవిషయాల తమకుగల విపుల పరిజ్ఞానమును వినియోగపరిచినారు. ఇందలి వ్యాసము లన్నిటనూ ఏదోవిధముగా ఈ దృష్టి సూత్రముగా ఉన్నది. సాహిత్యాదికళలను పరిశీలించేటప్పుడు కూడా వీరు ఈ 'హృది' దృష్టితోనే చూచుటవల్ల, వానికిగల ఒకవిశిష్టమైన స్వరూపము, విభిన్నత వీరికి గోచరించలేదు. అనేక వ్యాసాలలోని గోష్ఠి ఒక్కటే ఐనది. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు తమ (ఆంగ్ల) ఉపోద్ఘాతమున, వీరి వివిధవిషయముల పాండిత్యమును మెచ్చుకుంటూ, క్రమశః వీరికి విజ్ఞానము వికసించి, శైలి సాఫుదేరి, విషయైక్యమున్ను, రచనాసౌందర్యమున్ను రాగలవని ఆశించి, 'కష్టతరమైన విమర్శకళయందు వీరి కసిగల పూనికకు' జయము నపేక్షించిరి. ఏ విషయము అవలంబించినా, విపులముగా ప్రసంగించగల సామర్థ్యము వీరి కున్నది.

కొంపెల్ల జనార్దనరావు

గోలకొండ పత్రిక పదునొకండవ సంవత్సరాది సంచిక. త్రూపుబజారు, హైదరాబాదు, దక్కను. సంపాదకుడు కొండా బాలకృష్ణా రెడ్డి.

ఇందు ప్రసిద్ధులైన మాడపాటి హనుమంతరావుగారు, నుసర్ల శ్రీరామనరసింహంగారు, కురుగంటి సీతారామయ్యగారు, రాయప్రోలు సుబ్బారావుగారు, సురవరము ప్రతాపరెడ్డిగారు, శేషాద్రి రమణకవులు

మెుదలైనవారు పలు విషయాలను గురించి పలు వ్యాసాలు వ్రాసిఉన్నారు. పత్రికలు తామున్న ప్రదేశానికి తగిన సేవ చేయగలిగితే దేశము మొత్తానికి ఒక ప్రత్యేకమైన సేవ చేసినట్లే. గోలకొండపత్రిక ఆంధ్రదేశ మంతటికీ పనికివచ్చే విషయాలలో శ్రద్ధ తీసుకొనడమే కాక, నిజామురాష్ట్రమునకు అనల్పమైన సేవ చేస్తున్నది. నిజాంరాష్ట్రమందు సగభాగ మాక్రమించిన తెలంగాణపు తెలుగువారి శ్రేయోభివృద్ధులను గురించి తెలుగువారెల్లరు తెలిసికొనుట ఆవశ్యకము కనుక నిజామాంధ్రులు తలపెట్టుతున్న ఉద్యమాలకు, స్థాపిస్తున్న సంస్థలకు, ఇట్టి పత్రికలకు తగిన ప్రోత్సాహ మొసంగుట అవసరము. గోలకొండపత్రిక క్రమాభివృద్ధి జెందుట ఆనంద దాయకము. ఈ పదునొకండవ సంవత్సరాది సంచిక అనేకములైన మంచి వ్యాసాలతో విరాజిల్లుతూ, వ్యావహారికములైనటువంటీ, సాంఘికములైనటువంటీ సమస్యలను పెక్కింటిని ముందుపెట్టుతున్నది.

ప్రతిభ. నవ్యసాహిత్య పరిషత్పత్రిక. మొట్టమొదటి సంచిక. సంపాదకుడు తెలికిచర్ల వెంకటరత్నం. నవ్యసాహిత్యపరిషత్తు, గుంటూరు. వెల ౮ అణాలు. సంవత్సరపు చందా ౨ రూపాయలు. త్రైమాసికి.

నవ్యసాహిత్యపరిషత్కార్యాలలో ఒకటైన పత్రికా నిర్వహణము ప్రారంభమైనది. 'ప్రతిభ' తొలి సంచికలో సంపాదకులు నవ్యసాహిత్యపరిషత్తు చరిత్రము ౧౯33 లో అది యేర్పడ్డది మొదలు వివరించి దాని లక్ష్యాలను, కార్యవిధానమును వివరించినారు. మరిన్నీ వివిధ సారస్వత, విద్యావిషయాల పైని అభిప్రాయాలు వెల్లడించి పత్రికకు గొంతు ఉన్నదని చూపినారు. ఇందలి వివిధ వ్యాసాలున్ను నవ్యసాహిత్యపరములై పరిషత్కార్య పరాయణతకు అత్తిఉన్నవి. కాకినాడలో జరిగిన నాలుగవ పరిషత్సమావేశానికి అధ్యక్షులైన కావ్యవ్యాకరణ తీర్థ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారి అధ్యక్షోపన్యాసము, 'ఆంధ్రవాఙ్మయం: పుట్టుపూర్వోత్తరాలు' అన్నది, పేరుకు తగి ముఖ్యంగా సాహిత్యచరిత్రాన్ని అంతను సంగ్రహముగా పరామర్శిస్తున్నది. '.. పురాణాలు తెలుగులోనికి తర్జుమాలుచేసినా, లేక పురాణాల ఆధారాలమీద పెంచి ప్రబంధాలుగా మూటకట్టినా, ఫలితం ఒక్కవిధంగానే ఉంది కాబట్టి........క్రీస్తుశకం 19 వ శతాబ్ది ఆఖరుదాకా ఉన్నసాహిత్యం పురాణసాహిత్యం అన్నమాట' అని వీరు ఆ సాహిత్యమునంతనూ ఒక్కమూటకట్టి, 'పరిశేషన్యాయంచేత...పురాణసాహిత్యం కానిదంతా గాని, లేక, ఈ నవయుగంలో [పరిశేషన్యాయంచేత 19 వ శతాబ్దికి ఇటీవల] ప్రాదుర్భవిస్తూఉన్న సాహిత్యంగాని, నవ్యసాహిత్యంగా మనం అనుకోవచ్చు' అని నవ్యసాహిత్యాన్ని విడదీసినారు. ప్రబంధవాఙ్మయముపై వీరు వేసిన విమర్శనమును బట్టి సహా పురాణాలకంటె భిన్నమైన 'ఫలితం' వాటివల్ల కనబడుతున్నప్పటికీ అవి పురాణయుగములోనే అణపబడ్డవి: 'ఫలితము'ను బట్టియే సాహితీలక్షణ నిరూపణము కాని, ఈ యుగవిభజనము కాని చేయుట ఒప్పిదమే అని వీరి అభిప్రాయముగా కన్పడుతున్నది. నవ్యసాహిత్యమునందు విశిష్టత వివరించ పూనుకొన్న వీరు దానిని ఆ విశిష్టతనుబట్టి విడగొట్టితే బాగుండేది. కాని, ఆంధ్రసాహిత్యమున్నూ, సంస్కృత ప్రాకృతాది సాహిత్యములున్నూ విరివిగా తరిచిన శ్రీ శాస్త్రిలుగారు నవ్యసాహిత్యమును గర్హించేవారిని తీవ్రముగా విమర్శించి నవ్యసాహిత్యాన్ని సమర్థించడానికి తొలినుండీ పూనుకొన్న ప్రఖ్యాతి సామర్థ్యాలకు వీరి అధ్యక్షోపన్యాసం తగియే ఉన్నది. కుందూరి ఈశ్వరదత్తుగారు 'శాసనములలోని తెలుగుభాష' అనే వ్యాసమందు ఆ భాషనుండి మచ్చుకి కొన్నివిశేషాలను చూపి అవి వైయాకరణులకూ

నిఘంటునిర్మాతలకూ ఉపయోగకరములని చెప్పినారు. ఇందు '"అందు" కళ' అని వీరు చూపిన ఉదాహరణాలు తమ పని తాము చేయవు. కాని యిందు కొన్ని విశేషాలు (విరివిగా కాకపోయినా,) లేకపోలేదు. ఛందశ్శాస్త్రరహస్యాన్ని గాలించిన శ్రీ గిడుగు సీతాపతిగారు 'పద్యరచన' అనే ముచ్చటైన వ్యాసం వ్రాసినారు. వృత్తాదులలో సహా పాటలలోవలె 'తాళము', గుప్తముగా, ఉంటుందనీ, కేవలము మాత్రాక్షరముల గణము ఏర్పరుచుకొని వాటిలెక్కతో కట్టిన పద్యలక్షణము లయగతులకు అనుకూలపడక వికటగతులుకూడా బోధించేది కావడానికి వీలుండడంచేత పద్యలక్షణం లయప్రధానంగా అవగాహన చేసుకోదగుననీ, మరిన్నీ అక్షరాల ఊతను (accent) బట్టి నడక మారుతూఉంటుంది కాబట్టి, కేవల గణ ప్రాధాన్యమును పాటించక నడకను పాటిస్తూ, నడకలు ఎన్ని రకాలుగానో నడిపించుకోడానికి వీలుండగా, సంప్రదాయ విరుద్ధమని జంకక ఆంగ్లకవులవలె వివిధ చ్ఛందోగతులు సృష్టించుకొని నవ్యకవులు రచన సాగించవలెననీ, కృతకభాషను వదలి వ్యావహారికము పాటలకూ పద్యాలకూ ఉపయోగపరుచుకో చెల్లుననీ, వాడుకభాషకు సహా ఛందస్సు ప్రతికూలమని యెంచనక్కరలేదనీ వీరు ఇంపుగా తెలిపినారు. ఆంగ్లమున మిస్ కాథరీన్ విల్సన్ వలె వీరు మన ఛందస్సును సంగీత శాస్త్రదృష్ట్యా పరిశీలించడానికి పూనుకొన్నారు. సంగీత శాస్త్ర జ్ఞానము కవికి ఉపయోగపడే పరికరాలలో ఒకటి అన్నది నిజమే కాని, దానికి అమితప్రాముఖ్యము నిచ్చిన ప్రమాదమునకు పాల్పడకపోతే వీరి భావాలు ఛందస్సంస్కారానికీ, తదవగాహనానికీ చాలా మార్గదర్శకములు. మండపాక పార్వతీశ్వరశాస్త్రిలుగారు 'రాష్ట్రేతరాంధ్రులు: నవ్యసాహిత్యము' అనే వ్యాసం వ్రాసినారు. సంపాదకులు తెలికిచర్ల వెంకటరత్నంగారు 'భాషాసంస్కరణము' అనే వ్యాసంలో మన భాషకు గల సంస్కరణావశ్యకతను గురించి చర్చించినారు. చింతా దీక్షితులుగారి 'సూపరెంటు కూతురు' అనే కథ, శ్రీరంగం శ్రీనివాసరావు, వేదుల సత్యనారాయణశాస్త్రి, మల్లవరపు విశ్వేశ్వరరావు, నోరి నరసింహశాస్త్రి ప్రభృతుల పద్యాలు మంచి సాహిత్యరచనములు. నవ్యసాహిత్యములో నవ్యతర గతులు చూపే శ్రీనివాసరావుగారి రచనలు మరికొన్ని రచనలతోపాటు ఈ సంచికకు తగిఉన్నవి. బ్రహ్మశ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారున్ను, డాక్టరు బుర్రా శేషగిరిరావుగారున్ను వ్రాసిన జాబులు నవ్యసాహిత్యము గురించి ఉద్బోధము ఇస్తున్నవి. గ్రంథసమీక్షలతో, సంపాదకుల విజ్ఞాపనములతో, అందమైన తీర్పుతో ఇది మంచి పత్రికలలో ఒకటై ప్రకాశిస్తున్నది.

వీణ. మాసపత్రిక. సంపాదకుడు పాటిబండ మాధవశర్మ, ఎమ్.ఏ. (ఆనర్సు),
తేలప్రోలు, కృష్ణాజిల్లా. వెల ౪ అణాలు. సాలుచందా రు ౨ లు.

ఇది సర్వవిషయాలూ ప్రసంగించే మాసపత్రిక. కాని లలితకళావిమర్శకూ, సాహిత్యరచనములకూ ప్రాధాన్య మిచ్చి చక్కని రచనములు వెలువరుస్తున్నది. దీనికి మంచి రచయితల తోడ్పాటు కలదనుటకు పెక్కుశాఖల కృషి చేస్తున్న సారస్వతులు దీని సంపాదకవర్గము నలంకరించడమే తార్కాణ. ముఖ్యముగా యువజనుల ఉత్సాహమునకు ముఖపత్రము కాగల సూచనలు దీనిలో కనబడుతుండడం ప్రశంసార్హము. అనేకవిధాల పత్రికానిర్వహణము కష్టసాధ్యమైన యీ దేశాన, ఈ రోజులలో, తక్కిన అన్నిపత్రికలకంటె ఖరీదైన కాగితముతో, మంచి తీర్పుతో, ఏబదిపుటల గ్రంథము ఇంత తక్కువ చందాకు అందజేయ పూనుకొన్న యువజనుల పూనిక మిక్కిలి కొనియాడతగ్గది.

శృంగాటకం

'త్రివేణి' భారతసారస్వతానికి వాణిగా నిలిచి, ప్రపంచ సంస్కృతి వికాసానికి అంకితమై విదేశము లందు సహా అందచందాలకు మెప్పు గాంచిన పత్రిక. దాదాపు తొమ్మిది సంవత్సరాలు అమితప్రయాసలు గడచి, ఈ జూలైనుండి మాసపత్రికగా మారి మరింత శ్రమలకు సిద్ధపడి మరింత జనాదరానికి ఆశపడుతున్నది. ఒక ఆంధ్రవీరుని పూనికరైన ఈ గొప్ప సంస్థ అడ్డులేని అభ్యుదయము పొందడానికిగాను, ఉన్నతమైన లక్ష్యము మరింత యేపుగా సాధించడానికిగాను ముఖ్యముగా ఆంధ్రులు తోడుపడడం కర్తవ్యం. ఇతర జనుల తోడ్పాటు పత్రిక విలువనుబట్టి కొంతవరకు ఏర్పడుతుంది కాని, ఆంధ్రులు ప్రత్యేకాభిమానము చూపడం సహజమైన ధర్మం. అధమం, పత్రిక విలువనుబట్టి చేయవలసిన సాయమైనా ఆంధ్రులు చేయగలిగితే పత్రికకు ఇదివరకు కలుగుతూ ఉన్న కష్టంకూడా కలగదని చెప్పవచ్చు. సాయము మాట అటుండగా, 'త్రివేణి'ని ఎక్కువగా వినియోగపరుచుకోని ఉదాసీనత ఆంధ్రులు దాటవలసి ఉంటుంది. ముఖ్యముగా ఆంధ్రజాతికి మనస్సులు సరిలేకపోవడానికి చాలా కారణాలు లేకపోలేదు కాని, వారి బుద్ధికుశలత, కళాభిరుచి యెంత నిజమో వారి ఉదాసీనతకూడా అంత నిజమైనదని ప్రత్యేకము లెక్కపెట్టుకోవలసే ఉంటుంది. దేశములో, ప్రపంచములో తమ స్థానాన్ని సంతరించుకోగల అవకాశాలు ఎక్కువౌతున్నప్పుడు తెలుగువారు తగిన ఉత్సాహం కనబరచక మానరు. ఇందులకుగాను సారస్వతవిషయాలలో ఎక్కువ శ్రద్ధ వహించి, తదారాధనకై ఉత్సుకపడ్డ పత్రికలకు క్షేమము కలిగించి అందువల్ల మేలు పొందుతూ, తమ సత్తువను తెలుసుకొనడమూ, పెంపొందించుకొనడమూ ముఖ్యమని ఆంధ్రులు గమనించక చాలాకాలము ఉపేక్షించరు.

* * * *

ఈ సందర్భములో 'ప్రబుద్ధాంధ్ర' పత్రిక నిలిచిపోవడం మిక్కిలి శోచ్యమని స్మరించక మానలేము. బహుముఖములైన ఆంధ్ర జాతీయతను ముక్తకంఠముతో ఉద్బోధించి సార్థకనామధేయఅయిన యీ పత్రిక, సంపాదకుని అమితకార్యదీక్ష అయినా ఉపయోగపడక, అంతరించి ఒకలోటు మిగిల్చింది. ఈ పత్రిక వ్యాఖ్యలు ఆంధ్రత్వాభిమానములో ఒక మతాభినివేశము దాల్చి కొంత సంకుచితత్వము కనబరుస్తూ రాకపోలేదు కాని, ఆ అభిమానము విలువ అంతట ఉపేక్షించతగ్గది కాదు. ముఖ్యముగా హిందీయెడల వివాదము ఈ సంపాదకులు పాదుకొల్పినది ఆంధ్రదేశాననే కాక కర్ణాటక తమిళ ప్రాంతాలకుకూడా పాకి ఒకానొక ఆలోచన దేశములో ప్రచలితం చేయడమే కాక, జాతీయ దేశీయ (సామాన్య) భావాల వివరణానికీ, ఆ వివరణము ప్రాముఖ్యము పొందడానికీ కారణ మయింది. స్వల్పములోనే 'ప్రబుద్ధాంధ్ర' దేశములో విరివిగా వ్యాప్తి గాంచిన దయిన్నీ అంతరించినదంటే ముఖ్యముగా ఒక కారణం కనిపిస్తుంది. చిన్నరకం పత్రికలు చౌకధరలలో ఎంత విరివిగా అమ్ముడుపోయి లాభాలు చేకూర్చినా, కొంత ఉన్నతభావాలకు కట్టుపడ్డ పత్రికలు తక్కువ వెలలకు పోయి తగిన రాబడి తెచ్చుకొనడం కష్టసాధ్యమని యిదొక పాఠముగా గుర్తించవలసి ఉన్నదేమో.

* * * *

మదామ్ సోఫియా వాడియాగారు (బొంబాయి) అర్జెంటైనాయందలి Buenos Ayres నందు సెప్టెంబరులో జరగబోయే పి. ఇ. ఎన్. ప్రపంచ మహాసభకు భారతదేశపు ప్రతినిధిగా నియుక్తురాలైనది. Poets, Playwrights, Editors, Essayists and Novelists—ఈ పేళ్ల వ్యుత్పన్న రచయిత లందరికీ ఈ P. E. N.

Club ప్రపంచమంతటా కేంద్రసమాజమై, వివిధ దేశాలలో, భిన్న జాతులలో సంస్కృతిపరమైన ఐక్యము పరిణతపరచడానికి పదియేనేళ్లుగా పాటుపడుతున్నది. డాసన్ స్కాట్ సతి ఇది నెలకొల్పి జగద్విఖ్యాత ప్రతిభుడైన గాల్స్వర్దీని మొదటి అధ్యక్షుడుగా సంపాదించ గల్గినది. గాల్స్వర్దీ ఈ సంస్థ లక్ష్యాలను మిక్కిలి కొనియాడి వ్యాప్తికి తే యత్నించడమే కాక, తనకు నోబెలు బహుమానముగా లభించిన ధనమంతా యీ సంస్థ భండారములో పోసినాడు. అతని మరణానంతరము, ప్రపంచ చరిత్రాది గ్రంథాలు వ్రాసి విఖ్యాతి బడసిన హెచ్. జి. వెల్సు దీని కధ్యక్షుడైనాడు. దీనికి అన్ని దేశాలలోనూ శాఖలు నెలకొంటున్నవి. భారతదేశములో ౧౯౩౩ సం.లో బొంబాయి నగరమున ఏర్పడెను. దీనికి శ్రీ డా. రవీంద్రనాథ టాగూరుగారు అధ్యక్షుడు; సర్ సర్వేపల్లి రాధాకృష్ణ, శ్రీమతి సరోజినీ నాయుడు, శ్రీ రామానంద ఛటర్జీ ఉపాధ్యక్షులు; కిందటి సంవత్సరమున్ను ఈ సంవత్సరమున్ను ప్రపంచ మహాసభకు భారతప్రతినిధి అయిన శ్రీమతి సోఫియా వాడియా దీనికి కార్యకర్త్రి. ఇతర దేశాల రచయితలకూ భారతీయ రచయితలకూ పరస్పర పరిచయము సమకూర్చడమూ, కవిప్రపంచములో భారతీయులకుకూడా మరింత బాంధవము సంపాదించడమూ, భారతములో సహా ప్రాంతాలకు పరస్పరము సంయోగము తీసుకరావడమూ దీని లక్ష్యాలలోనివి.

*   *   *   *

ఇటీవల లండను నగరమున జరిగిన International Association of Writers for the Defence of Culture అనే ప్రపంచ గ్రంథరచయితల సమావేశమున్ను పి. ఇ. ఎన్. సమాజమువారివలె ఉన్నతలక్ష్యము కనబరుస్తున్నది. జర్మనీ మొదలైన విశంకప్రవృత్తిగల ప్రభుత్వాలలో నలిగిపోతున్న కళాసంపత్తినీ, సంకుచితమైన అభిప్రాయాలుగల ప్రభుత్వమువల్ల తిరస్కారమూ, అనాదరమూ, బహిష్కరణమూ పొందిన మహామేధావుల గొప్పతనమునూ విశాలదృష్టితో నిలబెట్టి, స్వాతంత్ర్యమును, మానవస్వత్వమును ఆరాధించి ఉద్ధరించే శుద్ధలక్ష్యులు—కవులు, కళాకారులు, దార్శనికులు, చరిత్రకారులు, నవలాకారులు, రాజనీతివేత్తలు, పండితులు మొదలైనవారు—జగత్తు కంతకూ చెందిన సొత్తు అనే భావాన్ని లోకములో వెల్లడించి వ్యుత్పన్నతను సంరక్షించే నిమిత్తమై—శాంతి స్వచ్ఛందతల పేర 'రచయితల' రక్షణ ప్రధానాశయంగా—ఈ సంస్థ ప్రవర్తిల్లుతున్నది. విశాలమైన ఈ ఆలోచన ప్రపంచమంతటా అనేక ముఖాల వ్యక్తమౌతున్నది. ఇందు జాతి, భాషా, భూరూపవిభిన్నతలు అడ్డంకులు కాకుండే రీతిని సాధన కావించడానికి సర్వవిధాల ప్రయత్నములు జరిగినా, ఈ జాత్యాదిస్వత్వములు—అవి సంకుచితములు కాక సంరక్షకములు మాత్రమే అవుతుండగా—భగ్నము కావలసిన అవశ్యకము కన్పట్టడంలేదు. కాని జాతుల అంతరంగములో ఒక ఏర్పాటు విశాలదృష్టితో కావలసి ఉన్నది.

*   *   *   *

భారతదేశ సారస్వతము నిమిత్తమై ఒక ప్రపంచ సభకు ప్రతినిధి పోవడమనగా ఏమిటో అని ఆశ్చర్యమవుతుంది. ఏమంటే, భారతసారస్వతము, ఆధునికమైనది, ఏ ఒకరికి తెలిసినది? తెలియడానికి తగ్గ అవకాశమేమున్నది? ఇన్ని భాషలలో సారస్వతములు, ఇంచుమించు అన్ని చోట్లనూ, అభ్యుదయ సంరంభములో తాండవిస్తున్నవి నిజమే కాని, ఆంగ్లములోనికి తర్జుమా వచ్చినంతవరకు వాటి ప్రశస్తి కొందరికి మాత్రము అపాటి సమగ్రముగా తెలిసినది, అంతే. దేశాంతరాలలో వీని ప్రసిద్ధి అయినా, పరిచయమైనా కొలది అయిన ఆంగ్లానువాదముల పయినే నిలిచి ఉన్నది. ఆ అనువాదప్రకటనాదులు ఇన్ని భాషలలోనుండి

35705

జరిగినది తక్కువ అనియే యెంచవలెను. మాడర్న్ రివ్యూ, త్రివేణి వంటి పత్రికలు ఈవిధమైన ప్రయత్నము సాగిస్తున్నా, ఈలాటి సార్వజనిక సన్నివేశాలకు అనుకూల పరిస్థితు లేర్పరచగల ప్రయత్నాలు విరివిగా ఈ ఒక దృష్టితో జరగవలసే ఉంటుంది. అఖిల భారత దృష్టితో హిందీ మాధ్యమముగా సారస్వతము కేంద్రీకృతము చేస్తున్న మున్షీ ప్రభృతుల పూనిక మిక్కిలి ప్రశంసార్హమే కాని, ఇతర దేశాలతో సహచారమని వచ్చినపుడు ఆంగ్లములో తిరిగి యీతపనీ జరగవలసే ఉంటున్నది. పి. ఇ. ఎన్. వారి కార్యవిధానము ప్రతీక్షించదగ్గది.

*　　　*　　　*　　　*

కాని యీ సందర్భములో వంగదేశమువిశిష్టత గమనించదగ్గది. భారతదేశములో ఇన్ని భాషలున్నా ప్రపంచ మహాసభలందు భారతదేశ మొక స్వరూపముగా ప్రతినిధని అహ్వానిస్తారు. సాహిత్య విషయము భాషపై ఆధారపడ్డదన్నది ప్రసిద్ధమే అయినా, భారతదేశానికి శ్రీమతి సోఫియా వాడియాగారు ప్రతినిధిగా పోయినది. ప్రాంతాలు గణించడం కష్టమే. కాని వంగప్రాంతానికి మాత్రం ప్రత్యేకం డాక్టరు కాళిదాస నాగ్ గారు ఆహ్వానం పొందినారంటే, వంగభాష ఇన్ని భాషలలో ఒకటయిన్ని ప్రపంచ దృష్టి నాకర్షింపగలదై అన్ని ప్రాంతీయ భాషలకూ మేలుబంతియై, స్వభాషలయందయినా ప్రతిభాకృషులు ప్రాంతములందే అణగిమణగి పోవడానికి బదులు ఆయా భాషకూ ప్రాంతానికీ ప్రఖ్యాతియే సంపాదించగలవని బోధిస్తున్నది. ఇందుకు టాగూరు కవి మున్నగువారి రచనలు మాడర్న్ రివ్యూ పత్రిక ఆంగ్లములో వెలువరించి ప్రపంచానికి పరిచితపరచడంవద్దనుంచీ జ్ఞాపకము చేసుకోవలసే ఉంటుంది. భాషాఖండమందు సాహిత్యకృషీ, అది వెల్లడికి తెచ్చే ఏర్పాటూకూడా అనేకవిధాల ప్రతిప్రాంతమందు జరగవలసే ఉంటుంది. అపరివ్యక్తముగానైనా, పరిషత్తులూ, పత్రికలూ ఇందుకు చాలా ఉపకరిస్తవి. వీని 'యేర్పాట్లు' రచనా స్వచ్ఛందతను కుంటుపరచకుండా చూడడం ఒక మెలకువగా మాత్రం నిలుపుకోవలె.

*　　　*　　　*　　　*

భారతీయసాహిత్యమునకు ముఖపత్రికగా బయలువెడలి సంవత్సరము కాకపూర్వమే, పదకొండుసంచికలతోనే, 'హంస' (హిందీమాసపత్రిక) అంతరించింది. సేఠ్ గోవిందదాస్ గారి 'సిద్ధాంత స్వాతంత్ర్య'అనే నాటకము ప్రకటించిన 'హంస' ప్రభుత్వమువారు అందులకై కోరిన రు ౧,౦౦౦ ధరావతు ఇచ్చుకో లేకపోయింది. పెద్ద సన్నాహముతో నెలకొన్న యీసంస్థ తన మహదాశయాలను నిర్వర్తించుకొంటున్న సంతుష్టి కలిగినంత పడయక పూర్వమే అంతరించడం ఎల్లరకూ దుఃఖదాయకము.

*　　　*　　　*　　　*

జి. కె. చెస్టర్‌టన్ మరణించి ఆంగ్లవాఙ్మయ నిర్మాతలనుండి ఒకవిచిత్రమైన పీఠము ఖాళీచేసి మృతజీవులలో చేరుకొన్నాడు. మాగ్జిమ్ గోర్కీ రష్యను వాఙ్మయవీథికి దురదృష్టము మిగుల్చుటతో ప్రపంచ వాఙ్మయ వాటిలో ఒక మహాకృషిని వదలిపోయినాడు.

*　　　*　　　*　　　*

ఋషి కావ్యకంఠ అయ్యలసోమయాజుల గణపతిశాస్త్రిగారు, ఆంధ్రవాల్మీకి వాసుదాసుగారు కీర్తి కాయులై ఆంధ్రజనావళికి నష్టము వాటించినారు. వావిలికొలనువారు ఆర్యకథానిధి, సుభద్రావిజయ నాటకము, రామాయణము మొదలైన వివిధకృత్యులకు చేసిన గ్రంథములు రచించి ఆంధ్రులమనస్సుకూ బుద్ధికీ కూడా చేరువకు వచ్చినవారు.